thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 211 | కరీంనగర్ బుధవారం, 8 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కశ్మీర్‌లో 9,500 బంకర్లు.. మరిన్ని నిర్మిస్తాం: సీఎస్ అటల్

జమ్మూకశ్మీర్ : భారత్ - పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి 9,500 బంకర్లు ఉన్నాయని, జనావాసాలే లక్ష్యంగా పాకిస్థాన్ కాల్పు లకు తెగబడుతుండడంతో స్థానికుల భద్రత దృష్ట్యా వాటి సంఖ్యను మరింత పెంచుతామని జమ్మూకశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అటల్ డుల్లూ అన్నారు. నియంత్రణ రేఖ వెంబడి ఉన్న కాల్పుల ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించి స్థానికులతో మాట్లా డారు. అవసరానికి అనుగుణంగా బంకర్ల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రాణ, ఆస్తినష్టాలు జరిగాయని నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందజేస్తామని తెలిపారు. బాధితులకు సంఘీభావాన్ని ప్రకటించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి భద్రతకు, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.




బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పసిడి పరుగులు ఆగడం లే దు. ప్రతిరోజు సరికొత్త గరిష్టాలకు చేరుకుంటూ రికార్డులు నమోదు చేస్తోంది. తాజాగా బంగారం ధర మళ్లీ పెరిగింది. మంగళవారం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1, 23, 850కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.1, 15, 500ను తాకింది. మరోవైపు కిలో వెండి ధర రూ.1, 54, 350కు చేరింది. పండగల సీజన్ కావడం, అంతర్జాతీ యంగా మార్కెట్ల అస్థిరత, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి పతనం బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. వెండి కిలో రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉందని ఇటీవల మార్కెట్ పండితులు అంచనా వేసిన సంగతి తెలిసిందే.




## గుడ్ న్యూస్.. త్వరలో తగ్గనున్న ఈవీల ధరలు..

రోడ్ ట్రాన్స్‌పోర్ట్, హైవేస్ మినిస్టర్ నితిన్ గడ్కరీ శుభవార్త చెప్పారు. త్వరలో ఈవీల ధరలు తగ్గనున్నాయని ప్రకటించారు. రానున్న 4 నుంచి 6 నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలతో సమానంగా ఈవీల ధరలు ఉంటాయని అన్నారు. ఈ మధ్య కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాహనాలు కొనాలనుకునేవారు ఈవీల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే, పెట్రోల్, డీజిల్ వాహనాల కంటే ఈవీల ధర ఎక్కువ ఉంటుంది. ఈవీలు అంత ధర ఉండటానికి కారణం వాటి బ్యాటరీలే. ఈ బ్యాటరీల కారణంగా ఈవీ కొనుగోలుదారులపై అధిక భారం పడుతుంది. బ్యాటరీ ప్రాబ్లమ్ వస్తే అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుంది. అధిక ధరలు, బ్యాటరీ మెయిన్‌టెనెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని చాలా మంది ఈవీలు కొనడానికి తటపటాయిస్తున్నారు. అలాంటి వారికి రోడ్ ట్రాన్స్‌పోర్ట్, హైవేస్ మినిస్టర్ నితిన్ గడ్కరీ శుభవార్త చెప్పారు. త్వరలో ఈవీల ధరలు తగ్గనున్నాయని ప్రకటించారు. సోమవారం ఆయన ఎఫ్ఐసీసీఐ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. నేను ఎలక్ట్రిక్ వాహనాలు లాంచ్ చేసినపుడు బ్యాటరీ ధర కిలోవాట్‌పర్ అవర్‌కు 150 డాలర్లు ఉండేది. ఇప్పుడు 55 డాలర్ల నుంచి 65 డాలర్ల మధ్యలో ఉంది.

రానున్న నాలుగు నుంచి ఆరు నెలల్లో ఎలక్ట్రిక్ స్కూటర్స్, కార్లు, బస్సుల ధరలు పెట్రోల్, డీజల్ వాహనాలతో సమానంగా ఉంటాయి. ట్రాక్టర్లు తయారు చేసే వారు.. వ్యవసాయ పరిశోధకులు క్లీన్ ఎనర్జీ పరికరాలపై పని చేయాలి. ఇథనాల్‌తో నడిచే ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, ఇంజిన్లు తయారు చేయాలి' అని చెప్పారు.




## పార్టీ మారితే పదవికి రాజీనామా చేయాలి..

నెల్లూరు: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఖండించారు. దాడికి ప్రయత్నం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఛీఫ్ జస్టిస్‌కి సంబంధించిన అంశం కాదు, సమాజానికి, వ్యవస్థకి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పార్టీ మారితే.. ఆ పార్టీ ద్వారా పొందిన పదవికి రాజీనామా చేయాలని వెంకయ్యనాయుడు తెలిపారు. రాజ్యాంగంలో 10వ షెడ్యూల్‌ని సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ మారి మంత్రులు అవుతున్నారని ఆరోపించారు. చట్టానికి అతీతంగా ఎవరూ వ్యవహరించకూడదని సూచించారు. ప్రజలకి అందించే ఉచితాలు పరిధులు దాటుతున్నాయని వివరించారు. ప్రభుత్వాలు తాహతుకు మించి అప్పులు చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు అప్పులు తెచ్చేటప్పుడు, ఎలా తీరుస్తారో ప్రణాళికలు అసెంబ్లీలో చర్చించాలని ఆయన కోరారు. చట్టసభల్లో కుటుంబ సభ్యులని దూషించడం సరికాదని వెంకయ్యనాయుడు హితవు పలికారు. అలాంటి వారిపై చట్టాన్ని ప్రయోగించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మన దేశంలోనే ఉందని గుర్తుచేశారు. మనదేశ కీర్తిని ప్రతి ఒక్కరూ చాటాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల క్రిమినల్ కేసులుపై రెండేళ్లలోపే విచారణ జరగాలని చెప్పారు. ప్రభుత్వాలు కోర్టుల సంఖ్యలు పెంచి, జడ్జీలని నియమించాలని కోరారు. రాజకీయ వారసత్వానికి తాను వ్యతిరేకమని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు.

# లోకల్ ఫైట్...

## 42శాతం రిజర్వేషన్లను హైకోర్టు కొట్టేస్తే పరిస్థితి ఏంటి?




## సర్కార్ ముందున్న ఆ 4 ఆప్షన్స్ ఏంటి?

స్థానిక పోరు త్రిశంకు స్వర్గంలో ఉంది. ఓవైపు రిజర్వేషన్లపై హౌస్ మోషన్ పిటిషన్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. అక్టోబర్ 8న కోర్టు ఇచ్చే తీర్పుపై ఉత్కంఠ కొనసాగుతోంది. అది అలా ఉండగానే లోకల్ బాడీ పోల్స్‌కు షెడ్యూల్ రిలీజ్ చేసింది ఎన్నికల సంఘం.

కోర్టు తీర్పు పాజిటివ్‌గా వస్తే సరే. లేకపోతే ఏంటి పరిస్థితి? బీసీ రిజర్వేషన్లను న్యాయస్థానం రద్దు చేస్తే సర్కార్ ముందున్న ఆప్షన్స్ ఏంటి? అసలు స్థానిక ఎన్నికలు జరుగుతాయా? లేదా? తెంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ఎపిసోడ్ టీవీ సీరియల్‌ను తలపిస్తోంది. ప్రతీ ఎపిసోడ్ ముగింపులో ట్విస్ట్ ఉన్నట్లు..లోకల్ బాడీ ఎన్నికలు..బీసీ రిజర్వేషన్లపై..ఎప్పుడూ ఏదో ఒక పేచీ వచ్చి పడుతూనే ఉంది. ఇప్పుడైతే ఏకంగా లోకల్ బాడీ ఎన్నికలకు సర్కార్ షెడ్యూల్ కూడా రిలీజ్ చేసింది. అక్టోబర్ 9న నోటిపికేషన్ విడుదల చేయనుంది.

అంతకంటే ఒకరోజు ముందు అంటే అక్టోబర్ 8న బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉంది.

**కోర్టు అలా చెబితే.. సర్కార్ ముందున్న ఆప్షన్స్ ఏంటి?...** ఇప్పటికే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై విచారించిన హైకోర్ట్.. గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉండగా..జీవో ఎలా ఇస్తారని ప్రశ్నించింది. అంతేకాదు సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని చెప్పింది. దీంతో ఈ నెల 8న బీసీ రిజర్వేషన్లను హైకోర్ట్ బ్రేక్ వేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయన్న టాక్ నడుస్తోంది. రిజర్వేషన్లు 50 శాతం దాటకుండా..ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశిస్తే ..పరిస్థితి ఏంటన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇప్పుడిదే అంశం ఇటు ఆశావాహులను..అటు ప్రభుత్వాన్ని టెన్షన్ పెడుతోందట. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు హైకోర్టు నోచెబితే..లోకల్ బాడీ ఎన్నికలపై ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుంది? సర్కార్ ముందున్న ఆప్షన్స్ ఏంటన్న క్యూరియాసిటీ పెరుగుతోంది. బీసీ రిజర్వేషన్లను హైకోర్టు రద్దు చేస్తే ప్రభుత్వం ముందు నాలుగు ఆప్షన్స్ ఉన్నాయని తెలుస్తోంది. వాటిలో ఒకటి హైకోర్ట్ ఆర్డర్స్‌పై సుప్రీంకోర్టుకు వెళ్లడం. రెండోది గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉన్న బిల్లుకు ఆమోదం తీసుకోవడం. మూడోది ఎన్నికలను మరింత ఆలస్యం చేయడం. నాలుగోది పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించడం. ఈ నాలుగు ఆప్షన్లు ప్రభుత్వం ముందున్నాయి. అయితే సుప్రీంకోర్టు 50శాతం క్యాప్ విధించిన నేఫథ్యంలో..హైకోర్టుకు వెళ్లే ఛాన్స్ తక్కువే. ఇక రెండో ఆప్షన్‌గా బిల్లుకు గవర్నర్ ఆమోదం పొందడం. ఇప్పుడు మరోసారి చివరి అవకాశంగా..బీజేపీని బీసీల ముందు దోషిగా నిలబెట్టే పొలిటికల్ గేమ్‌ను రేవంత్ సర్కార్ ఉపయోగించే అవకాశం ఉందట. ఇక ఎన్నికలను మరింత ఆలస్యం చేసే ఆప్షన్‌ను కూడా ఎంచుకునే ఛాన్స్ లేకపోలేదంటున్నారు.

**ఇప్పుడున్న వాటిలో ఇదే సర్కార్ ముందున్న బెటర్ ఆప్షన్..!...** అయితే ఇప్పటికే ఏడాదిన్నరగా పంచాయతీల్లో అధికారుల పాలన సాగతోంది. దీంతో కేంద్రం నుంచి వచ్చే నిధుల పంచాయతీలకు రావడం లేదు. ఈ పరిస్థితిలో ఎన్నికలు ఇంకా లేట్ చేస్తే.. ప్రభుత్వ పాలనపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందంటున్నారు. ఇక ఫైనల్‌గా పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లడం ప్రభుత్వం ముందున్న సేఫ్ ప్లాన్. దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి చిత్తశుద్దితో ప్రయత్నించినప్పటికీ..కేంద్రం సహకరించలేదని చెప్తూ..పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉందట. ఇప్పుడున్న ఆప్షన్స్‌లో ఇదే సర్కార్ ముందున్న బెటర్ ఆప్షన్ అంటున్నారు. లాస్ట్ ఆప్షన్ ప్రకారం పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్తే..గతంలో కేసీఆర్ సర్కార్ ఇచ్చినట్లు..బీసీలకు 23 శాతం, ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 9శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. బీసీ సంక్షేమ శాఖ ఈ రిజర్వేషన్లను ఖరారు చేస్తే..దీని ప్రకారంగా..పంచాయతీ రాజ్ శాఖ..కొత్తగా రిజర్వేషన్లు అలాట్ చేయనుంది. అయితే ఇది ప్రభుత్వానికి మరో సవాల్‌గా మారనుంది. మొన్న ఇచ్చిన జీవో ప్రకారం..బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తూ ఇప్పటికే రిజర్వేషన్లు ప్రకటించారు.

పాత రిజర్వేషన్లు ఇంప్లిమెంట్ చేస్తే మళ్లీ మొన్న ఇచ్చిన రిజర్వేషన్లు అన్నీ మారిపోతాయి. దీంతో ఇప్పటికే గ్రామాల్లో బెర్తుల కోసం పోటీ పడుతున్న ఆశావాహులను ఇది మరింత కలవరపెడుతోందట. మొత్తానికి బీసీ రిజర్వేషన్ల తుట్టెను కదిల్చిన రేవంత్ సర్కార్..ఎలా సేఫ్‌గా ల్యాండ్ చేస్తుందనే డైలమా కొనసాగుతోంది. ఇప్పటికే షెడ్యూల్ రిలీజ్ చేయడంతో ఎన్నికలకు వెళ్లడం తప్ప ప్రభుత్వం ముందు మరో మార్గం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఒకవేళ ఎన్నికలకు వెళ్తే పాత రిజర్వేషన్లు ఇంప్లిమెంట్ చేస్తారా లేక కొత్తగా ఇంకేమైనా ప్రతిపాదనలు తెరమీదకు తెస్తారా అనేది చూడాలి.

# సోనూకు మాడ్ డివిజన్ కమిటీ మద్దతు



## -ఆపేద్దాం హింసను ఆపేద్దాం -సైనిక దళాలు చర్యలను ఆపండి -మేం నెల రోజుల్లో నిర్ణయించు కుంటాం -మాడ్ డివిజన్ సెక్రటరీ స్పష్టం .!!

చురకలు ప్రత్యేక ప్రతినిధిమావోయిస్టుల్లో సైద్ధాంతిక చర్చ జరుగుతున్నది.సోనూ అలియాస్ అభయ్ సూచనలపై చర్చ జరిగింది ఆయన నిర్ణయం పట్ల మా మద్దతు ఉంది.దీనికోసం నెల రోజులు పాటు ఉభయులం ఓపిక పట్టాలని మాడ్ డివిజన్ కమిటీ రాణిత,సమితలు కోరారు.ఈ మేరకు ఈ నెల 4 న పత్రిక ప్రకటన విడుదల చేశారు. దీనికోసం అన్ని వైపులా ముఖ్యంగా సైనిక చర్యలు నిలిపివేసి తమ కు తగిన సానుకూల వాతావరణం కల్పించాలని సూచించారు.నెల రోజుల్లో అన్ని ప్రాంతాల ప్రజలతో అభిప్రాయాలు మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు.హింసను ఆపేందుకు సిద్ధంగా ఉన్నమని హామీ ఇచ్చారు ఇక ప్రభుత్వం కూడా ఒప్పు కోవాలని కోరుతోంది.మాడ్ నుంచి వచ్చిన లేఖను యధాతదాంగా ప్రచురిస్తున్నాం....

కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్)
మాడ్ డివిజనల్ కమిటీ
పత్రికా ప్రకటన
04-10-2025

సాయుధ పోరాటాన్ని త్యజించడానికి మద్దతుగా

మా పోలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను నేతృత్వంలోని సాయుధ పోరాటాన్ని త్యజించాలనే నిర్ణయానికి మా మార్ డివిజనల్ కమిటీ మద్దతు ఇస్తుంది. డివిజన్‌లోని వివిధ విభాగాలకు చెందిన మా సహచరులు కూడా దీనికి అనుకూలంగా ఉన్నారు. గతంలో, ప్రభుత్వంతో శాంతి చర్చలు జరపడానికి మా పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు మా బ్యూరో ఇన్‌చార్జ్ నేతృత్వంలో ఏప్రిల్ మరియు మే నెలల్లో జరిగిన ప్రయత్నాలకు మేము పూర్తిగా మద్దతు ఇచ్చాము. ఆ సమయంలో సాయుధ పోరాటాన్ని త్యజించాలనే నిర్ణయానికి కూడా మేము అంగీకరించాము.కామ్రేడ్ సోను కార్యకర్తలకు చేసిన విజ్ఞప్తులను మరియు ప్రజలకు చేసిన విజ్ఞప్తులను మేము చదివాము. దేశంలో మరియు ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను సరిగ్గా గుర్తించడంలో మరియు తదనుగుణంగా విప్లవాత్మక ఉద్యమంలో అవసరమైన మార్పులు చేయడంలో మా %CC% విఫలమైంది. ఫలితంగా, ఉద్యమం క్రమంగా బలహీనపడింది. ఉద్యమంలో చురుకైన ప్రజల భాగస్వామ్యం కూడా తగ్గింది. ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి మరియు ముందుకు తీసుకెళ్లడానికి మాకు చాలా అవకాశాలు ఉన్నాయి, కానీ వాటిని స్వాధీనం చేసుకోవడంలో మేము విఫలమయ్యాము. మారిన పరిస్థితులకు అనుగుణంగా లేని తప్పుడు నిర్ణయాల కారణంగా మా ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ పరిస్థితిలో, సాయుధ పోరాటాన్ని విడిచిపెట్టి, అన్ని స్నేహపూర్వక సంస్థలతో కలిసి ప్రజలలో పనిచేయాలని మేము నిర్ణయించుకున్నాము. ప్రస్తుత పరిస్థితి చాలా తీవ్రంగా ఉన్నందున, మేము తీసుకుంటున్న నిర్ణయాన్ని అర్థం చేసుకుని మద్దతు ఇవ్వమని మేము ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మా విజ్ఞప్తి:**

మా డివిజనల్ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని డివిజన్‌లోని పార్టీకి మరియు పీపుల్స్ కన్‌స్ట్రక్షన్ కార్మికులకు వివరించాలి. కొనసాగుతున్న అణచివేత ప్రచారాల మధ్య మేము ఈ పనిని పూర్తి చేయలేము. మేము దీన్ని సాధ్యమైనంత తక్కువ సమయంలో పూర్తి చేస్తాము. మాడ్ ప్రాంతంలో ఎటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగవని మేము బాధ్యతాయుతంగా ప్రకటిస్తున్నాము. దీనిని సాధించడానికి, దయచేసి కొంతకాలం పోలీసు గస్తీని నిలిపివేయండి. ఈ నెల 15వ తేదీలోపు మేము ఈ పనిని పూర్తి చేస్తాము.

**రాణిత సనిత కార్యదర్శి, మాడ్ డివిజనల్ కమిటీ,**
**CPI (మావోయిస్ట్)**

చురకలు









## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్..!

హైదరాబాద్, అక్టోబరు7: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్‌కి లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ శ్రేణులతో ఈ రోజు(మంగళవారం) జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో నవీన్ యాదవ్ వైపు సీఎం రేవంత్ రెడ్డి మొగ్గు చూపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు బొంతు రామ్మోహన్ (%దీశీ‌బ ఝఎ ఎశీ‌ష్ట్రుఅ%). జూబ్లీహిల్స్ అభ్యర్థిని కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయిస్తుందని బొంతు రామ్మోహన్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తాను పనిచేస్తానని ప్రకటించారు బొంతు రామ్మోహన్. మరోవైపు.. జూమ్ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సెక్రటరీలు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చేసిన సర్వే రిపోర్టులు , అభ్యర్థుల సామాజిక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అయితే, రెండు పేర్లతో ఏఐసీసీకి సిఫారసు చేయాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు.




హైదరాబాద్: తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. నేను మంత్రి కావడం.. మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. "పొన్నం మాదిరిగా అహంకారంగా మాట్లాడటం నాకు రాదు. ఆయన తన తప్పు తెలుసుకుంటారని అనుకున్నా. పొన్నం మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనదే బాధ్యత.

త్వరలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, మీనాక్షి నటరాజన్‌ను కలుస్తా" అని లక్ష్మణ్ అన్నారు.

## అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను: మంత్రి పొన్నం



హైదరాబాద్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను స్పందించనని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. "పీసీసీ అధ్యక్షుడు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్. రహ్మత్‌నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివరించా. అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పార్టీ పరంగా మాకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరోధార్యం" అని అన్నారు. పొన్నం మాదిరిగా అహంకారంగా మాట్లాడటం తనకు రాదంటూ అడ్లూరి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

ఆయన తన తప్పు తెలుసుకుంటారని అనుకున్నానని.. ఇప్పటికీ మారకపోతే తర్వాత జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని అడ్లూరి వ్యాఖ్యానించారు.

## అత్యుత్తమ రీసెర్చ్ యూనివర్సిటీగా.. సమ్మక్క - సారక్క: ధర్మేంద్ర ప్రధాన్

ఢిల్లీ, అక్టోబరు7 : సాంస్కృతిక వారసత్వం, సంచార జాతుల ప్రజలు ఉండే ప్రాంతంలో సమ్మక్క - సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పడుతుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. అత్యుత్తమ రీసెర్చ్ యూనివర్సిటీగా సమ్మక్క - సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిలుస్తుందని ఉద్ఘాటించారు. సమ్మక్క - సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ లోగోను ఆవిష్కరించారు. యూనివర్సిటీ ద్వారా చాలా విషయాలు వెలుగులోకి తేవచ్చని చెప్పుకొచ్చారు. తెలుగు, హిందీ, మరాఠీతో సహా లోకల్ ట్రైబల్ భాషను మెరుగు పరచవచ్చని వెల్లడించారు. యూనివర్సిటీ లోగో వినూత్నంగా ఉందని తెలిపారు. యూనివర్సిటీ లోగోలో ట్రైబల్ భాషలు కోయ, బంజారా, గోండు భాషలు పొందుపరచడంపై అభినందించారు ధర్మేంద్ర ప్రధాన్. త్వరలో సమ్మక్క - సారక్క యూనివర్సిటీని సందర్శిస్తా, కొత్త క్యాంపస్‌కి శంకుస్థాపన చేస్తానని స్పష్టం చేశారు. సమ్మక్క -సారక్క ట్రైబల్ యూనివర్సిటీ విభజన చట్టంలో పొందుపరిచారని గుర్తుచేశారు. తాము విభజన చట్టం



చేయకపోయినా యూనివర్సిటీ ఏర్పాటుకు కట్టుబడి సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని ఉద్ఘాటించారు. యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని మాటిచ్చారు. ర. 800 కోట్లకు పైగా నిధులు కేటాయించామని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

## తెలంగాణ నేతలతో సీఎం చంద్రబాబు సమావేశం.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చ

**అమరావతి: ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ తెలుగుదేశం నేతలతో పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో అనుసరించాల్సిన విధానంపై చర్చించారు. కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని నేతలకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపైనా చర్చించినట్లు సమాచారం.**



## ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం.. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ షాకింగ్ కామెంట్స్

ఢిల్లీ, అక్టోబరు7 : గతంలో ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయ్యాయని.. ఇప్పుడు కూడా దుర్వినియోగం అవుతున్నాయని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే కాదని.. రాష్ట్ర రైతాంగానికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం నిలవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తమ బాధ్యత నుంచి ఎందుకు తప్పుకుంటుందని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ఎంత పత్తి ఉత్పత్తి అయితే అంత కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులకు స్మార్ట్ ఫోన్స్ లేకుండానే %ణదీ% నిధులు వెళు _న్నాయా అని ప్రశ్నించారు గిరిరాజ్ సింగ్.

**తెలంగాణ నుంచి రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లు...** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 నుంచి 2014 వరకు రూ.12, 500 కోట్ల పత్తి కొనుగోళ్లు చేస్తే.. ప్రస్తుతం రూ.73,000 కోట్ల పత్తి కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు. రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లు కేవలం తెలంగాణ నుంచే జరిగాయని వెల్లడించారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్నదాతల ఆదాయం రెట్టింపు చేసేందుకు చర్యలు చేపట్టామని ఉద్ఘాటించారు. 2014లో క్వింటా పత్తి ధర రూ.3,700లు ఉంటే.. ఇప్పుడు క్వింటా రూ.7,710ల ధర ఉందని నొక్కిచెప్పారు. మరో గ్రేడ్ రకం గతంలో క్వింటా రూ. 4 వేలు ఉంటే.. ప్రస్తుతం క్వింటా రూ. 8,110లుగా ఉందని వివరించారు. ఇవాళ(మంగళవారం) కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు గిరిరాజ్ సింగ్.

**క్వాలిటీ సీడ్స్ ఇవ్వాలి..** తెలంగాణలో 80 శాతం పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణలో 20 లక్షల మంది పత్తి రైతులు ,18 లక్షల హెక్టార్లలో పత్తి పంట పండిస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు సహకారం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక అప్లికేషన్ ప్రారంభించిదని... రైతులు అందులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో పత్తి కొనుగోళ్ల కోసం గతేడాది 110 సెంటర్లు ఉన్నాయని.. ఇప్పుడు122 సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనను కోరారని చెప్పుకొచ్చారు. గతంలో పత్తిని ఎంత సేకరించామో.. ఈ ఏడాది కూడా అలానే పత్తిని సేకరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు మద్దతుగా నిలవాలని సూచించారు.

పత్తిలో తేమ శాతాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో ఓ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం క్వాలిటీ సీడ్స్ ఇవ్వాలని సూచించారు గిరిరాజ్ సింగ్.

## రైతులు అధైర్యపడొద్దు.. మేము అండగా ఉంటాం: కిషన్ రెడ్డి

ఢిల్లీ, అక్టోబర్7 : పత్తి రైతుల కు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి భరోసా కల్పించారు. అన్నదాతలు తక్కువ ధరకు పత్తిని బయట అమ్మవద్దని.. ఆలస్యమైన సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పత్తి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి పంటని అమ్మాలని సూచించారు. 12 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పంటని అమ్మడానికి 122 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉంటాయని.. ఎవరైనా రైతులను మోసం చేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తరపున రైతులకు అండగా ఉంటామని మాటిచ్చారు. పత్తిని చివరి వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు కిషన్‌రెడ్డి.



**పత్తిలో తేమ 12 శాతం మించొద్దు..** పత్తిలో తేమ 12 శాతం మించకుండా ఉండాలని సూచించారు. కాటన్ కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 122 సెంటర్లలో పత్తి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. తేమశాతం కొలిచే మిషన్లు కొనుగోలు కేంద్రాల్లో ఉంటాయని వెల్లడించారు. రైతులకు అండగా 122 సెంటర్లలోని కమిటీలు ఉండాలని ఆదేశించారు. ఇవాళ(మంగళవారం) కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి చర్చించారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌కి విజ్ఞాపనలు అందజేశారు కిషన్‌రెడ్డి.


**మౌలిక వసతులు పెంచాలి..** ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర జోలి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని తాను కలిశానని తెలిపారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలను వివరించానని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం పత్తి కొనుగోలు ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణలో మౌలిక వసతులు పెంచాలని సూచించారు. కాటన్ ఉత్పత్తి కేంద్రాలు పెంచాలని దిశానిర్దేశం చేశారు. మహారాష్ట్ర కోలలో హై డెన్సిటీ ప్లాంటేషన్ చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు చేయడం లేదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తనను అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. రైతుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. పత్తిలో తేమశాతం తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సూచించారు కిషన్‌రెడ్డి.

**ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి..** రైతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన తీసుకురావాలని కోరారు. అందరూ ఒకేసారి పత్తిని జిన్నింగ్ మిల్స్‌కి తీసుకురావడంతో పంట కొనుగోలు చేయడంలో ఇబ్బంది ఏర్పడుతోందని వివరించారు. ఆన్‌లైన్‌లో ముందస్తుగానే పత్తిని ఏరోజు తీసుకువస్తారనేది రిజిస్టర్ చేసుకుంటే సమస్య ఉండదని చెప్పుకొచ్చారు. సీసీఐ నుంచి నేరుగా రైతుల ఖాతాకు డబ్బు వెళ్తుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల్లో కాటన్ రేటు తక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ నిధులని పత్తిలో తేమ తగ్గించేందుకు రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయాలని సూచించారు. మహారాష్ట్ర అకోలాలో హై డెన్సిటీ ప్లాంటేషన్ ద్వారా ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం పెరుగుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు.

## ప్రాణహిత - చెవెళ్ల ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్

హైదరాబాద్, అక్టోబరు7 : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో ఇవాళ(మంగళవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రాణహిత - చెవెళ్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉద్ఘాటించారు. తుమ్మిడిహట్టి వద్ద రెండు ప్రత్యామ్నాయ మార్గాలపై పరిశీలిస్తున్నట్లు చెప్పుకొచ్చారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పునరుద్ధరణలో ఐఐటీని భాగస్వామ్యం చేస్తామని వెల్లడించారు. వర్షాకాలం అనంతరం రూపకల్పన చేసి ఒక సంవత్సరంలో వీటిని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే, కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ –II విచారణ పురోగతిపై సమీక్షించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. సమ్మక్క - సారక్క ప్రాజెక్టు, దేవదుల ప్రాజెక్టులపై సమీక్షించారు. భూ సేకరణ పరిహారంగా రూ.33 కోట్లు



విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. డిండి ప్రాజెక్టుపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. రిజర్వాయర్ల సామర్థ్య పెంపు కోసం కొత్త విధానం సిద్ధం చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఐఎస్‌డబ్ల్యూఆర్డ్, సీడీఓ బలోపేతంపై ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి పోటీలో లేను: బొంతు రామ్మోహన్



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి పోటీలో తాను లేనని మాజీ మేయర్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్ తెలిపారు. తనకు టికెట్ కావాలని ఎవర్నీ అడగలేదని, అధిష్ఠానమే అభ్యర్థిని నిర్ణయిస్తుందని చెప్పారు. టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా కాంగ్రెస్ గెలుపు కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఎంపిక చేయడానికి నలుగురి పేర్లను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. సీఎం సూచనలతో నవీన్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డిల పేర్లను అధిష్ఠానానికి పంపింది. వీరిలో ఒకరి పేరును ఏఐసీసీ అధికారింగా ప్రకటించనుంది.

## సవీందర్‌రెడ్డిపై సీబీఐ చర్యలు తీసుకోవద్దు.. సుప్రీం కీలక ఆదేశాలు

ఢిల్లీ, అక్టోబర్7 : సోషల్ మీడియా యాక్టివిస్టు సవీందర్‌రెడ్డిని అరెస్టు చేసిన వ్యవహారంలో.. సీబీఐ తదుపరి కార్యాచరణ చేపట్టవద్దని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సవీందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడంపై దాఖలైన హెబీయస్ కార్పస్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు ఇవాళ(మంగళవారం) విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో వ్యక్తిగత హోదాలో సవాలు చేశారు దర్యాప్తు అధికారి గన్నవరపు శ్రీనివాసరావు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్రశర్మ విచారణ చేపట్టారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టినందుకు అక్రమంగా అరెస్టు చేశారని హైకోర్టులో సవీందర్‌రెడ్డి భార్య లక్ష్మీప్రసన్న పిటిషన్ దాఖలు చేశారు. సవీందర్‌రెడ్డిని గంజాయి కేసులో అరెస్టు చేశారని సుప్రీంకోర్టుకి ఏపీ ప్రభుత్వ దర్యాప్తు అధికారి తరపు న్యాయవాదులు నివేదించారు. ఒక రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని అరెస్టు చేసి... తర్వాత గంజాయి కేసులో ఇరికించారని సవీందర్‌రెడ్డి తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. అదే విషయాన్ని హైకోర్టు పరిశీలించిన తర్వాతే సీబీఐ విచారణకు ఆదేశించిందని న్యాయవాది పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని సవీందర్‌రెడ్డి న్యాయవాది వివరించారు. గంజాయి కేసులో అరెస్టు చేస్తే... దానికి రాజకీయ కారణాలు అన్వయిస్తున్నారని ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా న్యాయస్థానానికి తెలిపారు. ఇరువురి వాదనలను జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.

అనంతరం ఈ కేసుపై మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతోపాటు... సీబీఐ తదుపరి కార్యాచరణ చేపట్టవద్దని ఆదేశించింది ధర్మాసనం. ప్రతివాదులుగా ఏపీ ప్రభుత్వం, డీజీపీ, సీబీఐ, రిలయన్స్ జియో సంస్థతో పాటు... మొత్తం 11 మందిని ఈ కేసులో దర్యాప్తు అధికారి చేర్చారు. ఈ కేసులో పిటిషన్ దాఖలు చేసేందుకు ఏపీ ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది ధర్మాసనం. ఈ పిటిషన్‌పై త్వరలోనే తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వాయిదా వేసింది.



చురకలు



# బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు - అక్టోబర్ 8... అడివి బాపిరాజు జయంతి



అడివి బాపిరాజు (అక్టోబరు 8, 1895 – సెప్టెంబరు 22, 1952) బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు, నవలాకారుడు, కవి, కథకుడు, గాయకుడు, నాటక కర్త. చిత్ర లేఖకుడు, కళాదర్శకుడు, జర్నలిస్ట్, న్యాయవాది. చిన్నతనం నుంచే సాహిత్యంపై ఆసక్తి చూపేవాడు. బాపిరాజు పశ్చిమ గోదావరి జిల్లా లోని భీమవరంలో అక్టోబర్ 8, 1895 న ఒక నియోగి బ్రాహ్మణ కుటుంబములో కృష్ణయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించాడు. భీమవరం హైస్కూలులో చదివి, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ లో బి.ఏ చదివి, మద్రాస్ లా కాలేజ్ లో బి.ఎల్ పట్టం పొంది, కొంతకాలం న్యాయవాద వృత్తి నిర్వహించిన తరువాత తన ఇతర వ్యాసంగాలలో కృషిని సాగించడానికి ఆ పనిని విరమించాడు. 1922 లో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అరెస్టయినాడు. తన జైలు జీవితానుభవాలను తొలకరి అనే నవలలో పొందుపరచాడు. చిత్రకళా విద్యార్థిగా ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రమోదకుమార ఛటోపాధ్యాయ శిష్యత్వం పొందాడు. తెలుగు దినపత్రిక మీజాన్ సంపాదకునిగా పనిచేశాడు. తరువాత విజయవాడ ఆకాశవాణి రేడియో కేంద్రంలో సలహాదారునిగా ఉన్నాడు. 'నవ్య సాహిత్య పరిషత్' స్థాపించినవారిలో బాపిరాజు ఒకడు. చిత్రకళను నేర్పడానికి గుంటూరులో ఒక ఫౌండేషన్ ప్రారంభించాడు. భీమవరంలో న్యాయవాద వృత్తి చేస్తూ నారాయణరావు అనే సాంఘిక నవల రాశాడు. ఈ నవలకు ఆంధ్రవిశ్వకళా పరిషత్తు వారి బహుమతి లభించింది. 1934 నుంచి 1939 వరకు బందరు జాతీయ కళాశాల ప్రధానాచార్యుడిగా పనిచేశాడు. అదే సమయంలో కథలు రాశాడు. 1939 లో సినీరంగ ప్రవేశం చేసి అనసూయ, ధ్రువ విజయం, మీరాబాయి లాంటి సినిమాలకు కళాదర్శకత్వం చేశాడు. 1944 నుంచి 1947 వరకు హైదరాబాదు నుండి వెలువడే మీజాన్ పత్రికకు సంపాదకత్వం వహించాడు. ఆ సమయంలో తుఫాను, గోన గన్నారెడ్డి, కోనంగి నవలలు రచించాడు. అడవి బాపిరాజు రచనలలో ఆధునిక తెలంగాణ ప్రాంతాలుగా పరిగణనకు గురవుతున్న ప్రాంతాలు అధికంగా ఆయన చారిత్రక నవల 'గోనగన్నారెడ్డి' లో, కథలు 'నేల', 'వడగళ్ళు' 'బండరాళ్ళు' లోనూ కనిపిస్తాయి. అడవి బాపిరాజు 'మీజాన్' పత్రిక సంపాదకుడిగా హైదరాబాదులో నివసించడం వల్ల ఆయన కథలలో హైదరాబాదు పరిసర ప్రాంతాలు అధికంగా ప్రదర్శితమయ్యాయి. ఈ సమయంలో ఆయన తెలంగాణ ప్రాంత ప్రజల మనస్తత్వాలను, జీవన విధానాన్ని, వారి కష్టాల స్వరూపాన్ని ఆకళింపు చేసుకున్నారు. తెలుగు దేశమంతటా విస్తృతంగా ప్రచారంలోనున్న "బావా బావా పన్నీరు" పాట ఈయన వ్రాసిందే. ఒకనాడు ఆకాశవాణి కేంద్రం ద్వారా తరుచుగా వినిపించిన పాడకే నా రాణి, బాలవే నీవెపుడూ పాటలను ప్రసిద్ధ గాయకుడు ఎమ్మెస్ రామారావు పాడి రికార్డు చేశారు. ఇలాంటి పాటలు బహుళ ప్రాచుర్యం పొందాయి. సన్నిహితులు, సమకాలీన సాహితీ వేత్తలు ఆయన్ని ముద్దుగా "బాపి బావ" అని పిలిచేవారు. 1934లో ఆంధ్ర విశ్వకళా పరిషత్ నిర్వహించిన నవలా పోటీలో 'నారాయణరావు' నవలకు కవి సామ్రాట్ విశ్వనాథ "వేయి పడగలు"తో పాటు ప్రథమ బహుమతి లభించడం విశేషం. ఆయన చిత్రించిన చిత్రాలలో సముద్ర గుప్తుడు, తిక్కన ప్రసిద్ధమయ్యాయి. విశ్వనాథ సత్యనారాయణ గేయ సంపుటి కిన్నెరసాని పాటలు బాపిరాజు చిత్రాలతో వెలువడింది. బాపిరాజు చిత్రించిన శబ్ద బ్రహ్మ అనే చిత్రం డెన్మార్కు ప్రదర్శనశాలలో ఉంది. భాగవత పురుషుడు, ఆనంద తాండవం మొదలగు చిత్రాలు తిరువాన్?కూరు మ్యూజియంలో ఉన్నాయి. 1951లో అప్పటి మద్రాసు ప్రభుత్వం కోరికపై సింహళంలోని సిగిరియా కుడ్య చిత్రాల ప్రతికృతులను చిత్రించారు. సెప్టెంబరు 22, 1952 న బాపిరాజు మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ప్రపంచంలోనే 4 వ పెద్దది ఐఎఫ్ - అక్టోబర్ 8... భారత వైమానిక దళ దినోత్సవం

భారత వైమానిక దళ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 8న నిర్వహించ బడుతుంది. భారతీయ వైమానిక దళం (ఇండియన్ ఎయిర్ ఫోర్స్) 1932, అక్టోబరు 8న తేదీన స్థాపించబడి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద వైమానిక దళంగా పేరు పొందింది. అంతటి శక్తివంతమైన వైమానిక దళం యొక్క సేవలను గుర్తిస్తూ ప్రతిఏటా అక్టోబర్ 8న భారత వైమానిక దళ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది. 1932, అక్టోబర్ 8న ఏర్పడిన భారత వైమానిక దళం బ్రిటీష్ తరఫున రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నది. దానికి గుర్తుగా 1945లో రాయల్ భారత వైమానిక దళంగా మార్చబడింది. 1950లో గణతంత్ర దేశంగా అవిర్భవించిన తరువాత భారత వైమానిక దళంగా రూపాంతరం చెందింది. 1933 ఏప్రిల్ 1న భారత వైమానిక దళానికి తొలి ఎయిర్‌క్రాఫ్ట్ వచ్చింది. తొలినాళ్ళలో కేవలం ఐదు మంది పైలట్స్, ఒక ఆర్ఏఎఫ్ మాత్రమే ఉండేవారు. మొత్తం ఐదు ఆపరేషనల్ కమాండింగ్ కేంద్రాలను కలిగిన ఐఎఎఫ్‌కు 1,130 కంబాట్ 1,700 నాన్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉన్నాయి. ప్రపంచం లోనే నాలుగో అతిపెద్ద వాయు సేనగా భారత వైమానిక దళం పేరు గడించింది. తనకు అవసరమైన సిబ్బందికి అధునాతన శిక్షణ ఇవ్వడంలోను, అధునాతన యంత్ర సామగ్రిని సమకూర్చు కోవడం లోను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ముందంజలో ఉండటమే కాకుండా.. ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది. ఇండియన్ ఎయిర్ ఫోర్సుకు తొలి ఐదుగురు పైలట్స్‌గా విధులు నిర్వహించిన ఘనత హరీష్ చంద్ర సిర్కార్, సుబ్రొతో ముఖర్జీ, భూపేంద్ర సింగ్, అజాద్ భక్షా అవాన్, అమర్జీత్ సింగ్‌లు వైమానిక చరిత్ర పుటల్లో నిలిచి పోయారు. ఆ తర్వాత సుబ్రతో ముఖర్జీ తొలి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. తర్వాత రెండో ప్రపంచ యుద్ధానికి ముందు.. అంచలం చెలుగా మరింత మంది సిబ్బందిని ఐఎఫ్ నియమించు కుంది. వారిలో ఇంజనీర్, కే.కే.ముజుందర్, నరేంద్ర, దల్జీత్ సింగ్, హెన్రీ రంగనాథన్, ఆర్. హెచ్. డి సింగ్, బాబా మెహర్ సింగ్, ఎస్.ఎన్.గోయల్, ప్రితీపాల్ సింగ్, అర్జన్ సింగ్‌లు అగ్రగణ్యులు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో భారత వాయుసేన క్రీయాశీలక పాత్రను పోషించింది. తొలి వైమానిక దళ దాడి అర్కన్ ప్రాంతంలోని జపనీస్ సైనిక స్థావరంపై జరిపింది. ఈ యుద్ధం తర్వాత ఐఎఎఫ్‌ను అంచలం చెలుగా వృద్ధి చెందింది. యూఎస్‌కు చెందిన వుల్టీ వెంగీయన్స్, బ్రిటీష్ హాకర్ హరికేన్, వెస్ట్‌లాండ్ లైసండర్ వంటి అధునాతన ఎయిర్ క్రాఫ్ట్‌లు ఐఎఎఫ్‌లో వచ్చి చేరాయి. అంతేకాకుండా.. భారతావనిపై పొరుగు దేశాలు దాడికి తెగబడినపుడల్లా భారత వాయుసేన కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా.. 1960లో ఏర్పడిన కాంగో సంక్షోభ సమయంలోను, 1962లో జరిగి ఇండో–చైనా పోరు సమయం లోను, కాశ్మీర్ కోసం 1965లో పాకిస్తాన్‌తో జరిగి యుద్ధ సమయంలోను, 1971లో జరిగిన బంగ్లాదేశ్ విముక్తి పోరాటం లోను, 1984లో జరిగి ఆపరేషన్ మేఘదూత్ లోను, 1988లో ఆపరేషన్ కాక్టస్ లోను, 1999లో జరిగిన ఆపరేషన్ సఫేద్ సాగర్ (కార్గిల్ వార్) సమయాల్లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సేవలు ప్రశంసనీయం. భారత వైమానిక దళంలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ క్రాఫ్ట్‌లలో మిగ్–21, హాల్–హెచ్‌జెటి - 36, హెచ్‌జెటి–16 కిరణ్, హెచ్‌పిటి–32 దీపక్, ఇయూషిన్ II–78 ఎంకెఎల్, ఇయూషిన్ II–76, అంటోనోవ్ ఎఎన్–32, అవ్రో–748, డిఓ–228, ఇఆర్‌జె–135, బోయింగ్ -737, ఎంఐ–8, ఎంఐ–17, ఎంఐ–35, ఎంఐ–26, హెచ్‌ఎఎల్ చేతక్, హెచ్‌ఎఎల్ చీటా,




హెచ్ఎఎల్ ధృవ్, సుకోయ్–30, మిరజ్–2000, మిగ్–29, జగర్, మిగ్–27, మిగ్–23 తేజస్, హెచ్ఎఎల్ లైట్ కంబాట్ హెలికాప్టర్, బహిర రవాణా, ఐఎల్–76 రకం ఎయిర్ క్రాఫ్ట్‌లతో పాటు. స్వదేశ ఎయిర్‌క్రాఫ్ట్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ హెచ్ ఎంకే–132 రకం వంటి పలు రకాలు వాయుసేన అమ్ముల పొదిలో ఉన్నాయి. 1.70 లక్షల మంది సిబ్బందితో, 1300 విమానాలతో భారత వైమానిక దళం ప్రపంచం లోనే నాలుగవ పెద్ద వైమానిక దళంగా ప్రసిద్ధి పొందింది. భారత వైమానిక దళంలో ఐదు ఆపరేషన్ కమాండ్‌లు, రెండు ఫంక్షనల్ కమాండ్‌లు ఉన్నాయి. ఆపరేషన్ కమాండ్‌లు: 1.సెంట్రల్ ఎయిర్ కమాండ్, అలహా బాద్‌బీ 2.ఈస్టర్ న్ ఎయిర్ కమాండ్, షిల్లాంగ్‌బీ 3.సదరన్ ఎయిర్ కమాండ్, తిరువనంత పురంబీ 4.సౌత్ వెస్టర్న ఎయిర్ కమాండ్, గాంధీనగర్‌బీ 5.వెస్టర్న ఎయిర్ కమాండ్, న్యూఢిల్లీబీ డిఫెన్స్ రీసెర్చ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. దీన్ని 1958లో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ క్షిపణులను తయారు చేయడంలో ప్రధానపాత్ర వహిస్తుంది. మన దగ్గర ఉన్న క్షిపణుల్లో బ్రహ్మోస్.. సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి. ఇది ధ్వని కంటే వేగంగా ప్రయాణి స్తుంది. దీన్ని భారత్, రష్యాలు సంయుక్తంగా నిర్మించాయి. భారతదేశం లోని బ్రహ్మపుత్ర, రష్యాలోని మాస్కోవా నది పేర్ల మీద ఈ క్షిపణికి బ్రహ్మోస్ అని పేరు పెట్టారు. దీని పరిధి 290 కిలోమీటర్లు. ఇది 2.5 నుంచి 2.8 మ్యాక్ వేగంతో ప్రయాణిస్తుంది. నిర్భయ్ అనే సబ్‌సోనిక్ క్షిపణి.. ధ్వని వేగం (1 మ్యాక్) కంటే తక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. దీని పరిధి 1,000 కి.మీ. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత పాకి స్తాన్‌తో 1947, 1965, 1971, 1999లలో నాలుగుసార్లు యుద్ధాలు చేసింది. 1971లో పాకిస్తాన్‌ను ఓడించి, బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారణమైంది. 1962లో చైనాతో యుద్ధం చేసింది. భారత రక్షణ వ్యవస్థలో త్రివిధ దళాలు ఉన్నాయి. అవి.. సైనిక దళం, వైమానిక దళం, నావికా దళం. భారత రక్షణ దళాల అధిపతి (సుప్రీం కమాండర్) రాష్ట్రపతి. రక్షణ దళాలు కేంద్ర రక్షణ శాఖ మంత్రి ఆధీనంలో ఉంటాయి. ప్రస్తుత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. త్రివిధ దళాల ప్రధాన కార్యాలయాలు న్యూఢిల్లీలో ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సినీ కార్మిక పక్షపాతి ప్రభాకర్ రెడ్డి - అక్టోబర్ 8... సినీ నటుడు మందాడి ప్రభాకర రెడ్డి జయంతి



తెలుగు చిత్ర సీమలో క్యారక్టర్ ఆర్టిస్టుగా పేరొందాడు ప్రభాకర్ రెడ్డి. మూడున్నర దశాబ్దాల కు పైగా చిత్ర రంగంలో ఉంటూ, అగ్ర హీరోలతో నటించి, 450కి పైగా సినిమాలలో విలన్ తో పాటు విభిన్న పాత్రలు పోషించిన తెలుగు సినిమా నటుడు ప్రభాకర రెడ్డి గా ప్రసిద్ధులైన డాక్టర్ మందాడి ప్రభాకర రెడ్డి (అక్టోబర్ 8, 1935 – నవంబర్ 26, 1997) సినీ కార్మికుల బ్రతుకు వెతలు సంపూర్ణంగా అవగాహన కలిగి ఉన్న క్రమంలో నిత్యం కార్మికుల కష్టాల గురించే ఆలోచించే వారు. అందుకే ఆయన కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందారు. ఒకప్పుడు మద్రాస్‌లోనే ఉండే తెలుగు సినీ పరిశ్రమను 90వ దశక ఆరంభంలో దాన్ని హైదరాబాద్‌కు తెచ్చేందుకు ఎన్టీఆర్, ఏఎన్నార్ సహా చాలా మంది ఎంతో కృషి చేసారు. అందులో ప్రభాకర్ రెడ్డి పాత్ర చాలా ముఖ్య మైనది. సినీ కార్మికులను సొంత మనుషుల్లా చూసుకునే వారు. ఎందరికో తన ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చేవారు. పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చాక ఆయన సినీ కార్మికుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ సినీ కార్మికుల సమాఖ్యను ఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడిగా పనిచేశారు. సినిమాలనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న సినీ కార్మికులకు గూడు కల్పించాలన్న ఆలోచనతో ఒక కాలనీ ఏర్పాటు చేయడంపై తీవ్ర కృషి సల్పారు. చిత్ర పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్ వచ్చినప్పుడు అప్పటి హీరోలతో పాటు సినిమా ఇండస్ట్రీలో స్థిరపడిన చాలా మంది హైదరాబాద్‌లో స్థలాలు కొనుగోలు చేశారు. ప్రభాకర్ రెడ్డి కూడా గచ్చిబౌలి సమీపాన స్థలం కొన్నట్లు చెపుతారు. ప్రభాకర రెడ్డి మాత్రం పేద సినీ కళాకారుల కోసం తాను కొనుగోలు చేసిన ( నేటి 10 కోట్ల విలువైన) స్థలాన్ని ఉచితంగా ఇచ్చినట్లు, అందులోనే కళాకారుల ఇళ్ళ నిర్మాణాలు జరిగినట్లు, అందుకే దానికి ప్రభాకర్ రెడ్డి స్మారకార్థం చిత్రపురి కాలనీ అంటారని ఇటీవల విస్తృత ప్రచారం జరిగింది. ఈ విషయంలో భిన్న కథనాలు, ప్రచారాలు ఉన్నా, కాలనీ నిర్మాణానికి కార్మిక నేతగా ఆయన చేసిన కృషి మరిచి పోలేని ది. చిత్రపురి కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన సినీ కార్మికులంతా ఇళ్లను నిర్మించుకొని ఇంటి అద్దెల బాధను తప్పించు కున్నారు. సంపాదించే డబ్బులతో కుటుంబాలను పోషించు కుంటున్నారు. తమ కోసం ఇంత చేసిన ప్రభాకర్ రెడ్డిని వారు ఎప్పటికీ మరిచి పోరనేది వాస్తవం . ఇక ప్రభాకర్ రెడ్డి స్వతహాగా వైద్యుడు అయినా నటన పై గల అనురక్తితో చాలా తెలుగు చిత్రాలలో నటించాడు. కొన్ని హిందీ, తమిళ చిత్రాలలో కూడా నటించాడు. ఎక్కువగా ప్రతినాయక పాత్రలలో నటించాడు. 37 ఏళ్ల కెరీర్‌లో దాదాపు 500 సినిమాల్లో నటించడం సామాన్యమైన విషయం ఏమీ కాదు. అయన రచయిత, నటుడు, దర్శకుడు, నిర్మాత కూడా. ఎన్టీఆర్, ఏఎన్నార్ సహా చిరంజీవి వరకు కూడా చాలా మంది సినిమాల్లో విలన్‌గానే కాకుండా అనేక పాత్రల్లో నటించాడు ప్రభాకర రెడ్డి. ప్రభాకరరెడ్డి, సూర్యాపేట జిల్లా, తుంగతుర్తిలో లక్ష్మారెడ్డి, కౌసల్య దంపతులకు 1935, అక్టోబర్ 8 న జన్మించాడు. తుంగతుర్తిలో ప్రాథమిక విద్యాభ్యాసం తర్వాత హైదరాబాదులోని సిటీ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివాడు. 1955 నుండి1960 వరకు ఉస్మానియా వైద్య కళాశాలలో వైద్యవిద్యను అభ్యసించాడు. 1960లో గుత్తా రామినీడు దర్శకత్వం వహించిన చివరకు మిగిలేది సినిమాతో చిత్రరంగ ప్రవేశం చేశాడు. ఆ సినిమాలో ఒక మానసిక వైద్యుని పాత్ర పోషించాడు. ఈయన సినీ ప్రస్థానంలో మొత్తం 472 సినిమాల్లో నటించాడు. మంచి విజయాలను సాధించిన పండంటి కాపురం, పచ్చని సంసారం, ధర్మాత్ముడు, గృహప్రవేశం, గాంధీ పుట్టిన దేశం, కార్తీకదీపం, నాకు స్వతంత్రం వచ్చింది వంటి సినిమాలతో పాటు మొత్తం 21 తెలుగు సినిమాలకు కథలను అందించాడు. ప్రభాకరరెడ్డి 1997, నవంబరు 26వ తేదీన తన 62వ యేట హైదరాబాదులో మరణించాడు. 1981 – నంది ఉత్తమ నటుడు – పల్లె పిలిచింది చిత్రం లోని నటనకు 1980 – నంది ఉత్తమ నటుడు – యువతరం కదిలింది చిత్రం లోని నటనకుబీ 1990లో చిన్నకోడలు సినిమాలో ఉత్తమసహాయ నటుడిగా నంది పురస్కారం అందుకున్నాడు. ఉత్తమ కథా రచయితగా గృహప్రవేశం, గాంధీ పుట్టిన దేశం సినిమాలకు నంది పురస్కారాలను అందుకున్నాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పాత తరం మహా నటుడు సిఎస్ఆర్ - అక్టోబర్ 8... అభినవ శకుని వర్ధంతి



సి.ఎస్.ఆర్ గా సుపరిచితులై, సి.ఎస్.ఆర్ అంజనేయులు అని పిలువబడే చిలకాలపుడి సీతా రామ అంజనేయులు ఒక ప్రసిద్ధ పాత తరం తెలుగు థియేటర్ రంగస్థల, సినిమాల నటుడు. రంగస్థల నాటక రచనలు మరియు పౌరాణిక పాత్రలను పోషించడం ద్వారా ఆయన బాగా పేరు పొందిన ఆ నాటి ప్రసిద్ధ కళాకారులలో ఒకడు. అనేక రంగస్థల నాటకాల్లో నటించాడు మరియు 175 కి పైగా సినిమాల్లో ప్రధాన పాత్రలు మరియు పౌరాణిక పాత్రలను పోషించాడు. ఆయన ఆనాటి ప్రధాన నటులలో ఒకరు. ఎన్.టి.ఆర్ మరియు ఎ.ఎన్.ఆర్ వంటి నటుల ప్రవేశానికి ముందు, 1930 ల చివరలో అంజనేయులు ఒక ప్రధాన నటుడు. సి.ఎస్.ఆర్ గా ప్రసిద్ధి చెందిన చిలకాలపుడి సీతారామ అంజనేయులు (11 జూలై 1907 – 8 అక్టోబర్ 1963) 1907 జూలై 11 న ఆంధ్రప్రదేశ్‌లోని మచిలిపట్నం సమీపంలోని చిలకాలపుడి వద్ద తెలుగు ఆయన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. తండ్రి లక్ష్మీ నరసింహ మూర్తి రెవెన్యూ విభాగంలో పని చేసేవాడు. గుంటూరు జిల్లా పొన్నూరులో పాఠశాల చివరి అధ్యయనాల తరువాత, ఆయన కొంతకాలం సహకార పర్య వేక్షకుడిగా పనిచేశాడు. తదుపరి చదువులకు బదులుగా, నాటక రంగంలోకి ప్రవేశించడానికి ఎంచు కున్నాడు. బాల్యం నుండే నాటకం పట్ల ఆయనకు ఆసక్తి మెండుగా ఉండేది. చాలా తక్కువ వ్యవధిలో, నటన మరియు నాటక రంగంలో అగణిత ఖ్యాతిని పొందాడు. పాడటం ఆయనకు దేవుడిచ్చిన వరం. కవితలు చాలా బాగా రాసే వాడు. తక్కువ సమయంలో, ఆయన స్థానం నరసింహారావు , డివి సుబ్బారావు , పారుపల్లి, తదితరులతో పోల్చదగిన స్థితికి చేరుకున్నాడు. ఆయన పనిచేసిన చాలా సినిమాలు తెలుగులో ఉన్నాయి, "భక్త కుచేల" వంటి కొన్ని సినిమాలు మలయాళం లేదా ఇతర భాషలలో ఉన్నాయి. ఆయన 1932 లో "రామ పాదుకా పట్టాభిషేకం" చిత్రంతో సినీ పరిశ్రమ లోకి ప్రవేశించాడు. ఆయన శ్రీ కృష్ణ తులాభారం లో కృష్ణునిగా, రామదాసులో భక్త రామదాసుగా, మరియు తుకారంలో భక్త తుకారంగా గుర్తింపు పొందాడు. ఆయన సహజ గాయకుడు, ముఖ్యంగా కవితలలో దిట్ట. అంటరాని తనంపై పతిత పావనా అనే నాటకానికి ఆయన దర్శకత్వం వహించాడు. తన తుకారాం నాటకాన్ని ఆడటం ద్వారా విరాళాల ద్వారా సేకరించిన 10,000 రూపాయల డబ్బును సుభాస్ చంద్రబోస్ యొక్క భారత జాతీయ సైన్యానికి అంద జేశాడు. ఆయనకు ఇద్దరు చెల్లెళ్ళు మరియు ఇద్దరు తమ్ముళ్ళు ఉండగా, ఒక సోదరుడు, నాగేశ్వర రావు సహా సినిమాలకు అసిస్టెంట్ దర్శకుడు (సువర్ణ సుందరి, గుణ సుందరి, మాయా బజార్) మరో సోదరుడు సి. వెంకట రత్నం (సివి రత్నం అని పిలుస్తారు) భరణి పిక్చర్స్ మరియు స్టూడియోస్‌తో ఉన్నారు. నటి భానుమతి రామకృష్ణ నిర్మించిన అన్ని చిత్రాలకు ప్రొడక్షన్ మేనేజర్‌గా ఉన్నారు. 1932 రామ పాదుకా పట్టాభిషేకం, 1936 ద్రౌపది వస్త్రపారాణం, 1938 తుక్కారాం, 1939 జయప్రద, 1941తల్లి ప్రేమ, కృష్ణ మాయ, 1942 సుమతి, 1945 మాయా లోకం, 1947 రత్నమాల, 1949 జీవితం, 1950 పరమా నందయ్య శిష్యుల కథ, 1951పాతాళ భైరవి, 1952 పెళ్ళి చేసి చూడు, 1953 చండి రాణి, దేవదాసు, 1954 కన్యాదానం, చక్రపాణి, 1955 కన్యాశుల్కం రామప్ప పంతులు , రోజులు మారాయి, జమీందార్, 1956 భలే రాముడు, చిరం జీవులు, 1957 భాగ్య రేఖ, మాయా బజార్, సువర్ణ సుందరి, 1958 అప్పు చేసి పప్పు కూడు, రామదాసు, 1959 ఇల్లరికం, 1960 అన్నపూర్ణ, మహా కవి కాళిదాసు, 1961 జగదేక వీరుని కథ, భక్త కుచేల, కుచేలన్ మలయాళ సినిమా, 1962 చిట్టి తమ్ముడు, అనార్కలి, 1964 బొబ్బిలి యుద్ధం, చిత్రాలలో ప్రద ర్శిత విభిన్న పాత్రల పోషణలో లీనమై, చేసిన కృషికి ప్రశంసా పాత్రుడు అయినాడు. ఆయన పరిశ్రమలో మూడు దశాబ్దాలు పని చేశాడు. శ్రీకృష్ణ , రామదాసు , సారంగాధర, భవని శంకర, తుకారాం , సత్య వంత వంటి పౌరాణిక మరియు చారిత్రక పాత్రలను పోషించి, నటనా కౌశలాన్ని ప్రదర్శించారు. 1937 లో సూపర్ హిట్ అయిన భక్త రామదాసులో ఆయన నటన ప్రశంసలు అందుకుంది. 1950 వ దశకంలో, సి ఎస్ ఆర్ "పాతాళ భైరవి" చిత్ర రాజంలో లో ఉజ్జయిని రాజుగా కనిపించాడు. ఈ చిత్రం బ్లాక్ బస్టర్. భారత దేశపు మొదటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పాథాల భైరవిని ప్రదర్శించారు. దర్శకుడు పి పుల్లయ్య మొదటి విజయ వంతమ్కెన చిత్రాల్లో ఒకటిగా 1953 చిత్రం దేవదాసులో, భార్యగా మహానటి సావిత్రితో కలిసి వితంతు ముసలి భర్తగా జమీందార్ పాత్రను పోషించాడు. శకుని పాత్రలో మహాభారతం, మాయా బజార్ లో న భూతో న భవిష్యతిగా నటించాడు. పాతాళ భైరవి మొదటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించారు. ఆయన చిత్రం "చిట్టి తమ్ముడు" 1962 లో అతని కళ్ళ ముందు విడుదలైన చివరి చిత్రం, కానీ "బొబ్బిల్లి యుద్ధం" అతని చివరి చిత్రం, ఆయన మరణం తరువాత 1964 లో విడుదలైంది. సిఎస్ఆర్ అక్టోబర్ 8, 1963 న 56 సంవత్సరాల వయస్సులో మరణించాడు, పరిశ్రమపై తన ముద్రలను శాశ్వతంగా వదిలి వెళ్ళాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# శాంతి రక్షకుల దినం.. రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అవతరణ దినోత్సవం

## అక్టోబర్ 8... రాపిడ్ యాక్షన్ దళాల అవతరణ దినోత్సవం




భారతదేశ అంతర్గత భద్రత, సామాజిక శాంతి, ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క స్థిరత్వం అనే మూడు స్థంభాలను నిలబెట్టడంలో విశేష కృషి చేస్తున్న రాపిడ్ యాక్షన్ దళాల అవతరణ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 8న దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించ బడుతుంది. ఈ దళం భారతదేశంలో శాంతి పరిరక్షణ, సామాజిక సామరస్య స్థాపన, చట్ట వ్యవస్థ పరిరక్షణలో కీలకమైన పాత్ర పోషిస్తూ, దేశ ప్రజల నమ్మకాన్ని గెలుచుకుంది. ప్రజాస్వామ్య విధానంలో ప్రజల హక్కులు, సమానత్వం, సామరస్య భావనల పరిరక్షణలో %=ాఖీ% పాత్ర అత్యంత ప్రతిష్ఠాత్మకం. రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అనేది భారత దేశంలోని అతిపెద్ద పారామిలిటరీ సంస్థ అయిన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ లోని ఒక ప్రత్యేక విభాగం. సామాజిక అల్లర్లు, జాతి మరియు మత ఘర్షణలు, ప్రజా ఆందోళనలు, హింసాత్మక ఘటనలు వంటి సందర్భాలలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొని శాంతి భద్రతను కాపాడటానికి ఈ దళం 1992లో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడింది. 1990ల ప్రారంభంలో దేశంలో చోటుచేసుకున్న సామాజిక అల్లర్లు, మతపరమైన ఉద్రిక్తతలు, కుల ఘర్షణలు ప్రజాస్వామ్య వ్యవస్థకు సవాలుగా నిలిచాయి. ఈ పరిస్థితుల్లో సాధారణ పోలీసు బలగాలు సమయానికి స్పందించలేక పోవడంతో, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన చర్యలు చేపట్టగల శిక్షణ పొందిన ప్రత్యేక దళం అవసరమని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఫలితంగా 1991లో ప్రణాళిక సిద్ధం చేసి, 1992 అక్టోబర్ 7న రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఏర్పాటుకు ప్రభుత్వం అధికారికంగా ముద్ర వేసింది. అక్టోబర్ 8న దళం కార్యకలాపాలు ప్రారంభమవడంతో ఆ తేదీనే అవతరణ దినోత్సవంగా గుర్తించ బడింది. ప్రారంభ దశలో RAFలో ఐదు బెటాలియన్లు మాత్రమే ఉండగా, దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, అహ్మదాబాద్, లక్నో ప్రాంతాల్లో వీటిని వ్యూహాత్మకంగా నియమించారు. ఆరంభంలోనే వీరి సమర్థత, క్రమశిక్షణ, శాంతి నిర్వహణలో వేగవంతమైన ప్రతిస్పందన ప్రభుత్వాన్ని ఆకట్టుకుంది. తరువాత దశల్లో మరిన్ని బెటాలియన్లు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రస్తుతం RAFకు 15 బెటాలియన్లు ఉన్నాయి. ప్రతి బెటాలియన్‌లో సుమారు వెయ్యి మంది శిక్షణ పొందిన సిబ్బంది ఉంటారు. వీరి ప్రధాన లక్ష్యం అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే చర్యలు చేపట్టి, చట్టవ్యవస్థను కాపాడటం, ప్రజల భద్రతను నిర్ధారించడం. RAF దళం యొక్క ప్రధాన లక్ష్యాలలో శాంతిభద్రతలను భంగం కలిగించే పరిస్థితులను త్వరగా అదుపులోకి తేవడం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం, మానవతా విలువలను కాపాడుతూ సున్నితమైన పోలీసింగ్ చేయడం ఉన్నాయి. వీరి నినాదం "%ావతీజ–ఱఅస్త్ర ఎబఖ్రఱఅఓఎ షఓష్ట్ర ావఅంఓఱజవ ాశీశ్రీఱఎఱఅస్త్ర%" (సున్నితమైన పోలీసింగ్‌తో మానవత్వానికి సేవ చేయడం). RAF సిబ్బంది నాన్‌లెథల్ వెపన్లు వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు, స్టన్ గ్రెనేడ్లు, షీల్డు మొదలైనవి ఉపయోగిస్తారు. వీటి ద్వారా ప్రాణనష్టం లేకుండా లేదా తక్కువ నష్టంతో పరిస్థితిని అదుపులోకి తెస్తారు. మానవ హక్కులను కాపాడడం వీరి విధుల్లో ప్రధాన భాగం. వీరి శిక్షణలో మానవ హక్కుల అవగాహన, సామాజిక సౌభ్రాతృత్వం, మత సామరస్య పరిరక్షణ, మహిళా భద్రత, పిల్లల రక్షణ వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. ఈ దళం ప్రధానంగా అల్లర్లు, పౌర అశాంతి, మత ఘర్షణలు, కుల వివాదాలు, పెద్ద ప్రజా సమావేశాలు, ఎన్నికల సమయంలో చెలరేగే ఉద్రిక్త పరిస్థితులను అదుపులోకి తేవడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విపత్తు సహాయక చర్యల్లో కూడా RAF ముందు ఉంటుంది. భూకంపాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు, తుఫానులు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను రక్షించడం, సహాయక చర్యలు చేపట్టడం, పునరావాస కార్యక్రమాలు నిర్వహించడం RAF సిబ్బందికి సర్వసాధారణం. RAF మహిళా కంటింజెంట్లు కూడా ప్రత్యేకంగా ప్రసిద్ధి చెందాయి. మహిళా నిరసనకారులు, ప్రదర్శనకారులను సమర్థంగా ఎదుర్కోవడానికి, అంతర్జాతీయ శాంతి పరిరక్షణ మిషన్లలో పాల్గొనడానికి వీరు శిక్షణ పొందుతారు. మహిళా దళాల సానుకూల వ్యవహారం దేశ ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబిస్తుంది. RAF దళాన్ని "జీరో టైమ్ రెస్పాన్స్ ఫోర్స్" అని పిలుస్తారు, అంటే సంక్షోభ పరిస్థితుల్లో ఆలస్యం లేకుండా అత్యంత వేగంగా స్పందించే దళం. ఈ దళం చురుకుదనం, క్రమశిక్షణ, వేగం మరియు మానవతా దృక్పథం కారణంగా భారత ప్రజల్లో విశ్వాసం పొందింది. ఈ దళం కేవలం దేశీయ భద్రత పరిరక్షణకే పరిమితం కాకుండా అంతర్జాతీయ శాంతి పరిరక్షణ మిషన్లలో కూడా విశేష ప్రతిభ కనబరుస్తోంది. యునైటెడ్ నేషన్స్ పీస్‌కీపింగ్ మిషన్లలో భాగంగా లైబీరియా, హైతి, దక్షిణ సూడాన్, కాంగో వంటి దేశాల్లో RAF సిబ్బంది సేవలందించి భారతదేశ ప్రతిష్ఠను ప్రపంచస్థాయిలో పెంచారు. యునైటెడ్ నేషన్స్ పతాక కింద ఈ దళం అందించిన సేవలు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందాయి. RAF దళం యొక్క మోటో "సేవ, శాంతి, సౌభ్రాతృత్వం" అనేది వీరి విధేయత, సమన్వయం, మానవతా దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి సంవత్సరం అక్టోబర్ 8న RAF అవతరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పరేడ్‌లు, సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అవార్డు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మహిళా భద్రత, సామాజిక సౌభ్రాతృత్వం, మత సామరస్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో శాంతి భావనను బలపరుస్తారు. నేటి కాలంలో తీవ్రవాదం, అసహనం, సామాజిక విభజన వంటి సవాళ్లు పెరుగుతున్న సందర్భంలో RAF వంటి శాంతి బలగాల ప్రాముఖ్యత మరింత పెరిగింది. ఈ దళం కేవలం చట్ట రక్షణ బలగం మాత్రమే కాదు, ప్రజాస్వామ్య విలువలను కాపాడే, మానవ హక్కులను సంరక్షించే, సామాజిక ఐక్యతను నిలబెట్టే శాంతి దూతల బలగం. దేశ శాంతి, సామరస్య రక్షణకు వీరు చేస్తున్న సేవలు ప్రతి పౌరుడిలో గౌరవభావం కలిగిస్తున్నాయి. రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అవతరణ దినోత్సవం మనకు శాంతి, క్రమశిక్షణ, సేవా మనసుతో సమాజం కోసం అంకితభావంతో పనిచేసే వీర సైనికుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే సందర్భంగా నిలుస్తుంది. దేశ ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడం, సామాజిక ఐక్యతను కాపాడడం, మానవత్వం అనే భావనను జీవించి చూపడం RAF యొక్క విశిష్టత. ఈ దళం భారతదేశ భద్రతా చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించి, దేశ ప్రజల మనసుల్లో "శాంతి రక్షకుల దళం"గా నిలిచింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# చురకలు

## సంపాదకీయం

### బీజేపీతో దళపతి కలుస్తాడా? జన నాయగన్ మదిలో ఏముంది?

తమిళనాడు రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో అధికార డీఎంకేని గద్దె దించాలని బీజేపీ పావులు కదుపుతోంది. ఇందుకోసం పక్కా ప్రణాళిక రచిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా విస్తృత జనాదరణ కలిగిన సినీ నటుడు, టీవీకే పార్టీ అధినేత దళపతి విజయ్ ను మచ్చిక చేసుకునేందుకు బీజేపీ పావులు పక్కాగా ప్లాన్ చేస్తోందని అంటున్నారు. గత వారం చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును విమర్శిస్తున్న బీజేపీ.. అదే సమయంలో దళపతిని వెనకేసుకొచ్చేలా ప్రకటనలు చేస్తోంది. దీంతో విజయ్ తో స్నేహం కోసం బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమిళనాడులో ప్రధానంగా డీఎంకే, ఏఐడీఎంకే పార్టీల మధ్య కొన్ని దశాబ్దాలుగా అధికార యుద్ధం కొనసాగుతోంది. ఈ సారి ఎన్నికల్లో ఈ ద్విపాక్షిక యుద్ధాన్ని త్రిముఖ పోరుగా మార్చాలని విజయ్ భావిస్తున్నారు. ఆ ఉద్దేశంతోనే గత ఏడాది ఫిబ్రవరిలో టీవీకే పార్టీని స్థాపించారు. భారీ జనసమూహంతో సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నారు. అయితే దళపతి ఎంతలా ప్రయత్నించినా రెండు వర్గాలుగా చీలిపోయిన తమిళ ఓటర్లను ప్రసన్నం చేసుకుని అధికారం దక్కించుకోవడం అంత ఈజీ కాదన్న అంచనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రెండు పార్టీల కూటముల్లో ఏదో ఒకదానిలో విజయ్ చేరితే.. అధికారం దక్కడం ఖాయం అన్న అభిప్రాయ వ్యక్తమవుతోంది. అధికార డీఎంకే జాతీయస్థాయిలో కాంగ్రెస్ మిత్రపక్షంగా కొనసాగుతుండగా, ఏఐడీఎంకే ఈ మధ్య కాలంలోనే మళ్లీ ఎన్డీఏతో జట్టు కట్టింది. ఇక తమిళనాట ద్రావిడ రాజకీయాల స్థానంలో జాతీయ భావం తీసుకురావాలని ప్రయత్నిస్తున్న బీజేపీ.. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో డీఎంకే పార్టీని ఓడించాలంటే అన్నాడీఎంకే కూటమి శక్తి మాత్రమే చాలదని, తమకు విజయ్ తోడుగా నిలిస్తే తమిళనాట కాషాయ పార్టీ మద్దతు ఉన్న పార్టీల కూటమి అధికారం సాధిస్తుందని అంచనా వేస్తోంది. ఈ పరిస్థితుల్లో గత వారం చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఉదంతం నుంచి విజయ్ ను బయటపడేసేందుకు స్వచ్ఛందంగా ముందుకువస్తోంది బీజేపీ. కరూర్ తొక్కిలసాటలో సుమారు 41 మంది మరణించగా, ఘటనకు కారణమైన పలువురిని ప్రభుత్వం అరెస్టు చేయించింది. ఇదే సమయంలో టీవీకే పార్టీ అధినేత విజయ్ పై కేసు నమోదు చేయకపోవడాన్ని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. ఈ పరిణామం ప్రభుత్వానికి పెద్ద ఓదార్పుగా నిలిచిందని అంటున్నారు. దీంతో విజయ్ పాత్ర తేల్చేందుకు సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే సిట్ ద్వారా విజయ్ పై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని బీజేపీ విమర్శిస్తోంది. విజయ్ ను ఒంటరిని చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అయితే ఆయన ఒంటరి కాదన్న విషయం ప్రభుత్వం గుర్తించాలని తమిళనాడు బీజేపీ ప్రకటనలు చేస్తోంది. దీంతో కమలం పార్టీ ఆపరేషన్ విజయ్ ను ప్రారంభించిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కరూర్ ఘటన తర్వాత తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న విజయ్ వైఖరిలో ఏమైనా మార్పు వస్తుందా? అని పరిశీలకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాను బీజేపీ, డీఎంకే పార్టీలకు సమదూరం పాటిస్తానని గతంలోనే విజయ్ ప్రకటించారు. అయినా ఆయనతో స్నేహం కోసం బీజేపీ ఎడతెగని ప్రయత్నాలు చేయడమే ద్రవిడ రాజకీయాన్ని రంజుగా మార్చుతుందని అంటున్నారు.

## పౌర హక్కుల కోసం పరితపించిన మేధావి బాల గోపాల్ - అక్టోబర్ 8... పౌర హక్కుల పోరాట యోధుని వర్ధంతి



పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్ కే దక్కుతుంది. బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లలలో ఐదవ సంతానం- కందాళ్ళ పార్థనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్. . మాతామహుడు: ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలాకాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలు గా ఉన్న మృణాళిని సోదరి. ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకుడిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యారు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతిలో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరు సల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకుపోయిన నాయకు డాయన. ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడారు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచు కున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఎపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఎపిసిఎల్సి లో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఎపిసిఎల్సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు. 26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980 ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు ( ?ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్ ) ఆయనను అపహరించి, ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులతో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణకు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు. 90 వ దశకంలో ఆయన వ్యాసాలు ఈ మార్పును ప్రతిబింబిస్తాయి. రాజ్యహింస తోపాటు ప్రైవేటు హింసను ఆయన వ్యతిరేకించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎం.ఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి. మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శించడం నక్సలైట్ల నుండి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాలగోపాల్ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్త మైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ధి చెందాడు. ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐ-మావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మానవ హక్కుల ఫోరం ఏర్పడిన తరువాత, అతను తన కార్య కలాపాలను విస్తరించాడు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సాలో తీవ్రమైన సామాజిక గందరగోళానికి గురైన ప్రాంతాలను సందర్శించాడు. ఒరిస్సాలో అతని నిజనిర్ధారణ బృందాలు రాయగడ జిల్లాను సందర్శించాయి. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించాడు, బహిర్గతం చేశాడు. బాల గోపాల్ దాదాపు ఒక దశాబ్దం క్రితం న్యాయశాస్త్రం అభ్యసించడం ప్రారంభించాడు. పోలీసులు హత్యలను ఎదుర్కోవటానికి సంబంధించిన డజన్ల కొద్దీ కేసులను వాదించాడు. ఎన్కౌంటర్లలో పాల్గొన్న పోలీసులపైన హత్యానేరం నమోదు చేయాలని ఆయన గట్టిగా వాదించి విజయం సాధించాడు. ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు. అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పని సరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం.ఆయన అక్టోబర్ 8, 2009 రాత్రి హైదరాబాద్ లోని బంజారా హిల్స్ లో గుండెపోటుతో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## జర్నలిస్టులకు మార్గదర్శి కేశవ పిళ్ళై - అక్టోబర్ 8...పట్టు కేశవ పిళ్ళై జయంతి




దీవాన్ బహదూర్ పట్టు కేశవ పిళ్ళై (అక్టోబరు 8, 1860 - మార్చి 28, 1933) భారతీయ పాత్రికేయుడు, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు. పట్టు కేశవపిళ్లే తమిళనాడు లోని ఉత్తర ఆర్కాటు జిల్లాలో వేంకటా చలం, సుబ్బమ్మ దంపతులకు 1860, అక్టోబరు 8వ తేదీన జన్మించాడు. మద్రాసులో ఆయన విద్యాభ్యాసం జరిగింది. ఆయన హిందూ పత్రికలో విలేఖరిగా తన వృత్తిని ఆరంభించాడు. అనంతపురం జిల్లా, గుత్తిలో కరెస్పాండెంటుగా ఆయన 1883లో తన 22వ యేట నియమించ బడ్డాడు. గుత్తిలో స్థిరపడటం వలన పట్టు కేశవ పిళ్లెను ప్రజలు "గుత్తి కేశవపిళ్లై"గా పిలువ సాగారు. 1893, అక్టోబర్ 4వ తేదీన బ్రిటిష్ సైనికుల అత్యాచారం నుండి యిద్దరు హిందూ మహిళలను రక్షించే క్రమంలో, గుత్తిలోని రైలుగేటు కీపర్ గూళిపాలెం హంపన్న ప్రాణాలొడ్డాడు. ఈ సంఘటనలో బ్రిటిష్ సైనికులు హంపన్నను కాల్చి చంపారు. ఆ సంఘటన గురించి గుత్తి కేశవపిళ్లే హిందూ పత్రికకు వార్త పంపగా అది ప్రముఖంగా ప్రచురింప బడింది. ఆ వృత్తాంత మంతా హిందూ పత్రికలో రావడంతో ఇంగ్లీషు వారు ఆంగ్లేయులకు ఏర్పరిచిన ప్రత్యేకమైన ప్రతిపత్తులతో కూడిన కోర్టులో విచారణ జరిపించారు. అప్పట్లో కేశవపిళ్లే గుత్తిలో సెకెండ్ గ్రేడ్ ప్లీడర్గా ప్రాక్టీసు చేసేవాడు. ఈ సంఘటన గురించి బ్రిటిష్ సైనికులకు వ్యతిరేకంగా వాదించాడు. అక్కడ ఉన్న జ్యూరీ వారిలో అధికభాగం ఆంగ్లేయులు, మిగిలిన కొందరు వారిపై జీవనము ఆధారపడిన దుబాసీలు. కోర్టులో ఆ స్త్రీలు వ్యభిచారులని, హంపన్న వ్యభిచరింప జేసే వ్యాపారియని వ్యభిచారం విషయంలో డబ్బు ఎక్కువ తక్కువల్లో తమను కొట్టవచ్చాడని, ఆత్మరక్షణార్థం తాము కాల్చామని వాదించారు. వాదనలు నడుస్తూండగానే ఈ కేసుకు వ్యతిరేకంగా హిందూ పత్రికలో చాలా వార్తలు, అభిప్రాయాలు వచ్చాయి. చివరకు ఈ కేసులో వ్యభిచార వ్యవహారంలో తేడా రావడంతోనే ఈ ఘటన జరిగిందని, హంపన్న అమాయకుడేమీ కాదన్న వ్యాఖ్యలు చేస్తూ ఈ నేపథ్యంలో ఆంగ్ల సైనికుల దోషం ఏమీ లేదని తేల్చి, నిర్దోషులుగా విడిచి పెట్టాయి. ఇది జాత్యహంకారానికి ఉదాహరణ అంటూ హిందూ దినపత్రిక తీవ్రంగా ఖండించింది. స్థానికులు వీరుడైన హంపన్నపై ఇటువంటి ఘోరారోపణ చేయడాన్ని సహించలేక ఓ స్మారక చిహ్నం నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీనికి హిందూ పత్రిక సహకరించి, తమ పత్రిక ద్వారా విరాళాల కోసం ప్రయత్నాలు సాగించింది. గ్రామస్థులు, హిందూ పత్రికవారూ విరాళాలిచ్చిన దాతల సహకారంతో హంపన్న స్మారక చిహ్నాన్ని నిర్మించారు. స్మారక సంఘం వారు స్మారక చిహ్నం నిర్మాణానికి తొమ్మిది చదరపు టడుగుల స్థలాన్ని కొనుగోలు చేసి, దానిపై ఏడడుగుల ఎత్తుగల రాతిస్తంభం నిలబెట్టి, దానికి ఓ స్మారక ఫలకాన్ని వ్రాయించి పెట్టారు. చుట్టూ ఆవరణ గోడ కూడా కట్టించారు. ఆ శిలాఫలకంపై ఆంగ్లంలో ఈ క్రింది విధంగా చెక్కారు. "%నవతీవ శ్రీఅవ్ ష్ట్రవ తీవఖ్ఖఅఅం శీట +శీశీశ్రీఖజుఝశ్రీఅవఅ ఝఎజుఝఅఝ, ష్ట్రవ +ఘవ నెవవజూవతీ, ఎష్ట్రశీ ఎష్ట్రఅశ్రీవ నవటవఅసఅఅస్త్ర ఓశీ సఅఅసఐ ఓశీఎవఅ ఖస్త్రుఖఅఅర్ ఖ జుఝతీఎ శీట జుబతీశీజూఝఅ ంశీశ్రీనఅవతీం అఝతీ ష్ట్రవ +బఝునెఝశ్రీ తీవర్ ఝఎజూ ఝం ంష్ట్రశీ ఎఎ శీఅవ శీట్ ష్ట్రవఎ శీఅ వాశీఎవతీ 4, 1893. నవ నఅవస ష్ట్రవతీవ శీఅ వాశీఎవతీ 5. ఞఅంవస ఎఎ జుబతీశీజూఝఅ ఖఅస ×అసఖుఅ ఖసఎఅతీవతీం%" స్మారకచిహ్నం ఏర్పాటు, తమకు అవమాన కరమని కొందరు బ్రిటీష్ అధికారులకు తోచి, స్థల విక్రయం రద్దుచేయాలని ప్రయత్నించారు. కాని వ్రాయించిన దస్తావేజు విస్పష్టముగా నుండడం, దానిలో కూడా స్థలం కొనుగోలు స్మారక చిహ్నం నెలకొల్పేందుకే నన్న సంగతి వ్రాసి వుండడం కారణాలతో ఏమీ చేయలేక పోయారు. డిప్యూటీ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ సూపరింటెండెంట్ అయిన లెగ్గట్ ఈ స్మారక చిహ్నాన్ని చూసి చాలా ఆగ్రహించారు. దీనిని ఎలాగైనా తొలగించాలని సిఫారసు చేస్తూ చెన్నపట్టణ ప్రభుత్వం వారికి వ్రాశారు. గుత్తి విలేఖరియైన కేశవపిళ్లపై రాజద్రోహ నేరం కింద కేసు నమోదు చేయాలని ప్రయత్నాలు చేశారు. ఐతే ఇవేవీ జరగలేదు. మద్రాసు గవర్నర్ వెన్లక్ ప్రభుత్వం హంపన్న స్మారక చిహ్నం ఏమీ చేయరాదన్న ఉత్తర్వు చేసింది. ఈ సంఘటనతో హంపన్నతో పాటుగా గుత్తి కేశవపిళ్లే కూడా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించాడు. హంపన్న వృత్తాంతంతో ఆయనను స్థానిక ప్రభుత్వం గుర్తించి అనంతపురం, కర్నూలు, బళ్ళారి జిల్లాలకు జిల్లా బోర్డు సభ్యుడిని చేసింది. 1916-17లో ఇతడు కాంగ్రెస్ సభ్యునిగా చురుగ్గా పని చేశాడు. మద్రాసు శాసన మండలి సభ్యునిగా ఎన్నుకో బడ్డాడు. ఆయన గుత్తి తాలూకా బోర్డు ఉపాధ్యక్షుడిగా కూడా పని చేశాడు. మద్రాసు ఫారెస్ట్ సభ్యుడిగా సేవలను అందించాడు. శ్రీలంకలోని భారతీయ వర్తకుల కోరిక మేరకు అక్కడికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి ఒక నివేదికను సమర్పించాడు. 1885లో బొంబాయిలో జరిగిన స్వాతంత్ర్యోద్యమ ప్రథమ మహాసభకు అయన హాజరయ్యాడు. కేశవ పిళ్ళై గుత్తి నగరపాలికకు ఎన్నికై, నగర పాలిక సభ్యుడుగా పనిచేశాడు. చివరకు ఆయన నగర పాలికలకు ప్రాతినిధ్యం వహించడానికి మద్రాసు శాసన మండలికి ఎన్నికయ్యాడు. కేశవ పిళ్ళై తన తొలినాటి నుండి రాజకీయాల్లో ఆసక్తి చూపాడు. 1885, డిసెంబరు 28న బొంబాయిలో జరిగిన తొలి భారత జాతీయ కాంగ్రెసు సమావేశంలో, గుత్తి పట్టణ ప్రతినిధిగా పాల్గొన్నాడు. ఆ తర్వాత మరింత తీవ్రవాద పద్ధతులను అవలంబించి కొన్నిసార్లు జైలుకు కూడా వెళ్ళాడు. ఆయన జస్టిస్ పార్టీని, ద్రవిడ ఉద్యమాన్ని గట్టిగా వ్యతిరేకించాడు. కేశవ పిళ్ళై మద్రాసు శాసన మండలిలో చాలాకాలం పాటు పనిచేశాడు. సభలో అనేక సంస్కరణా ప్రతిపాదనలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకు దక్కుతుంది. పానగల్ రాజా ప్రభుత్వం ఆమోదించిన జైలు మార్గదర్శకాలు, జైలు కమిషన్ యొక్క ప్రధాన రచయిత పిళ్ళై. మద్రాసు అటవీ కమిషన్ సృష్టికర్త కూడా ఆయనే. ఆ తర్వాత కేశవ పిళ్ళై శాసనమండలి ఉపాధ్యక్షుడిగా కూడా ఎన్నికై, ఆ హొదాలో కొంతకాలం పని చేశాడు. ఆయన సేవా దృక్పథాన్ని గుర్తించి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం రావు బహద్దూర్ బిరుదుతో సత్కరించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## ఘంటసాల కంఠాన్ని పరిచయం చేసిన పేకేటి

### - తెలుగు సినీ విజ్ఞాన సర్వస్వం పేకేటి - అక్టోబర్ 8... పేకేటి శివరాం జయంతి



ఒక అవకాశం మనిషి జీవితాన్నే మార్చేస్తుంది. అలాంటి పోయిందనుకున్న అవకాశం ఘంటసాల మాస్టారుకు దొరికి ఆయనను మహా గాయకునిగా చిత్రసీమ నేపథ్య మకుటం లేని మహారాజుగా నిలిపింది. అలాంటి అవకాశాన్ని ఘంటశాలకు కల్పించింది నాటి నటునిగా పరిచితులైన పేకేటి శివరాం. 1944లో ఘంటసాల సినిమాలో పాటలు పాడాలని మద్రాసు వచ్చి ప్రతిభా పిక్చర్స్ సంస్థ అధిపతి ఘంటసాల బలరామయ్య వద్ద చేరి 'సీతారామ జననం' చిత్రంలో వేషాలు వేసేందుకు నెలజీతంపై ఒప్పందం చేసుకుని, హెచ్.ఎం.వి లో రికార్డులు పాడాలని ప్రయత్నాలు చేశారు. అయితే లంకా కామేశ్వరరావు అనే అధికారి ఆయనకు ఆడిషన్ నిర్వహించి, గొంతు మైకుకు పనికిరాదని పంపి వేయడం జరిగింది. కానీ ఆ కంఠం పేకేటికి నచ్చింది. ఘంటసాల కంఠాన్ని తిరస్కరించిన కామేశ్వరరావు సెలవులో వెళ్ళినపుడు పేకేటి ఘంటసాలను పిలిపించి "నగుమోమునకు నిశానాథ బింబము" అనే చాటు పద్యాన్ని, రతన్ రావు రచించిన "గాలిలో నాబ్రతుకు తేలిపోయిన దోయి" అనే పాటను పాడించి రికార్డు చేసి విడుదల చేశారు. శివరాం అంచనాను నిజంచేస్తూ ఆ రికార్డు అద్భుతంగా అమ్ముడు పోయింది. తన ప్రతిభను గుర్తించిన పేకేటికి ఘంటసాల ఎప్పుడూ పేకేటికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వుండేవారు. ఘంటసాల గొంతు రికార్డింగు కు సరిపోదని పంపించిన తరుణంలో...ఆనాడు పెకేటి సంచలన నిర్ణయం తీసుకుని, ఘంటసాల చేత హెచ్ ఎం వి సంస్థ లో రికార్డు స్వయంగా చేయించి, ప్రచారం చేయించక పోతే నేడు ఘంటసాల గళం వినే అవకాశం ఉండేది కాదు. పెకేటి శివరాంను తెలుగు సినీ విజ్ఞాన సర్వస్వం అని అంటుంటారు. పేకేటి కి సినిమా నిర్మాణం మీద వివిధ విభాగాల, అంశాల మీద లోతైన పరిజ్ఞాన ముంది. తెలుగు చిత్రసీమలో అగ్రనటులైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు లకు అత్యంత సన్నిహిత మిత్రుడుగా, సలహాదారుగా పేకేటి మన్ననలు పొందారు. తెగించి ఘంటసాల చేత పాడించిన రికార్డులకు విశేష ప్రచారమిచ్చి, సినీ నేపథ్య గాయకుడిగా నిలదొక్కు కునేందుకు కృషిచేసిన స్నేహశీలి పేకేటి. కన్నడ కంఠీరవుడు రాజకుమార్ కు కూడా అత్యంత ప్రీతిపాత్రుడైన దర్శకుడు పేకేటి. నటుడుగా రాశిలో తక్కువ చిత్రాలలో నటించినా తనదైన 'మార్కు'ని ఎప్పుడూ నిలబెట్టుకుంటూనే వచ్చారు. పేకేటి శివరాం అసలుపేరు పేకేటి శివరామ సుబ్బారావు. పుట్టింది అక్టోబరు 8, 1918న భీమవరం దగ్గరలోని పేకేరు గ్రామంలో. ఆయన తల్లిదండ్రులు రాజేశ్వరమ్మ, కృష్ణమోహన్. కాలేజీలో చదివే రోజుల్లోనే పత్రికలకూ శివరాం వ్యాసాలు రాసేవారు. ఆయన రాసిన వ్యాసాలు 'నెరజాణ', 'మాధురి' వంటి పత్రికల్లో ప్రచురితమయ్యేవి. శివరాం మంచి క్రీడాకారుడు కూడా. కాలేజీలో ఆయన ఫుట్ బాల్ చాంపియన్. సంగీతం మీద మక్కువ యెక్కువ కావడంతో హార్మోనియం, జలతరంగిణి వంటి వాద్యాలను వాయించడంలో తర్ఫీదు పొందారు. పద్యాలు బాగా పాడేవారు. నాటకాలు వేసేవారు. శ్రమజీవి' అనే పత్రిక సంపాదకుడు జైలుకు వెళితే ఆపద్ధర్మంగా ఆ పత్రిక సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు. అందులో పేకేటి సినిమాల మీద రాసే సమీక్షలు నిష్కర్షగాను, విమర్శనాత్మకంగాను ఉండేవి. ఇంటూరి వెంకటేశ్వరరావు ఆ పత్రికా నిర్వహణ బాధ్యతలు చూస్తుండేవారు. ఇంటూరి తప్పుకున్న తరవాత ఆ పత్రికా సంపాదకత్వ బాధ్యతలను పేకేటి నిర్వహిస్తూ వచ్చారు. బెంగుళూరు కేంద్రంగా 'సినిమా ఫ్లేమ్' అనే సినీ పత్రిక విడుదలయ్యేది. ఆ పత్రికకు మద్రాసు ప్రతినిధిగా పేకేటి పనిచేశారు. పేకేటి రాసే సినీ సమీక్షలు అందరినీ ఆకర్షించేవి. ఆరోజుల్లో డిటెక్టివ్ నవలలకు కూడా మంచి డిమాండ్ వుండేది. పేకేటి 'భగవాన్' అనే డిటెక్టివ్ పేరుతో పద్దెనిమిది నవలలు రాశారు. బెంగుళూరు సినీ పత్రికకు పనిచేస్తున్నప్పుడే పేకేటికి 'హిస్ మాస్టర్స్ వాయిస్' (హెచ్.ఎం.వి) గ్రామఫోను సంస్థలో తెలుగు విభాగం ఆర్కెస్ట్రా ఇన్ చార్జి గా ఉద్యోగం వచ్చింది. వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో 'శాంతి' (1952) చిత్రం నిర్మించినప్పుడు అందులో పేకేటికి 'టామ్ టామ్' అనే జర్నలిస్టు పాత్రను పోషించే అవకాశం వచ్చింది. 1953లో దర్శక నిర్మాత కె.ఎస్. ప్రకాశరావు ప్రకాష్ ఆర్ట్స్ సంస్థ మీద నిర్మించిన 'కన్నతల్లి' చిత్రంలో పేకేటి 'శర్మ' పాత్రను పోషించారు. సంగీత దర్శకుడు పెండ్యాల ఇందులో 'పెరుమాళ్ళు' అనే పాత్ర పోషించడం విశేషం. అలాగే యక్షగానం లో నృత్యం చేసిన రాజసులోచనకు, గాయని సుశీలకు కూడా ఇది తొలి చిత్రమే. దేవదాసు' చిత్రం విడుదలైంది. అందులో అక్కినేనికి స్నేహితుడు 'భగవాన్' గా పేకేటి అపూర్వంగా నటించాడు. వద్దంటే డబ్బు' చిత్రంలో పేకేటి ఎన్.టి. రామారావు ప్రాణమిత్రుడు 'రామ్' అనే కవి పాత్ర పోషించారు. జమున పేకేటికి జంటగా నటించింది. కన్యాశుల్కం' (1955)లో పోలీసు కానిస్టేబుల్ గాబీ అదే సంస్థ నిర్మించిన 'చిరంజీవులు' చిత్రంలో 'రత్నం' అనే విలన్ పాత్రలోను నటించి తన ప్రతిభను చాటుకున్నారు. అంజలీ పిక్చర్స్ వారు వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో నిర్మించిన 'అనార్కలి' చిత్రంలో, 'సువర్ణసుందరి' లోకూడా పేకేటి హాస్యపాత్రలో నటించారు. చిత్తజల్లు పుల్లయ్య దర్శకత్వం వహించిన సోషియో ఫాంటసీ చిత్రం 'దేవాంతకుడు' లో పేకేటి (వి)చిత్రగుప్తుడు పాత్ర పోషించి మెప్పించారు. 'భీష్మ' (1962) చిత్రంలో విచిత్ర వీర్యుడుగా నటించారు. భాగ్యరేఖ, పాండురంగ మహాత్మ్యం, పెళ్లినాటి ప్రమాణాలు, ఇల్లరికం, జయభేరి, గులేబకావళి కథ, గాలిమేడలు, బభ్రువాహన, మురళీకృష్ణ, వెలుగునీడలు వంటి చిత్రాలలో మంచి పాత్రలు పోషించారు. తరవాత పేకేటి శివరాం కన్నడ సినిమాలలో బిజీ అయిపోయారు. తెలుగు, కన్నడ, తమిళ చిత్రాలలోఅటు హాస్యనటుడిగా, ఇటు క్యారక్టర్ నటుడిగా వంద సినిమాలకు పైగా నటించారు. చుట్టరికాలు' (1968) పేరుతో పునర్నిర్మించిన చిత్రానికి కూడా పేకేటి శివరాం స్క్రీన్ ప్లే సమకూర్చి దర్శకత్వం వహించారు. 1969లో 'పునర్జన్మ' అనే చిత్రాన్ని నిర్మించగా, ఆ చిత్రానికి కూడా పేకేటి దర్శకత్వం వహించారు. ఎన్.టి. రామారావు ఎన్.ఎ.టి బ్యానర్ మీద 1972లో 'కులగౌరవం' పేరుతో తెలుగులో పునర్నిర్మించగా, ఆ చిత్రానికి పేకేటి శివరాం దర్శకత్వం వహించారు. పేకేటి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రాల్లో ఏడు సినిమాలు సిల్వర్ జుబిలీలు, గోల్డన్ జుబిలీలు జరుపుకున్నాయి. అలాగే తెలుగులో 'భలే అబ్బాయిలు' చిత్రానికి కూడా పేకేటి దర్శకత్వం వహించారు. పేకేటి 2006 డిసెంబర్ 30 తేదీన చెన్నైలో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఇక ఏకీకృత టెండరు

భానుపురి : అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాల్లో అందజేసే కోడిగుడ్లలో నాణ్యత, పారదర్శకత పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టెండరు నిబంధనల్లో మార్పుచేసి ఏకీకృత విధానంలో సరఫరా చేయనుంది. మధ్యాహ్న భోజన పథకం మినహా అంగన్‌వాడీ, వసతిగృహాల విద్యార్థులకు తాజాగుడ్లు సరఫరా చేసేందుకు టెండరు విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో జిల్లాస్థాయిలో శాఖలవారీగా టెండర్లు నిర్వహించేవారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మొదట్లో జిల్లాల వారీగా, 2023 నుంచి రాష్ట్రస్థాయి టెండరు ద్వారా జోన్ల వారీగా గుడ్లు సరఫరా చేస్తున్నారు. మూడుసార్లు, మిగతా సమయంలో నెలకు రెండుసార్లు గుత్తేదార్లు సరఫరా చేయగా, జోన్ల వివరాలు సూచిస్తూ స్టాంపు వేసేవారు. గుడ్ల సరఫరాలో పారద్శకత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో టెండరు ఖరారు చేయనున్నారు.

**ఇవీ నిబంధనలు** గుడ్డు బరువు, పరిశుభ్రత, సరఫరా తీరుపై కొత్త నిబంధనలను ప్రభుత్వం రూపొందించింది. ప్రతి జిల్లాలో గుడ్లు




అందిస్తున్న అన్ని విభాగాలకు ఒకే టెండరు నిర్వహించేలా ఏకీకృత విధానం ప్రవేశపెట్టింది.తాజా నిబంధనల ప్రకారం అగ్ మార్కు కలిగి ఉన్న గుత్తేదారు టెండరు వేయడానికి అర్హులు. గుడ్డు బరువు 45-52 గ్రాములు, ఒక ట్రేలోని 30 కలిపి మొత్తం బరువు 1,350 గ్రాములుండాలి. కోడి గుడ్డు పెట్టిన 5 రోజుల్లోనే కేంద్రాలకు సరఫరా చేయాలి. ప్రతినెలా తప్పకుండా 3 విడతల్లో పదిరోజులకోసారి నాణ్యమైనవి సరఫరా చేయాలి. జిల్లాస్థాయిలో ఒకే గోదాం, అందులో జిల్లా అవసరాల్లో 40శాతం గడ్లు అందుబాటులో ఉండేలా చూడాలి. ఇక ప్రతి గుడ్డుపై 8 మి.మీ.ల వృత్తంలో జిల్లా వివరాలతో కూడిన ముద్ర ఉండాలి. వృత్తం పైభాగంలో 2 నుంచి 3 మి.మీ.ల మందంతో లబ్ధిపొందే శాఖ పేరు, మధ్యలో నెల, జిల్లా పేరు, కింది భాగంలో తెలంగాణ ప్రభుత్వం అని ఉండాలి.నెలలో మొదటి విడతలో సరఫరా చేసే గుడ్లపై నీలిరంగు స్టాంపు, రెండు, మూడు విడతల్లో సరఫరా చేసే వాటిపై ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో స్టాంపు వేయాలి.

# అమాత్యులపైనే భారం

నల్గొండ: శాసనసభ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించిన అధికార కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అదే వ్యూహాన్ని అనుసరించి విజయబావుటా ఎగరవేసేందుకు సన్నద్ధమవుతోంది. రేపటిలోగా జడ్పీటీసీ స్థానాలకు ప్రతిపాదనలు పంపించాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించడంతో పార్టీ నేతల హడావుడి మొదలైంది. ఒక్కో స్థానానికి బలమైన, అర్హులైన ముగ్గురు అభ్యర్థుల పేర్ల ప్రతిపాదనలతో జాబితాను సిద్ధం చేయాలని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆయా మంత్రులకు, ఎమ్మెల్యేలకు సూచించారు. దీంతో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల చుట్టూ తిరుగుతున్నారు. తమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సదరు మంత్రులకు ఫోన్లు చేయించి టికెట్‌పై స్పష్టమైన హామీలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు.

నల్గొండ జిల్లా పరిషత్తు ఛైర్మన్ పీఠంతో పాటు 33 ఎంపీపీ స్థానాలపై పాగా వేసేందుకు కాంగ్రెస్ గురిపెట్టింది. 2018 ఎన్నికల్లో నీలగిరి జడ్పీ పీఠం తొలిసారి భారాస దక్కించుకుంది. బండా నరేందర్‌రెడ్డి ఛైర్మన్‌గా పనిచేశారు. ఈసారి కూడా అదే ఒరవడితో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీనివ్వాలని గులాబీ పార్టీ యోచిస్తోంది. హస్తంతో పొత్తు దిశగా సీపీఐ అడుగులు వేస్తుండగా, భాజపా ఒంటరి పోరుకు సన్నద్ధం అవుతోంది.

**జడ్పీ పీఠంపై గురి** ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా జడ్పీఛైర్మన్ స్థానాలు ఎవరికి దక్కనున్నాయోననే చర్చ ఇప్పుడే మొదలైంది. జిల్లాల పునర్విభజన అనంతరం తొలిసారిగా సూర్యాపేట జడ్పీ పీఠం బీసీలకు రిజర్వు కాగా నల్గొండ జిల్లాలో ఎస్టీ మహిళకు ఛైర్మన్ అయ్యే అవకాశం దక్కింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ బీసీ మహిళ ఛైర్మన్ పీఠంపై కూర్చోనున్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ శాసనసభ ఎన్నికల్లో చేసిన



తప్పిదాలను సరిచేసుకుంటూ గ్రామాల్లో విస్తృతంగా మద్దతుదారులను సమీకరించుకోవడం, ఏకగ్రీవ తీర్మానాలు చేసేందుకు మొగ్గు చూపడంలో ఆసక్తి కనబరుస్తున్నాయి.

మెజార్టీ గ్రామాల్లో తమ మద్దతుదారులే గెలవాలనే లక్ష్యంగా రాజకీయ పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. భారాస, భాజపా, ఇతర పార్టీలు సైతం అంతర్గత సమావేశాలు ఏర్పాటు చేసి అధికార పార్టీ వైఫల్యాలే అజెండాగా సమీకరణాలు చేస్తున్నాయి.

**అనుభవజ్ఞులు.. విధేయులకే పెద్దపీట**జడ్పీ పీఠం దక్కించుకుని రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశంతో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, అర్థ, అంగ బలం ఉన్న వారు పోటీపై ఆసక్తి కనబరుస్తున్నారు. జడ్పీ ఛైర్మన్ పదవికి జిల్లాల వారీగా అన్ని నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ ఉంటుందని రాబోయే సాధారణ ఎన్నికల్లోనూ ఈ అనుభవం అవసరమవుతుందనే ఉద్దేశంతో ఎంపీపీ, ఎంపీటీసీల కన్నా జడ్పీటీసీ స్థానానికి పోటీ నెలకొంది. 2018 నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ కోసం కష్టపడినవారికే టిక్కెట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందని ఏఐసీసీ స్పష్టం చేసిందని పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల 5న ప్రతిపాదనలు పంపిస్తే, 6, 7 తేదీల్లో అభ్యర్థులను వడపోసి తర్వాత తుది జాబితా వెల్లడించే అవకాశం ఉంది.

# శుద్ధ 'జలం'.. అబద్ధం



కరీంనగర్ : మానవ మనుగడకు జీవనాధారం నీరు. ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది నీటి నాణ్యతను పట్టించుకోవడంలేదు. ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని గల్లీకో శుద్ధజల ప్లాంటు వెలుస్తున్నాయి. వాటిపై పర్యవేక్షణ లేకపోవడం, కాసుల వర్షం కురుస్తుండటంతో యథేచ్ఛగా నడుస్తున్నాయి. జిల్లాలో వాటర్ ప్లాంట్ల తీరుపై కథనం.

**అనధికారికంగా నడుపుతూ..**

దాదాపు అన్ని మండలాల్లో కలిపి 800-1000 శుద్ధ జల కేంద్రాలున్నాయి. జిల్లాలో నాలుగు ప్లాంట్లకు మాత్రమే బీఐఎస్ నిబంధనలకు అనుమతులు ఉన్నాయని సమాచారం. మిగిలిన వాటిని అనధికారికంగా నడుపుతున్నారు. అన్ని అనుమతులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు దాదాపు రూ.కోటి వరకు ఖర్చవుతుందని అంచనా.శాఖల మధ్య సమన్వయ, అధికారుల పర్యవేక్షణ లేమితో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి కొందరు ప్లాంట్ల నిర్వాహకులు వాటర్ క్యాన్లను సరిగ్గా శుభ్రం చేయడంలేదు. ఏళ్లుగా పాత వాటినే వినియోగిస్తున్నారు. వడు నెలల కంటే అధికంగా వాడితే ఆల్కలైన్ ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. వడు నెలలకోసారి మార్చాలనే నిబంధన ఎక్కడా అమలు కావడంలేదు.

కరీంనగర్‌లో ఉన్న నీటి నాణ్యత పరీక్ష కేంద్రం సిబ్బంది కొరతతో నామమాత్రంగా మారింది. వరంగల్, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు విధిగా పరీక్షలు చేసి అవసమైతే సూచనలు లేదంటే చర్యలు తీసుకోవాలి.

**అనుమతులు తప్పనిసరి**

నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటుకు గ్రామ పంచాయతీ లేదా పురపాలిక నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకొని, విద్యుత్తు శాఖ కనెక్షన్ పొందాలి. ట్రేడ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్), ఆహార కల్తీ నిరోధక, భూగర్భ జల, ఇతర శాఖల అనుమతులు తప్పనిసరి. చాలా చోట్ల పాటించడం లేదు.

జల నాణ్యతను పరిశీలించే పరికరాలు, రసాయనాలు, మైక్రో బయాలజిస్ట్ లేదా కెమిస్టులు ప్లాంటులో పని చేయాలి.

స్టీల్ డ్రమ్ములు, అంతర్గత పైపులైన్, ఏసీలు ఉపయోగించాలి.

యంత్రాల్లో వాడే ఫిల్టర్లను నెలకోసారి శుభ్రం చేయాలి.

ప్రతిరోజు టీడీఎస్ పరికరం ద్వారా నీటి సాంద్రతను పరిశీలించి నమోదు చేయాలి. ఇది జరగడం లేదు.**నాణ్యత తెలుసుకోవచ్చు ఇలా..**తాగునీరు సురక్షితమో.. కాదో తెలుసుకోవచ్చు థర్మామీటర్‌ను పోలి ఉండే టోటల్ డిసాల్వ్ సాలిడ్స్ (టీడీఎస్) పరికరం ద్వారా పరీక్షించవచ్చు మార్కెట్‌లో ఇవి తక్కువ ధరకే లభిస్తాయి. టీడీఎస్ స్థాయిని పార్ట్స్ ఫర్ మిలియన్ (పీపీఎం) స్థాయిలో లెక్కిస్తారు.

# అ'పూర్వ' సేవ!



గోదావరిఖని : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు రూ.20 లక్షలతో పాఠశాలను ఆధునీకీకరించారు. 1981-82 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలకు రంగులు వేయించడంతోపాటు ల్యాబ్ పరికరాలు, కంప్యూటర్‌లు, ఫర్నీచర్ సమకూర్చారు.

కరీంనగర్ పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి పూర్వ విద్యార్థులు విరాళాలు అందజేశారు. 40 మంది విద్యార్థులు రూ.లక్ష చొప్పున, ఆరుగురు విద్యార్థులు రూ.8 లక్షల చొప్పున పాఠశాల భవన నిర్మాణానికి సాయం అందించారు.

మొత్తం రూ.88 లక్షల నిధులను వివిధ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు అందించి తాము చదివిన పాఠశాల ఉన్నతికి దోహదపడ్డారు.

గోదావరిఖని సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు 1993-94 బ్యాచ్ విద్యార్థులు 40 బెంచీలు బహూకరించారు. రూ.1.37 లక్షలు విరాళంగా సేకరించిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో సౌకర్యానికి సహకారం అందించారు.

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1975 బ్యాచ్ విద్యార్థులు తాగునీటి శుద్ధి ప్లాంటును అందజేశారు.

ఆదివారం వచ్చిందంటే వివిధ పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు సమ్మేళనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. జ్ఞాపకాల కలబోతతో సరదాగా గడపడమే కాదు తమ స్నేహితుల మంచి, చెడ్డ తెలుసుకుంటున్నారు.. బడికి ఏమైనా సాయం అవసరమా తెలుసుకుని సాయం చేస్తున్నారు. ప్రతి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏటా 25 వేల మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేస్తున్నారు. ఆ తరువాత ఉన్నత చదువులు, ఉద్యోగాల వేటలో పడి చిన్ననాటి స్నేహితులందరినీ కలిసే అవకాశం లేనివారు జీవితంలో స్థిరపడ్డాక పూర్వ విద్యార్థుల సమ్మేళనాలకు చొరవ చూపుతున్నారు. సమ్మేళనాలు సాయం అందించడానికి వేదికగా ఉపయోగించుకుంటున్నారు.

**పూర్వ విద్యార్థుల సాయం ఇలా..**

తమకు చదువు చెప్పిన వారిలో పేద ఉపాధ్యాయులు ఉంటే నెలనెలా భృతి అందేలా ఏర్పాటు చేస్తున్నారు.

స్నేహితుల్లో ఎవరైనా తీవ్ర అనారోగ్యానికి గురైనా, మరణించినా వారి కుటుంబాలకు సాయం అందజేస్తున్నారు.

ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్నేహితుల కుమార్తెల వివాహానికి డబ్బులు సమకూర్చడం, కానుకలు అందజేయడంలో ముందుంటున్నారు.

విదేశాల్లో స్థిరపడ్డవారు ఇక్కడ తమ స్నేహితుల పిల్లలకు మార్గదర్శనం చేసి వారు ఉపాధి అవకాశాలను అందుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు.

తాము చదువుకున్న బడికి అవసరమైన ఫర్నీచర్, కంప్యూటర్లు అందిస్తున్నారు.

శుద్ధనీటి సౌకర్యం ఏర్పాటుకు చొరవ చూపుతున్నారు.

అదనపు గదుల నిర్మాణానికి సాయం అందిస్తున్నారు.

బాగా చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు.

# పేరుకు సహకారం.. సేవలు నామమాత్రం

మల్యాల : రైతుల ఆర్థికాభివృద్ధి కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీధరణి వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం(ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్) సేవలు నామమాత్రంగా మారాయి.

జిల్లాలో మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్, మల్యాల మండలకేంద్రాల్లో సంఘాలను ఏర్పాటు చేశారు. మల్యాలలో దాదాపు ఆరు నెలల క్రితం ఎఫ్‌పీవో ఎరువుల దుకాణాన్ని అధికారులు ప్రారంభించగా ఎప్పుడు చూసినా వసే ఉంటోంది. వివిధ రకాల ఎరువులు, క్రిమిసంహారక మందులను తక్కువ ధరకు రైతులకు అందించాలన్న ఆలోచనతో స్థానిక ఐకేపీ పాత భవనంలో దుకాణాన్ని ప్రారంభించారు. ఇప్పటివరకు 536 బస్తాల యరియా మాత్రమే అందించిన అధికారులు, దుకాణాన్ని ఎప్పుడూ వసి ఉంచడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇదీ ఉద్దేశం**

జిల్లాలోని మల్లాపూర్, కథలాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్యాల, కొడిమ్యాల, కోరుట్ల, గొల్లపల్లి, పెగడపల్లి, జగిత్యాల, ధర్మపురి, మేడిపల్లి, రాయికల్ మండలాలకు చెందిన దాదాపు 2 వేల మంది మహిళలు శ్రీధరణి వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సంఘంలో సభ్యులుగా ఉన్నారు.

మల్యాల సంఘంలో 1099 మంది సభ్యులున్నారు. ప్రతి సభ్యురాలు రూ.500 చొప్పున సభ్యత్వ రుసుం చెల్లించారు. ఎఫ్‌పీవో దుకాణం నిర్వహణకు ప్రభుత్వం మల్యాల సంఘానికి రూ.40 లక్షల ఆర్థిక సాయం అందించింది.

ఆయా మండలాల్లో రైతులు పండించిన వరి, నువ్వులు, మిరప, మక్కలు, కందులు తదితర ఉత్పత్తులను దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేయకుండా సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేయాల్సి



ఉంటుంది. వాటిని నిలువ చేసి మార్కెట్‌లో డిమాండ్ వచ్చినపుడు విక్రయిస్తే సంఘానికి లాభాలు చేకూరతాయి.

గ్రామ స్థాయిలో 52 చిన్న సంఘాలు

రాష్ట్రంలోని సహకార సంఘాలకు(సింగిల్‌విండో) దీటుగా ఎఫ్‌పీవోల ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చడానికి ప్రభుత్వం 'బేనిశాన్' పేరిట వివిధ రకాల సేవలను అందుబాటులోకి తేవడానికి యోచిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ప్రస్తుతం ఉన్న రెండు శ్రీధరణి సహకార సంఘాలతో పాటు గ్రామాల్లో ఒక్కో సంఘంలో 15 నుంచి 20 మంది సభ్యులతో 52 చిన్న సంఘాలు పని చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిసింది.

**మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తాం**

శ్రీధరణి వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాల ద్వారా రైతులకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం. ఎఫ్‌పీవో ఎరువుల దుకాణాన్ని అన్ని వేళలా తెరచి ఉంచడంతో పాటు రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను తక్కువ ధరకు విక్రయించేలా ఏర్పాట్లు చేస్తాం. ఎఫ్‌పీవో సంఘాల ద్వారా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయిస్తాం.

రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# గుత్తేదారులు వదిలేశారు!

భువనగిరి: ప్రభుత్వం పనులు మంజూరు చేస్తోంది. గుత్తేదారులు ఒప్పందం చేసుకుంటున్నారు.. మంత్రులు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు పనులు మధ్యలో వదిలేసి వెళ్లిపోతున్నారు. కొత్త పనులు చేయకుండా ఆపేస్తున్నారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల తీరు ఇలా.. ప్రణాళికేతర నిధులతో రెండేళ్ల కిందట భువనగిరి మండలంలో మూడు రహదారుల బీటీ రెన్యూవల్ ప్రతిపాదించారు. టెండర్ల క్రతువు ముగిసి గుత్తేదారు ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క పనికూడా ప్రారంభించలేదు. వీటిలో అనాజీపూర్ నుంచి జంపల్లి వరకు 5 కి.మీ.లకు రూ.కోటి, భువనగిరి అప్రోచ్‌రోడ్డు-ముత్తిరెడ్డిగూడెం-దాతర్‌పల్లి వరకు 10 కిమీలకు రూ.2 కోట్లు, ముత్తిరెడ్డిగూడెం- గంగసానిపల్లి- పాత గుట్ట వరకు 4.6 కిమీ సుమారు రూ.కోటి మంజూరు చేశారు.

బీబీనగర్-పోచంపల్లి మార్గంలో మూసీ నదిపై రుద్రవెల్లి-జూలూరు మధ్యన వంతెన పనులు ప్రారంభించి ఏడేళ్లు కావొస్తుంది. నాబార్డు ఆరేళ్ల కింద రూ.8.5 కోట్లతో మంజూరు చేసింది. కరోనా నేపథ్యంలో మరో ఏడాది గడువు పొడిగించారు. ఆ లోపు నాబార్డు గడువు ముగియడంతో చేసిన పనుల వరకు బిల్లులు చెల్లించి పనులు నిలిపివేశారు. అసంపూర్తి పనులు చేపట్టేందుకు విడిగా కొత్త అంచనాలు తయారు చేసి పంపగా 2022-23లో ఎస్సీ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.10.80 కోట్లు మంజూరు చేశారు. కాకతీయ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఈ పనులు పొందింది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపి వేశారు. చౌటుప్పల్ మండలంలో 2023లో ఏడు రోడ్ల నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులు మంజూరయ్యాయి. రోడ్ల నిర్మాణం కాలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈ రోడ్ల విస్తరణ 3.7 మీటర్ల నుంచి 5.5 మీటర్లకు పెంచేందుకు ప్రతిపాదించి అదనపు



నిధులు మంజూరు చేయించారు. పనులు పూర్తయితే రోడ్డు సౌకర్యం ఏర్పడుతుంది.

**పాత పనుల రద్దుకు సిఫార్సు**

– సుగంధర్, డీఈ, ఆర్‌అండ్‌బీ, భువనగిరి డివిజన్

గుత్తేదారులు ఒప్పందం చేసుకుని ఇంత వరకు ప్రారంభించని పనులు రద్దు చేయాలని (డీ-సాంక్షన్) కోరుతూ ఇటీవల ప్రభుత్వానికి రాశాం. ఇటీవల మంజూరైన పనులు ప్రారంభించేలా గుత్తేదారులపై ఒత్తిడి తెస్తున్నాం. బిల్లులు కాకపోవడంతో గుత్తేదారులు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. అయినా వారిని ఒప్పించి పనులు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.రాయగిరి నుంచి మోత్కూరుకు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా 2021-22లో ప్రభుత్వం రూ.5.80 కోట్లు మంజూరు చేసింది. మోత్కూరు నుంచి కప్రాయిపల్లి వరకు 3.40 కి.మీ. చేపట్టిన పనులు నేటికీ అసంపూర్తిగా మిగిలాయి. రోడ్డు అధ్వానంగా తయారైంది.ఆత్మకూరు మండలంలో రాయగిరి-మోత్కూరు రెండు వరసల ప్రధాన రహదారికి దశలవారీగా మరమ్మతులు నిర్వహిస్తున్నారు. గుత్తేదారు ఏడాది క్రితం తుక్కాపురం స్టేజీ నుంచి బునాదిగాని కాల్వ కల్వర్టు వరకు రహదారి తారును తొలగించి కంకర పరిచి పనులు వదిలేశారు.

# శంకుస్థాపనకు చురుగ్గా ఏర్పాట్లు

భువనగిరి: భువనగిరిలో జిల్లా కోర్టుల సముదాయం శంకుస్థాపనకు వడివడిగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణ శివారులోని మాసుకుంట వద్ద సర్వే నెంబర్ 742లో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం భువనగిరి పట్టణంలోని పాత భవనంలో జిల్లా కోర్టులు కొనసాగుతున్నాయి. కొత్తగా కోర్టు రావడంతో వాటికి తగినట్లుగా నూతన భవనాలు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. రూ.81 కోట్లు మంజూరు చేశారు. 12 జిల్లాలకు కలిపి ఒకేసారి టెండర్లు పిలిచారు. జిల్లాల వారీగా గుత్తేదారులతో ఒప్పందాలు కూడా జరిగాయి. నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగాల్సి ఉంది. తేదీ ఎప్పుడు ఖరారు అయినా శంకుస్థాపనకు సన్నాహాల్లో భాగంగా పైన 500 మందికి పైగా కూర్చునే విధంగా స్థలాన్ని సిద్ధం చేశారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

స్థలంలో గుట్టలు ఉండటంతో లెవలింగ్ పనులు చేపట్టారు. నేల నుంచి 50 మీటర్ల ఎత్తులో ఉండటంతో భవన నిర్మాణాల కోసం లెవల్స్ తీసి హద్దులు నిర్ణయించారు. స్థలం మధ్యన, నాలువైపులా ప్రత్యేక బోర్లు వేసి మట్టి నమూనాలు తీసి పరీక్షలకు పంపారు. నివేదికల మేరకు ఆకృతులు ప్రతిపాదించి నిర్మాణాలను చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ సైదులు తెలిపారు. మూడు రోజుల క్రితం ఒక బోరు బావి వేశారు. సమృద్ధిగా నీళ్లు పడ్డాయి. అక్టోబరు రెండో వారంలో శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



10 ఎకరాల స్థలం కేటాయించగా.. రెండు ఎకరాల విస్తీర్ణంలో భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. జి ప్లస్ 3 అంతస్థుల్లో నిర్మిస్తున్నారు. స్టిల్ట్ పార్కింగ్ కోసం ఒక్కో అంతస్థు 46 వేల చ.అడుగుల్లో నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదించారు. మొత్తం 12 కోర్టు హాళ్లు, మహిళా, పురుష న్యాయవాదులకు విడివిడిగా నిరీక్షణ భవనాలు, ఆయా కోర్టులకు విడివిడిగా కార్యాలయాలు, స్టోర్, రికార్డుల గదుల నిర్మాణానికి ప్రతిపాదించారు. భవిష్యత్‌లో న్యాయమూర్తుల భవన సముదాయాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. హాళ్ల చుట్టూ గోడ నిర్మించనున్నారు. గుట్టపైకి రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. స్థలంలో చెట్లు ఉండటంతో అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. పైకి కచ్చా రహదారులు ఏర్పాటు చేస్తున్నారు.

# యాసంగికైనా భరోసా కలిగేనా!

జగిత్యాల : రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పంటల(ఫసల్) బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించిన నేతల హామీలు అమలుకు నోచుకోవడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు సీజన్లు గడిచినా అన్నదాతకు భరోసా కరవైంది. అక్టోబరు నుంచి యాసంగి పంట కాలం మొదలైన నేపథ్యంలో ఈసారైనా బీమా పథకం అమలుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**అత్యధికంగా 9 పంటలకు..**

యాసంగి సీజన్‌లో పంటల బీమాను అమలు చేయాలంటే ఇప్పటి నుంచి డిసెంబరు 15లోగా నోటిఫికేషన్ వెలువరించాల్సి ఉంటుంది. గతంలో బీమా కంపెనీకి రైతులు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే 25 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేవి. మొత్తం ప్రీమియంను రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని నేతలు పేర్కొన్నారు. ఇది అమలైతేనే అన్నదాతకు ఊరట కలుగుతుంది. గతంలో రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో జగిత్యాల జిల్లాలో 9 పంటలకు బీమా పథకం అమలైంది. మిగిలిన జిల్లాల్లో 6 పంటలకు బీమా ఉండేది. ప్రధానమంత్రి ఫసల్ బీమా ద్వారా వరి, మక్క, వేరుశనగ, పెసర, మినుము, నువ్వులు, వాతావరణ ఆధారిత బీమా ద్వారా మామిడి, వానాకాలంలో పత్తి, మిరపకు కూడా బీమా ఉండేది. కొన్ని సీజన్లుగా అమలు చేయకపోవడంతో ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు ఆసరా కరవైంది. మరోవైపు పంటలు దెబ్బతిన్నపుడు ఎకరాకు



రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడంతో రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారు.

**ఇవీ లోపాలు**

2000లో పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి 2019 వరకు 31 సీజన్లలో అమలు చేశారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు మొత్తం 9.13 లక్షల మంది రైతులు రూ.62.12 కోట్ల ప్రీమియం చెల్లించగా ఇంతే మొత్తంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీకి చెల్లించాయి.

చాలా సీజన్లలో రూ.వందల కోట్లలో రైతులు నష్టపోయినా 3.72 లక్షల మందికి రూ.72 కోట్ల పరిహారం మాత్రమే వచ్చింది. మామిడిలో వాతావరణ బీమాను అమలు చేసినా కనీసం చెల్లించిన ప్రీమియం మేరకు కూడా పరిహారం రాలేదు. ఈ నేపథ్యంలో రైతువారీగా లేదా కమతం, సర్వే నంబర్ల వారీగా బీమా అమలు, ప్రీమియం చెల్లింపును రైతుల ఇష్టానుసారం చేయడం ద్వారా పథకం అమలులోని లోపాలను చాలావరకు అరికట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పథకంలో మార్పులకు బదులు అయిదేళ్ల కిందట కేవలం కిస్తీ చెల్లింపును రైతుల ఇష్టానుసారం చేసి అమలు బాధ్యతను కంపెనీకి వదిలిపెట్టాయి. పైగా తాము చెల్లించాల్సిన కిస్తీపై ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించనందున రైతుల్లో నమ్మకం సడలి బీమా వైపు వెళ్లలేదు. ఇప్పటికైనా ఫసల్ బీమా పథకానికి నోటిఫికేషన్‌ను వెలువరించడంతో పాటు బీమా పరిధిలోకి వచ్చే రైతులు, కుటుంబసభ్యులకు రూ.2 లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం సంభవిస్తే రూ.1.25 లక్షల పరిహారం, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితర పరికరాలకు పరిహారం అందేలా పథకం విస్తరణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

# పంటమార్పిడి.. మేలైన దిగుబడి

చిట్యాల: పాతికేళ్లుగా పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ భిన్నంగా ముందుకు సాగుతున్నారు చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన పజ్జూరు అజయ్‌కుమార్‌రెడ్డి. పంటమార్పిడితో కూలీల కొరత, ఒకే తరహా పంటలను కొనసాగించడం వల్ల ఆశించే చీడపీడల బెడద, రసాయనాలు, క్రిమిసంహారక మందుల పిచికారీ ఖర్చును తగ్గించవచ్చంటున్నారు. ప్రస్తుతం 4ఎకరాల విస్తీర్ణంలో సీతాఫలం, 5ఎకరాల్లో అరటి, కొబ్బరి సాగు చేస్తున్నారు.

**చెరకుతో మొదలు**

గ్రామంలో ఆముదం, పత్తి, వరిని ప్రధానంగా సాగు చేసేవారు. పంటలపై కొంతమేర అధ్యయనం చేసి, పాతికేళ్ల క్రితం 5 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా చెరకు సాగు చేపట్టారు. ఖమ్మం నుంచి విత్తనం తెప్పించారు. దిగుబడి బాగానే వచ్చింది. తొలుత మిర్యాలగూడ ప్రాంతంలోని కొనుగోలు కేంద్రానికి దిగుబడిని తీసుకెళ్లి విక్రయించారు. తర్వాత మెదక్ జిల్లా జోగిపేట్ ప్రాంతానికి తీసుకెళ్లారు. దూరప్రాంతం, రవాణా ఛార్జీలు అధికమవుతుండడంతో చెరకు సాగును అక్కడితో ఆపేశారు. అప్పుడే ఎకరానికి సుమారు రూ.50వేలు గిట్టుబాటైందని



పేర్కొన్నారు. అనంతరం 5ఎకరాల్లో చేపల చెరువును నిర్మించి, కృష్ణా జిల్లా కైకలూరు నుంచి చేపపిల్లలను తెప్పించి పెంపకాన్ని ప్రారంభించారు. గ్రామ పరిసరాల్లోని ప్రజలే తమ మార్కెట్‌గా.. చెరువు దగ్గరే పట్టి విక్రయించేవారు. ఎకరానికి ఏటా రూ.లక్ష వరకు ఆదాయాన్ని పొందామన్నారు. నాలుగేళ్లుగా 4ఎకరాల్లో దేశవాళీ రకం సీతాఫలాన్ని సాగు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా బాటసింగారం పండ్ల మార్కెట్‌కు తీసుకెళ్లి దిగుబడిని విక్రయించగా ప్రస్తుతం కాంట్రాక్టరుకు అప్పగించారు. రైతు స్వయంగా తీసుకెళ్లి మార్కెట్ చేసుకుంటే ఎకరానికి రూ.70వేలదాకా గిట్టుబాటు అవుతుందన్నారు. 5 ఎకరాల్లో అరటి, కొబ్బరి సాగును తాజాగా చేపట్టారు. కొబ్బరి ఒక వరస, అరటి మూడు వరసల చొప్పున మొక్కలు నాటించారు. కొబ్బరి మొక్క ఒక్కొక్కటి రూ.270, అరటి రూ.14 చొప్పున వెచ్చించారు. అరటి 4000, కొబ్బరి 400 మొక్కలు నాటించారు. వ్యాపారులు అరటి తోట దగ్గరకే వచ్చి కొనుగోలు చేస్తారని, కొబ్బరి మాత్రం స్థానికంగా మార్కెట్ చేసుకోవచ్చని తెలిపారు. పత్తి వంటి వాణిజ్య పంటలతో పోల్చితే కూలీలు, రసాయనాల పిచికారీ వంటి ఖర్చులు ఈ పంటలకు నామమాత్రమే అంటున్నారు. రైతులు పంటల మార్పిడితో ముందుకు సాగి సాగునష్టాలను నివారించుకోవాలని సూచించారు.

# భావి నగరమంతా భూగర్భ విద్యుత్ తీగలు



హైదరాబాద్: భారతదేశంలోనే తొలి అత్యాధునిక నగరమైన భారత్ ఫ్యూచర్ సిటీలో విద్యుత్ వ్యవస్థ మొత్తాన్ని భూగర్భ కేబుళ్ల ద్వారా నిర్వహించనున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేలపై విద్యుత్ స్తంభాలు, తీగలు లేకుండా చూడాలంటూ ఆదేశించడంతో భావినగర అభివృద్ధి సంస్థ, విద్యుత్ అధికారులు అంచనాలు రూపొందించారు.

**నైపుణ్యాల విశ్వవిద్యాలయం.. సమీకృత గురుకుల పాఠశాల..** ఫ్యూచర్ సిటీలో నైపుణ్యాల విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణాలు జరుగుతున్నాయి. నైపుణ్యాల విశ్వవిద్యాలయాన్ని డిసెంబరు 9న ప్రారంభించనున్నారు. నిర్వాసితుల స్థలాల్లో లే-అవుట్లను వేసి పనులు ప్రారంభించేందుకూ సన్నాహాలు జరుగుతున్నాయి. రేయింబవళ్లు పనులు చేసేందుకు మీర్‌ఖాన్‌పేటలో 33/11కేవీ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేటస్తున్నారు. ఇప్పటికే లే-అవుట్లు, రహదారులు మార్కింగ్ చేసిన నేపథ్యంలో భూగర్భ కేబుళ్ల నిర్మాణానికి మార్గాన్ని రూపొందించనున్నారు.

**ఫ్యాబ్‌సిటీ.. మామిడిపల్లి నుంచి**

మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల మధ్య ఏర్పాటవుతున్న భావినగరంలో పర్యావరణ, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, ఐటీ సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించనున్న నేపథ్యంలో విద్యుత్ అవసరాలకు ఇబ్బందులు లేకుండా ఫ్యాబ్‌సిటీ, మామిడిపల్లిలోని ఉపకేంద్రాల నుంచి విద్యుత్ సరఫరా చేయనున్నారు. మరోవైపు భూగర్భంలో విద్యుత్ తీగలు ఏర్పాటుచేసేందుకు ఒక డక్ట్ వినియోగించనున్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ డక్ట్‌లోనే తాగునీటి పైప్‌లైన్లు వేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ డక్ట్‌లోనే ప్రైవేటు సంస్థలు, బీఎస్ఎన్ఎల్ సంస్థల ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ లైన్లు అందులో ఉండేలా ప్రణాళికలు రూపొందించారు.

**అంచనాలు ఇలా...** అండర్ గ్రౌండ్ లైన్లు వేయనున్న పరిధి: 30-40 కి.మీ.
33 కేవీ తీగలకు ఒక కి.మీ.కు..: రూ.45 లక్షలు
11 కేవీ తీగలకు ఒక కి.మీ.కు ఖర్చు..: రూ.16 లక్షలు

# స్థలం సర్కారుది.. పట్టా ప్రైవేటుది.. రూ.500 కోట్ల విలువ.. స్థిరాస్తి సంస్థ భారీ పన్నాగం



హైదరాబాద్: రాజధానికి అత్యంత సమీపంలోని ఇబ్రహీంపట్నం మండలం కొంగర కలాన్ గ్రామంలోని సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమి. ప్రస్తుతం ఎకరా రూ.5 కోట్లు పలుకుతోంది. అంటే విలువ రూ.500 కోట్లు. ఆ భూమిని అక్రమార్కులు రియల్ సంస్థ పేరు మీద రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. ఇప్పుడు హద్దులు పాతి సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు.

**నాటి నేతల ఆశీస్సులతో..**

కొంగరకలాన్ గ్రామంలోని వ్యవసాయ సీలింగ్ భూములపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. సీలింగ్ పరిమితిలోని భూముల యజమానులతో మాట్లాడి వాటిని మినహాయింపజేస్తామని, తమకు విక్రయించాలంటూ ఒప్పందం కుదుర్చుకున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు, గత ప్రభుత్వంలోని ముగ్గురు ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో సీలింగ్ నుంచి వాటికి మినహాయింపు తెప్పించుకున్నారు.

**ఎలా చేశారంటే..**

ఈ వ్యవహారం వెనుక ముగ్గురు రెవెన్యూ అధికారులు కీలకపాత్ర పోషించినట్టు తెలిసింది. కిందిస్థాయి అధికారి ఒకరు, ఒక డివిజన్ అధికారి, ఒక జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారి అంతా తామై వ్యవహరించారని విశ్వసనీయ సమాచారం. ఐదేళ్ల కిందటి వరకు ఈ భూములు 22ఏ షెడ్యూలు నిషేధిత జాబితాలో ఉన్నాయని ఇబ్రహీంపట్నం తహసీల్దారు ధ్రువీకరించి రికార్డుల్లో నమోదు చేశారు.

రియల్ సంస్థ ప్రతినిధులు భూ యజమానులను తెరపైకి తీసుకొచ్చారు. అవి సీలింగ్ భూములు కావని.. తామూ, తమ కుటుంబ సభ్యులందరూ పంచుకున్నామంటూ రంగారెడ్డి కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు సమాంతరంగా దరఖాస్తులు సమర్పించారు.


భూ యజమానుల దరఖాస్తులను పరిశీలించిన ఆర్డీవో వాటిని జిల్లా ట్రైబ్యునల్‌కు పంపించారు. సరిగ్గా ఇక్కడే ఒక రెవెన్యూ అధికారి, ఒక జిల్లా రెవెన్యూ అధికారి రంగప్రవేశం చేశారు.

రెవెన్యూ అధికారి ట్రైబ్యునల్‌లో నిర్ణయం తీసుకునే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి భూ యజమానుల కోరిక మేరకు సీలింగ్ పరిమితి నుంచి మినహాయింపు ఇప్పించారు. పక్కా రికార్డులుండేలా జిల్లా రెవెన్యూ అధికారి సూచనలతో ధరణి రికార్డుల్లో రియల్ సంస్థ, ప్రతినిధుల పేర్లను నమోదు చేయించారు.

**చర్యలకు సీఎంవో ఆదేశం..**

ఇటీవల ఈ భూముల వ్యవహారంపై ఓ రెవెన్యూ అధికారికి అనుమానం వచ్చి ఆరా తీయగా.. ఐదేళ్ల కిందటే ఓ రియల్ సంస్థ ప్రతినిధులు ఇదంతా చేశారని తేలింది. ప్రభుత్వానికి నివేదించగా.. వాటిని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని సీఎంవో కార్యాలయం ఆదేశించింది. సంబంధిత అధికారులపై చర్యలకు మరిన్ని సాక్ష్యాధారాలు సేకరిస్తున్నారు. లోతుగా పరిశోధన చేస్తున్నామని.. భూములను రక్షిస్తామని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారికు తెలిపారు.

# చివరి విడతైతే అదనపు భారం




గంగాధర: పల్లెల్లో స్థానిక సం'గ్రామ'ం వేడి మొదలైంది. ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకునేందుకు ఎన్నికల అభ్యర్థులు ఆపసోపాలు పడుతున్నారు. రిజర్వేషన్లు అనుకూలించిన వారు ఇప్పటికే మందు, విందులతో గ్రామాల్లో రాజకీయ వేడి రాజేశారు. అయితే రెండు విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలు నిర్వహిస్తుండగా పంచాయతీలకు మూడు విడతల్లో నిర్వహించనున్నారు. ఏ ఎన్నికైనా మొదటి విడత ముగిసిన వారికి ఖర్చులు కలిసి వస్తాయని.. చివరి విడత అయితే అదనపు భారం మోయాల్సి వస్తుందని ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో ఖర్చు చేసినా చివరిలో వెనుకంజ వేస్తే గెలుపోటములు తారుమారయ్యే అవకాశం లేకపోలేదని వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 60 జడ్పీటీసీ స్థానాలు, 646 ఎంపీటీసీ స్థానాలకు అక్టోబరు 23, 27న రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటికి ఆయా రాజకీయ పార్టీల గుర్తులు ఉండటంతో పార్టీ నిధులతోపాటు గుర్తు కలిసి వస్తుందన్న అంచనాలో ఆశావహులు ఉన్నారు. గ్రామ పంచాయతీల ఎన్నికల్లో మాత్రం అభ్యర్థులు తమ ఖర్చులు తామే పూర్తిగా భరించాల్సిన పరిస్థితి కావడంతో చివరి విడతలో ఎన్నికలున్న వారు ఆందోళనలో ఉన్నారు. మొదటి విడతకు మూడో విడతకు మధ్య 9 రోజుల వ్యవధి ఉండడం పెద్ద భారమేనని వాపోతున్నారు. మొదటి విడత 324 స్థానాలకు అక్టోబరు 31న, రెండో విడత 610 స్థానాలకు నవంబరు 4న, మూడో విడత 292 స్థానాలకు నవంబరు 8న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఖర్చులు ప్రారంభమయ్యాయని నోటిఫికేషన్లు ప్రారంభమయ్యాక మరింత పెరుగుతాయని పేర్కొంటున్నారు. దీంతో చివరి విడత అంటే అదనపు భారమేనని అంటున్నారు. ఆర్థిక వనరులున్న గ్రామ పంచాయతీల్లో సర్పంచి పదవికి అభ్యర్థులు రూ.లక్షలు వెచ్చించేందుకు వెనుకాడడం లేదు. గత పంచాయతీ ఎన్నికలో గంగాధర మండలంలోని ఓ గ్రామ పంచాయతీలోనైతే గెలిచిన, ఓడిన అభ్యర్థులిద్దరూ కలిసి దాదాపు రూ.కోటిన్నర ఖర్చు చేశారని ప్రచారం జరిగింది. అయిదేళ్ల తరువాత జరగనున్న ఎన్నిక కావడంతో ఈసారి ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# వినూత్న బోధన.. విశేష ఆదరణ

కరీంనగర్ : సమాజంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని.. ఎప్పటికప్పుడు ఉన్నతీకరణ చెందుతూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు వారు. కొందరు స్థానికంగా రాణిస్తుండగా.. మరికొందరు దేశ, విదేశాలకు వెళ్లి నైపుణ్యాన్ని పెంచుకుంటున్నారు. మరికొందరు విదేశాల్లోనూ బోధనలో రాణిస్తున్నారు. ఆదివారం 'ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం' సందర్భంగా అలాంటి ఉపాధ్యాయులపై కథనం.

**ఆంగ్లంపై భయం పోగొడుతూ..**

చిగురుమామిడి మండలం ముల్కనూర్‌లోని ఆదర్శ పాఠశాలలో పీజీటీగా పనిచేసే సయ్యద్ ఇర్షాద్ అలీ ఆంగ్ల బోధకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆంగ్లంపై విద్యార్థుల్లోని భయాన్ని తొలగిస్తున్నారు. ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో నడిచే 'దీక్ష' యాప్‌లో వీడియో పాఠాలను రూపొందించారు. యఎస్ఏలోని ఫుల్ బ్రైట్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు వారు నిర్వహించే స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించి ఆ దేశంలో 40 రోజులపాటు పలు అంశాలపై శిక్షణ పొందారు. ఎస్సీఈఆర్టీ వారి బెస్ట్ ప్రాక్టీస్ పోటీలో జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ చాటారు. ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ విద్యావిధానం కార్యక్రమంలో మన రాష్ట్రం తరఫున పాల్గొని ప్రసంగించి ప్రశంసలు పొందారు. విద్యార్థులను ఆంగ్లభాషలో తీర్చిదిద్దుతున్నారు. ఇర్షాద్‌ను రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి.

**ప్రయోగాలతో ఆకట్టుకునేలా..**

చిగురుమామిడి మండలం ఇందుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బి.ఓదెలు కుమార్ విద్యార్థులు సైన్స్‌పై ఆకర్షితులయ్యేలా బోధిస్తున్నారు. లోకాస్ట్-నోకాస్ట్ పద్ధతిలో ప్రయోగాలు రూపొందిస్తున్నారు. ఈయన పనిచేసిన పాఠశాలల్లోని విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ చూపుతుంటారు. 2011లో తిరుపతిలో జరిగిన దక్షిణ భారత విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో పాల్గొని పలు పాఠ్యాంశాలకు సంబంధించి ప్రయోగ కృత్యాలను రూపొందించారు. 2014లో చెన్నైలోని సైన్స్ టెక్నాలజీ ఆడిటోరియంలో దక్షిణ భారత్‌లోని కార్యశాలలో పాల్గొని పేపర్‌క్రాఫ్ట్ ద్వారా రాకెట్ నవనాలు తయారు చేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతోపాటు వివిధ సంస్థలు అందించే పలు అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు.


**విదేశీ విద్యార్థులకు పాఠాలు..**

రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన మల్లారపు రాము విదేశీ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. పదోతరగతి వరకు గ్రామంలో, ఆ తర్వాత ఇంటర్, డిగ్రీ కరీంనగర్‌లో చదివి, ఎంఏ ఇంగ్లిష్ కాకతీయ విశ్వవిద్యాలయం, ఎంఈడీ శాతవాహనలో చదివారు. అనంతరం ఆర్గానిక్ రసాయన శాస్త్రంలో పీజీ చేశారు. వదేళ్లు కరీంనగర్‌లోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. విదేశీ విద్యార్థులకు బోధించాలన్నదే ఆయన చిన్ననాటి కల. మొదట మాల్దీవుల్లో రెండేళ్లు పని చేశారు. అక్కడి నుంచి చైనాకు వెళ్లారు. ఎనిమిదేళ్లుగా అక్కడే పాఠాలు బోధిస్తున్నారు. ఏటా వేసవిలో అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయానికి వెళ్లి పాఠాలు బోధిస్తుంటారు. ఇతని తమ్ముడు వేణు కూడా అబుదాబీలోని అంతర్జాతీయ అమెరికన్ పాఠశాలలో భౌతికశాస్త్రం బోధిస్తున్నారు.

# రూ.కోట్ల భూమి కొట్టేశారు!

చిట్యాల : చిట్యాల పట్టణంలో అధికారిక అనుమతులు పొందిన స్థిరాస్తి వెంచర్లు 18 ఉన్నాయి. మరో 10కి పైగా అనుమలుతు లేనివి ఉన్నాయి. కొన్నిచోట్ల కొనుగోలుదారులకు ప్లాట్లు విక్రయించే సమయంలో పదిశాతం భూమి పంచాయతీకి కేటాయించినట్లు చూపించినా.. తర్వాతి కాలంలో దానిని ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసిన వారు నిర్మాణ అనుమతులు కావాలంటే మార్కెట్ విలువలో 14శాతం రుసుం చెల్లించాల్సి వస్తోంది. అనుమతులు లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు సుమారు 4వేల దరఖాస్తులు అందాయని ఇన్‌ఛార్జి పట్టణ ప్రణాళిక అధికారి శివ పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో వేసిన వెంచర్లలో ప్రజా అవసరాలు, పార్కులు, మౌలిక సౌకర్యాల ఏర్పాటు కోసం వదిలిన రూ.కోట్ల విలువైన స్థలాలు మాయమయ్యాయి. అధికారులు, పాలకులు కుమ్మక్కై పెద్ద మొత్తంలో స్థలాలు కాజేశారు. 2012కు ముందు మండల కేంద్రాలను, సమీప ప్రాంతాలను కలిపి పురపాలికలను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలకు దస్త్రాలు అప్పగించే సమయంలోనే ప్రభుత్వానికి అప్పగించాల్సిన 10శాతం స్థలాల రికార్డులు ఆనవాలు లేకుండా చేశారు. ప్రధానంగా చండూరు, చిట్యాల, నకిరేకల్, దేవరకొండ, మిర్యాలగూడ, కొండమల్లేపల్లి, నార్కట్‌పల్లి, మర్రిగూడ, మునుగోడు, హాలియా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వెంచర్లల్లో పురపాలికలు, పంచాయతీలకు చెందాల్సిన స్థలాలు అధికారులతో కలిసి రాజకీయ నాయకుల భాగస్వామ్యంతో రియల్టర్లు అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు వచ్చాయి.

నల్గొండ పురపాలిక పరిధిలో మామిళ్లగూడ, చర్లపల్లి, ఆర్జాలబావి ప్రాంతాల్లో వేసిన పాత వెంచర్లకు సంబంధించిన 10శాతం స్థలాలు కొన్నిచోట్ల మాయం చేశారు. వాటిపై రికార్డులు లేకపోవడంతో మున్సిపల్ అధికారులు మిన్నకుండిపోయారు. ప్రస్తుతం 72 ప్రాంతాల్లోని వెంచర్లలో మున్సిపాలిటీకి సుమారు వంద ఎకరాలకు పైగా స్థలాలు ఉన్నాయి. వాటిని కబ్జా కాకుండా శాటిలైట్ జియో ట్యాగింగ్ చేశారు. 20 ప్రాంతాల్లో రక్షణగా ప్రహరీ నిర్మాణాలు చేపట్టగా, మరికొన్ని స్థలాల్లో పట్టణ ప్రకృతి వనాలు, పార్కులను



అభివృద్ధి చేశారు. మరో 30 ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వాటిపై పరుల కన్ను పడుతోంది.

నకిరేకల్: నకిరేకల్ పురపాలిక ఐదేళ్ల క్రితం ఏర్పడింది. మేజర్ పంచాయతీగా ఉన్న కాలంలో ఇక్కడ 35 వరకు వెంచర్లు వెలిశాయి. పదిశాతం భూమిని ఒకటి, రెండు వెంచర్లలో మినహా మిగతా వాటిల్లో ప్రభుత్వానికి ఇవ్వలేదు. దాదాపు 35 ఎకరాలకుపైగా స్థలాన్ని వెంచర్ల నిర్వాహకులు రిజిస్ట్రేషన్‌చేసి అప్పగించాల్సి ఉంది. కానీ చాలా మంది స్థిరాస్తి వ్యాపారులు ప్లాట్లుగాచేసి విక్రయించేశారు. నేడు నకిరేకల్‌లో ప్రజా అవసరాల కోసం గజం ప్రభుత్వ స్థలం కూడా కరవైన దుస్థితి నెలకొంది.

**కబ్జాకు గురవకుండా భద్రత**

ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలిక

నల్గొండలో 2012లో ఏడు గ్రామపంచాయతీలు విలీనం చేశారు. అప్పట్లో సమర్పించిన దస్త్రాల ప్రకారం వెంచర్లలో 10 శాతం స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు తీసుకున్నాం. జియోట్యాగింగ్ చేయించాం. చాలా వాటికి రక్షణ కోసం ప్రహరీలు నిర్మిస్తున్నాం. ఎక్కడైనా ఆక్రమణకు గురైనట్లు ఉంటే సమాచారం ఇస్తే తప్పనిసరిగా రక్షిస్తాం.

# ఎల్లంపల్లిపైనే అన్నదాతల ఆశలు

గంగాధర : వానాకాలం మరో 20 రోజుల్లో ముగియనుంది. అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈసారి ఆశించినంతగా భారీ వర్షాలు కురవలేదు. ఎగువ ప్రాంతాల్లో కురిసినవాటికి శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండి వాటి ద్వారా ఉమ్మడి జిల్లాలోని మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాలకు నీరు చేరింది. ఈసారి మాత్రం వరుణుడు అంతగా కరుణ చూపలేదు. ఫలితంగా రైతులు వానాకాలంలోనూ ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిపైనే ఆశలు పెట్టుకున్నారు.

**అలాగైతేనే యాసంగి గట్టెక్కేది**

ఈ నెలాఖరు వరకు వర్షాలు కురవకపోతే.. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్, గంగాధర జలాశయాలను నింపి అక్కడి నుంచి చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని చెరువులు, కుంటలు నింపాలని రైతులు కోరుతున్నారు. అలాగైతేనే యాసంగి సాగు సాధ్యమవుతుందని వాపోతున్నారు. ఆయా ప్రాజెక్టుల ద్వారా వరద వృథాగా గోదావరిలో కలిసిపోతుందని.. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటితో ఇక్కడి నీటి వనరులు నింపితే తమను ఆదుకున్నట్లవుతుందని



అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు రైతులు ఇటీవల వినతిపత్రం అందజేశారు.

**ఒకే ఒక్క భారీ వర్షం**

గత నెల 28, 29 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో కురిసిన వర్షమే పెద్దది. ఈ రెండు రోజుల్లో కురిసిన భారీ వర్షంతోనే వ్యవసాయ బావుల్లో నీటి ఊటలు పెరిగాయి. గత నెల సాధారణ వర్షపాతం 203.8 మి.మీ కాగా.. 283.4 మి.మీగా నమోదైంది. ఈనెల 8 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 50.1 మి.మీ కాగా.. కేవలం 30.4 మి.మీ మాత్రమే కురిసింది. ఇంకా 45 రోజులపాటు వరికి నీటి వినియోగం తప్పనిసరి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**చెరువులన్నీ నింపుతాం**

ఆశించిన వర్షాలు కురవకపోవడంతో రైతులు అధైర్యపడొద్దు. ఎల్లంపల్లి ప్రాజెక్టుతో నారాయణపూర్ జలాశయం నింపి ఇక్కడి నుంచి నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నింపుతాం. ఈ మేరకు నీటిపారుదల శాక సీఈతో చర్చించాం. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం.మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

# రావడం సరే.. వెళ్లడం ఎలా

పెద్దపల్లి : పాత హాల్టింగ్‌లను పునరుద్ధరించేందుకు ఎట్టకేలకు సమయం ఆసన్నమైంది. 2020 నాటికి వివిధ రైళ్లకున్న హాల్టింగుల సేవలు ఈనెల నుంచి అందుబాటులోకి రానున్నాయి. పెద్దపల్లి, రామగుండం స్టేషన్‌లలో పలు రైళ్ల నిలుపుదలపై ఇప్పటికే రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే గతంలో మాదిరిగా కాకుండా ఒకవైపు ఇచ్చి మరోవైపు ఎత్తేశారు. తాజా నిర్ణయం మేరకు పెద్దపల్లి స్టేషన్‌పై వివక్ష స్పష్టంగా కనిపిస్తుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. గతంలో రైళ్లన్నింటికి రామగుండం, జమ్మికుంటలో హాల్టింగ్ కల్పించగా.. పెద్దపల్లిలో మాత్రం కేవలం దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కు దిగువ(హైదరాబాద్‌వైపు) మార్గంలోనే ఇచ్చారు.

**గతంలో ప్రాధాన్యం**

జీటీ మార్గంలో ప్రధానమైన పెద్దపల్లి స్టేషన్‌కు గతంలో ప్రాధాన్యం ఉండేది. వరంగల్ తరువాత ప్రతి రైలుకు పెద్దపల్లిలో హాల్టింగ్ కల్పించేవారు. అప్పట్లో ప్రతి ఆర్టీసీ బస్సు సైతం రైల్వేస్టేషన్‌కు వెళ్లడం ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసులకు ఈ స్టేషన్ బహుముఖ సేవలందించింది. అయితే రానురాను ప్రాభవం కోల్పోయింది. ఇక్కడి నాయకులు పారిశ్రామిక ప్రాంతాలపై దృష్టి పెట్టడంతో వ్యవసాయ, వ్యాపార కేంద్రమైన పెద్దపల్లిపై శీతకన్ను పడింది. ఇదే సమయంలో రైళ్ల హాల్టింగ్‌లు కూడా తగ్గాయి.

**పునరుద్ధరించినవి ఇవే..**

రామగుండంలో ఎస్ఎంవీటీ బెంగళూర్- దానాపూర్ ఎక్స్‌ప్రెస్



సంఘమిత్ర, మైసూర్-దర్భంగా ఎక్స్‌ప్రెస్, రామేశ్వరం-బనారస్, పట్నా-ఎర్నాకులం.. దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లకు ఇదివరకు ఒకవైపు హాల్టింగ్ ఉండగా తాజా మరోవైపు కల్పించారు.

పెద్దపల్లిలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కు కేవలం హైదరాబాద్ వైపు మాత్రమే హాల్టింగ్ ఇవ్వగా.. రాయపూర్ ఎక్స్‌ప్రెస్‌కు ఎటువైపు ఇవ్వలేదు.

**ప్రత్యేక రైళ్లకు హాల్టింగేది?**

వివిధ రైల్వేజోన్‌లు ప్రకటించిన దసరా, దీపావళి లాంటి పండుగల నేపథ్యంలో ప్రత్యేక రైళ్లకు పెద్దపల్లిలో హాల్టింగ్ కల్పించలేదు. ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయంతో ఎన్ఎస్‌జీ-4 స్థాయికి చేరుకున్నప్పటికి.. కాజీపేట-బల్హార్షా సెక్షన్‌లో ఎస్ఎస్‌జీ-5 స్థాయి స్టేషన్‌కు ఇచ్చిన ప్రాధాన్యత కూడా రైల్వే అధికారులు పెద్దపల్లికి ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) స్టేషన్‌ను సైతం ఇక్కడినుంచి 15 ఏళ్ల క్రితం రామగుండంకు తరలించారు. తాజాగా పెద్దపల్లిలో ప్రతిపాదించిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నాయకులు పొరుగు స్టేషన్లకు తరలించుకుపోతున్నారు.

# డివిజన్ కమిటీ కార్యదర్శి రూబెన్ లొంగుబాటు

**-నంబల్లా కేశవరావు అనుచరుడు**
**-45 ఏళ్ల అజ్ఞాతం:సీనియర్ మావో నేత**
**-సౌత్ జోన్ కమిటీ సభ్యుడు**
**-1981 లో అడివిబాట,ఒకసారి అరెస్ట్**
**-జైల్ నుండి పరార్,వయోభారం కారణంగా లొంగుబాటు**




చురకలు ఛీఫ్ రిపోర్టర్ వరంగల్ నిషేదిత సి.పి.ఐ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి, సౌత్ బస్తర్, డివిజనల్ కమిటీ సభ్యుడు, దండాకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ కి చెందిన మంద రూబెన్ ఏకన్నన్న ఏమంగన్న ఏసురేష్(67) వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎదుట మంగళవారం లొంగిపోయాడు. ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలు వెల్లడిస్తూ హన్మకొండ జిల్లా, హసన్ పర్తి మండలం, వంగపాడు గ్రామానికి చెందిన మంద రూబెన్,ఏకన్నన్న ఏమంగన్న ఏసురేష్ 1979 సంవత్సరంలో కాజీపేటలోని ఆర్.ఈ.సిలో హాస్టల్ మెస్ విభాగంలో పనిచేస్తున్న సమయంలో రాడికల్స్ యూనియన్స్ నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడై మావోయిస్టు పార్టీమాజీ ప్రధాన కార్యదర్శి ఒక్కప్పటి ఆర్.ఈ.సి పూర్వ విద్యార్థి నంబాల కేశవరావు పిలుపు నందుకొని మావోయిస్టు పార్టీ లో చేరి అజ్ఞతంలోని వెళ్ళిపోయాడు. 1981 సంవత్సరం నుండి 1986 వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వం దళ సభ్యుడుగా కుంట, బస్టర్ ప్రాంతాల్లో పనిచేసాడు. 1987లో మావోయిస్టు పార్టీ నాయకత్వం రూబెన్ ను ఏరియా కమిటీ సభ్యుడిగా అప్పగించడం జరిగింది. 1991లో అనారోగ్యం కారణంగా చికిత్స కోసం కొత్తగుడెం కు వెళుతున్న సమయంలో చత్తీస్గఢ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలు తరలించగా ఒక సంవత్సరం అనంతరం రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలసి జైలు నుండి తప్పించుకున్నాడు. 1992 లో జైలు తప్పించుకున్న రూబెన్ తిరిగి మావోయిస్టు పార్టీ లో కలిసి ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబుజ్ మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేసాడు. ఇదే సంవత్సరంలో సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ ఏరామన్న గోపన్న నేతృత్వంలో బీజాపూర్ జిల్లా, గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమే తో రూబెన్ కు వివాహం జరిపించారు. 2005 సంవత్సరం డివిజన్ కమిటీ సభ్యుడి పనిచేస్తున్న సమయంలో అనారోగ్యం కారణంగా పార్టీ ఆదేశాలతో రూబెన్ గుండ్రాయి గ్రామంలోనే భార్య, పిల్లలతో నివాసం వుంటూ, కోళ్లు, గొర్రెలు ఫారాలు నిర్వహిస్తూనే స్థానిక గ్రామ కమిటీలతో కలసి చురుకుగా పని చేసే వాడు. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ నాయకులతో పాటు దళ సభ్యులకు షెల్టర్, భోజన వసతులను కల్పిస్తూనే పోలీసుల కదలికలను గమనిస్తూ మావోయిస్టులకు సమాచారం అందిస్తూ మావోయిస్టుల కోసం పని చేసేవాడు.

అనారోగ్యం బాధపడుతున్న రూబెన్, ఉద్యమంలో పాల్గోడంలో శరీరం సహకరించకపోవడం ముఖ్యంగా మావోయిస్టు సిద్దాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజలకు మావోయిస్టులపై వ్యతిరేకత రావడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాల ద్వారా ప్రశాంతవంతమైన వాతావరణంలో తన కుటుంబ సభ్యులతో జీవించాలని, నిర్ణయించుకొని పోలీసుల ఎదుట రూబెన్ లొంగిపోవడం జరిగిందని సీపీ తెలియజేశారు.

**రూబెన్ పాల్పడిన నేరాల వివరాలు**

-ґ కుంట దళ సభ్యుడిగా పనిచేసే సమయంలో పెద్ద కెడు వాల్, పండోడు, పిడిమాల్, బండారిపాడు గ్రామాలకు చెందిన గ్రామస్తులను దళ సభ్యులతో కలసి హత్యలు చేయడంతో పాటు ఎలమకొండా గ్రామ సర్పంచ్ ను హత్య చేసిన సంఘటనల్లో నిందితుడు.

-ґ 1988లో గొల్లపల్లి-మారాయి గూడ మార్గం లో పోలీసుల కాన్వాయి పై మావోయిస్టుల కలసి 20 మంది సి.ఆర్.పై.ఎఫ్ పోలీసులను దారుణంగా హత్య చేసి వారి ఆయుధాలను పట్టుకొని పోయిన సంఘటనలో నిందితుడు. 1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడు గోపన్నతో కలసి తుర్లపాడు పోలీస్ స్టేషన్ పై దాడి చేసిన ఘటన లో రూబెన్ నిందితుడు. రూబెన్ పై 8లక్షల రూపాయల రివార్డ్ వుందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

# పాఠాలు నేర్వలే.. ప్రమాదాలు ఆగలే



మల్యాల : 2018 సెప్టెంబరు 11న కొండగట్టు ఘాట్‌రోడ్డుపై దేశంలోనే అతిపెద్ద బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. 'వై' జంక్షను నుంచి 104 మంది ప్రయాణికులతో జగిత్యాల వెళ్తున్న బస్సు బ్రేకులు విఫలమై అదుపు తప్పి దాదాపు 15 మీటర్ల లోతు లోయలోకి దూసుకెళ్లింది. మొత్తం 65 మంది మృతి చెందడం అత్యంత విషాదం నింపింది. ఏడేళ్లవుతున్నా ఇప్పటికీ ఘాట్‌రోడ్డు రూపురేఖలు మారలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పాఠాలు నేర్వలేదు.

**అటకెక్కిన ప్రతిపాదనలు**

బస్సు ప్రమాదం తర్వాత ఘాట్ రోడ్డు రూపురేఖలను సమూలంగా మార్చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రమాద కారణాలపై అధికారులు విశ్లేషించారు. దాదాపు రూ.కోటితో నాలుగు చోట్ల రక్షణ గోడలు, వేగ నిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేశారు.నాలుగు చోట్ల ప్రమాదకర మలుపులు, వాలు అధికంగా ఉన్న ప్రాంతాలను సరి చేయడంతో పాటు ఘాట్‌రోడ్డును విస్తరించాలని ప్రభుత్వానికి నివేదించారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద రంగులు వేయించినప్పటికీ కనిపించడం లేదు. ఘాట్‌రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ఘాట్‌రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లకుండా ప్రారంభంలో, 'వై' జంక్షను సమీపంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు వంగిపోయాయి. రెండో ఘాట్‌రోడ్డు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఘాట్‌రోడ్డుపై వేగంగా, న్యూట్రల్‌లో వెళ్లకూడదంటూ ఆలయ సిబ్బంది మైకులో చేసిన ప్రచారం మూణ్నాళ్ల ముచ్చటగా మారింది.

కొండగట్టు దిగువ ప్రాంత వ్యాపారుల విన్నపం మేరకు నాయకులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఘాట్‌రోడ్డు మీదుగా కార్లు, ఆటోలు, వ్యాన్లు, ద్విచక్రవాహనాల రాకపోకలను పునఃప్రారంభించారు.

**రవాణా శాఖ తనిఖీలతోనే అడ్డుకట్ట**

ఘాట్‌రోడ్డుపై ఇప్పటివరకు 120 మందికి పైగా మృత్యువాత పడ్డారు. 2024 నవంబరు 22న ఆటో బోల్తా పడి ఎనిమిది మంది గాయపడ్డారు. 2025 మార్చి 27న ఇద్దరు ఆటో పైభాగంలో కూర్చుని వస్తూ 'వై' జంక్షన్ వద్ద బారికేడుకు తగిలి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపడితే ప్రమాదాలకు అడ్డు కట్ట పడనుంది.

# ఇక రైతు వేదికల్లో యూరియా విక్రయాలు




కరీంనగర్ : రైతు వేదికల్లో యూరియా విక్రయాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం అన్ని చోట్ల యూరియా కొరత నెలకొంది. ఒకేసారి కాకుండా దశలవారీగా జిల్లాకు సరఫరా అవుతుంది. దీంతో యూరియా దక్కించుకోవడానికి అన్నదాతలు నానాఅగచాట్లు పడుతున్నారు. ఇక నుంచి రైతులు యూరియా కోసం గంటలపాటు నిరీక్షించే అవసరం లేకుండా మరిన్ని విక్రయ కేంద్రాలు తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లాలో మొదటి విడతలో పలు మండలాల్లోని 11 రైతు వేదికల్లో యూరియా విక్రయాలు చేపట్టాలని ప్రణాళికలు రచించారు.

జిల్లాలో ఇప్పటి వరకు 30 పీఏసీఎస్, 37 కేడీసీఎంఎస్, 16 ఏఆర్ఎస్, 19 ఎఫ్‌పీయూ కేంద్రాలతోపాటు ఇతర ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులు విక్రయిస్తున్నారు. కానీ యూరియా కొరత కారణంగా రైతులు పెద్ద ఎత్తున వరుసలో నిలబడటం, పలు చోట్ల గొడవలు సైతం జరుగుతున్నాయి. దీంతో మరిన్ని విక్రయ కేంద్రాలను రైతు వేదికల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా హుజూరాబాద్ డివిజన్‌లో యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు వరుస కట్టడం, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మొదటి విడతలో ఆ ప్రాంతంలోనే అధికంగా రైతు వేదికల ద్వారా విక్రయాలు చేపట్టనున్నారు.

**ఆయా ప్రాంతాల్లో ఇలా..**

జిల్లాలో మొదటి విడతలో జమ్మికుంట మండలంలోని జమ్మికుంట, మడిపల్లి, బిజిగిరిషరీఫ్, వావిలాల, వీణవంక మండలం కోర్కల్, రెడ్డిపల్లి, గన్నేరువరం మండలంలోని కాశీంపేట, మాదాపూర్, తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట, చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం, సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి రైతువేదికల్లో త్వరలో యూరియా విక్రయాలు ప్రారంభిస్తారు.

ఆయా పరిధిలోని ప్యాక్స్ కేంద్రాల బాధ్యులతోపాటు సంబంధిత ప్రాంత ఏఈవోలు బాధ్యతలు అప్పగించారు.

ఏ సొసైటీకి ఎంత యూరియా కేటాయించారనే విషయం రైతులకు ముందుగా తెలియజేస్తారు.

ఆ రైతు వేదికల్లో ఫ్లెక్సీ పెట్టి దానిపై విక్రయ వేళలు, బాధ్యుడి పేరు, చరవాణి నంబరు తప్పనిసరి ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

**మరింత రావాల్సి ఉంది**జిల్లాలో వానాకాలం సాగుకు సుమారు 43 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా. ఇప్పటి వరకు 27 వేల మెట్రిక్ టన్నులు వచ్చింది. మరింత యూరియా దశలవారీగా వస్తుంది. వచ్చిన యూరియాను అన్నదాతలకు వారికి సమీపంలోని రైతు వేదికల్లో అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. జె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# వంద రోజులు.. ప్రగతికి బాటలు

కోరుట్ల : పురపాలికల్లో ప్రభుత్వం అమలు చేసిన 100 రోజుల ప్రణాళికతో స్వచ్ఛత మెరుగవడంతో పాటు ప్రగతికి బాటలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. కోరుట్లలో పురపాలిక ఆదాయం గణనీయంగా పెరిగేందుకు దోహదపడింది.

**గణనీయంగా పెరిగిన ఆదాయం**

పట్టణంలోని 16,147 కుళాయిలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో రూ.8,85,800 బిల్లులు వసూలయ్యాయి. భువన్ సర్వే ద్వారా 5,079 ఇళ్లను గుర్తించి ఇందులో 4,884(96.16 శాతం) ఆన్‌లైన్ చేశారు. దీంతో రూ.76 లక్షల ఆస్తి పన్ను సమకూరింది. 262 దుకాణాలను గుర్తించి ట్రేడ్ లైసెన్సులు జారీ చేయడంతో బల్దియాకు రూ.5,03,580 ఆదాయం వచ్చింది. మిక్స్‌డ్ ప్రాపర్టీస్(వాణిజ్య, గృహ)లో ఉన్న 104 దుకాణాలను గుర్తించి లైసెన్స్‌లు జారీ చేయడంతో రూ.3.19 లక్షల ఆదాయం సమకూరింది. పాత మున్సిపల్‌లో మహిళా సంఘాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించగా వారికి రూ.22 వేల ఆదాయం వచ్చింది. కొత్తగా 16 స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయడంతో పాటు 82 సంఘాలకు రూ.7.91 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేశారు. 44 వీధి వ్యాపారుల గ్రూపులు ఏర్పాటు చేయించారు. అంతర్గత రహదారులపై గుంతలకు మరమ్మతు చేయించారు. 160 వీధి కుక్కలను ఏబీసీ కేంద్రానికి తరలించి సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించారు.

**పరిశుభ్రతపై ప్రజా చైతన్యం**

స్వశక్తి మహిళలకు చెత్త వర్గీకరణపై అవగాహన కల్పించారు. ప్రధాన కూడళ్ల వద్ద కళాకారుల ప్రదర్శనలు, సిబ్బందితో ర్యాలీలు నిర్వహించారు.

వ్యర్థాల శుద్ధీకరణ, సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాల్లో, డంపింగ్ యార్డులోని బయోమైనింగ్ విధానాలపై మహిళలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు.

పాఠశాలల్లో కంపోస్టు తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

హొటళ్లు, దుకాణాల్లో తనిఖీలు జరిపి ప్లాస్టిక్ వినియోగించినందుకు జరిమానాలు విధించారు.

మహిళలతో స్వచ్ఛ రాఖీల తయారీతో ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం నిర్వహించారు. బల్దియా కార్యాలయంలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 100 రోజుల ప్రణాళికపై ప్రచారం చేశారు.

**అందరి భాగస్వామ్యంతోనే విజయవంతం**

అధికారులు, సిబ్బంది, కార్మికులు, ప్రజల భాగస్వామ్యంతోనే కార్యక్రమం విజయవంతమైంది. సంపూర్ణ పారిశుద్ధ్య సాధన దిశగా విస్తృతంగా అవగాహన కల్పించాం. కుళాయిల ఆన్‌లైన్‌తో, అనుమతి లేని ఇళ్లను, దుకాణాలు గుర్తించి లైసెన్సులు జారీ చేయడం ద్వారా పురపాలికకు ఆదాయం భారీగా పెరిగింది. రవీందర్, మున్సిపల్ కమిషనర్

# అమ్మో ఆకలి.. ఎంతని ఓర్చుకోవాలి

సిరిసిల్ల : విద్యారంగం బలోపేతానికి పలు సంస్కరణలు అమలు చేస్తున్న సర్కారు ఇంటర్ విద్యార్థుల ఆకలి బాధలు తీర్చడంలో సంకోచిస్తోంది. ఏళ్ల తరబడి ప్రకటనలకు పరిమితమైన మధ్యాహ్న భోజనం క్షేత్ర స్థాయిలో అమలుకు నోచడం లేదు. కళాశాలల్లో విద్యార్థులు అర్ధాకలితో పాఠాలు వినే దుస్థితి నెలకొంది. ఫలితంగా హాజరు, ఉత్తీర్ణత శాతంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**ఇదీ పరిస్థితి** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గ్రామీణ నేపథ్యంలోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుతుంటారు. ఇటీవల సర్కారు అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి చేసింది. ఉదయం, మధ్యాహ్నం విద్యార్థుల ఫొటోలు తీసి అధ్యాపకులు అధికార వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంది. ఉదయం 9:30 గంటల్లోపే సదరు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. గ్రామాల నుంచి రాకపోకలు సాగించే విద్యార్థులకు బస్సులు లేక చేరుకోలేని పరిస్థితి ఉంది.ఉదయాన్నే కళాశాలకు హాజరయ్యే హడావుడిలో చాలామంది అల్పాహారం, మధ్యాహ్నానికి భోజనం బాక్సులు లేకుండా కాలేజీకి వస్తుంటారు. సాధారణంగా సర్కారు కాలేజీల్లో చదివే పిల్లలు పేద, మధ్య తరగతికి చెందిన వారే. ఉదయం భోజనం వండుకుని తిని, బాక్సుల్లో కళాశాలకు తీసుకురావడం సాధ్యం కావడం లేదు.రాత్రి మిగిలిన అన్నం తిని చాలా మంది కళాశాలకు వస్తుంటారు. మధ్యాహ్నానికి చాల మంది ఆకలి పేరుతో కళాశాలకు డుమ్మా కొడుతున్నారు. భోజనం చేయకుండా ఉన్న విద్యార్థులు నీరసానికి లోనవుతున్నారు. ఇక మధ్యాహ్నం పస్తులుండి పాఠాలు వినే పరిస్థితి మెజారిటీ విద్యార్థులది. ఇలాంటి చర్యలతో విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతోపాటు, పాఠాలపై శ్రద్ధ చూపలేరు. దీంతో వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణతపై ప్రభావం పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.ఇలాంటి సమస్యల నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు తగ్గుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను పంపేందుకు



ఆసక్తి కనబర్చడం లేదని చెబుతున్నారు. వసతిగృహ సదుపాయం కలిగిన కళాశాలలు, ప్రైవేటు విద్యా సంస్థలకు పంపుతున్నారు. అంత స్థోమత లేని విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోకి వస్తున్నారు. ఇప్పటికైనా సర్కారు మానవతా దృక్పథంలో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే విద్యార్థులకు చాలా ప్రయోజనం కలుగుతుందని, వెంటనే అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

**దాతలు ముందుకొస్తే..**

అన్ని కళాశాలల్లో కలిపి 2,595 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆకలి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఒక్కో కళాశాలను దత్తత తీసుకొని కనీసం అల్పాహారం, రాగిజావ అందించేలా చర్యలు చేపడితే మేలు చేకూరుతుంది.

జిల్లాలో...ప్రభుత్వ జూనియర్ కళాశాలలు - 10
ప్రథమ సంవత్సరం విద్యార్థులు - 1410
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు - 1185

# సౌరశక్తి.. పేదింట దీప్తి

రాజోలు : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. వీటిని ఉచితంగా ఏర్పాటు చేయడంతో పాటు సౌర పలకలు అమర్చిన స్థలానికి ప్రతినెలా కొంత మొత్తాన్ని ఇచ్చేందుకు సంకల్పించింది. ఆసక్తి ఉన్నవారిని ఎంపిక చేసేందుకు అధికారులు కార్యాచరణ చేస్తున్నారు.

**ఉప డివిజన్లలో..**

జిల్లాలోని అమలాపురం, కొత్తపేట, రాజోలు, ముమ్మిడివరం ఉప డివిజన్లలో 65,246 ఎస్సీ, 1,537 ఎస్టీ వెరసి 66,783 మంది వినియోగదారులు ఉన్నారు. ఇప్పటివరకు 9,320 మంది సౌర పలకలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చారు. ఇంకా 57,463 మందిని ఈ పథకంలోకి తీసుకువచ్చి వారికి ప్రయోజనం కల్పించాల్సి ఉంది. మరింత ఎక్కువ మంది వీటిని ఏర్పాటు చేసుకునే దిశగా ప్రత్యేకంగా దృష్టి పెట్టామని అమలాపురం ఈఈ కె.రాంబాబు తెలిపారు.



**ఇవీ ప్రయోజనాలు..**

ఒక కిలోవాట్ సామర్థ్యమున్న సౌర పలకలను ఏర్పాటు చేసుకుంటే 120 యూనిట్లు ఉత్పత్తి కాగా వినియోగదారుడుకి రూ.338 బిల్లు వస్తుంది. ఏడాదికి రూ.8 వేలు ఆదా కాగా ప్రభుత్వ రాయితీ రూ.30 వేలు వస్తుంది.

2 కిలోవాట్లకైతే ఏడాదికి రూ.20 వేలు ఆదాకాగా రాయితీ రూ.60 వేలు వస్తుంది.

3 కిలోవాట్లకైతే ఏడాదికి రూ.32,400 ఆదా కాగా రూ.78 వేలు రాయితీ లభిస్తుంది.

ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 200 చదరపు అడుగుల్లో సౌర పలకల ఏర్పాటు ప్రక్రియ ఉచితంగా చేస్తారు. దీనికిగాను ప్రతినెలా రూ.200 అద్దె రూపంలో చెల్లిస్తారు.

# రంగరాయ.. వసతికి వెతలేనయా!

కాకినాడ: రాష్ట్రంలోనే ప్రముఖ వైద్య కళాశాలల్లో ఒకటైన కాకినాడ రంగరాయ కళాశాలను వసతి సమస్యలు వెంటాడుతున్నాయి. వైద్య విద్యార్థులకు సరిపడా సదుపాయం లేదు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద పీజీ విద్యార్థులకు వసతిగృహాలు మంజూరు చేసినప్పటికీ నిధులివ్వలేదు. దీంతో వాటిని పీజీ గ్రాంట్‌లో పూర్తిచేయాలని భావించినా గుత్తేదారుకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో మధ్యలోనే నిలిపేశారు.

**అద్దెలకే అధికం**

కళాశాలలో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు చేరుతుంటారు. తగిన భవనాలు లేక ఉన్నవాటిలోనే వారికి వసతి సర్దుబాటు చేయాల్సి వస్తోంది. అండర్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు బంకర్ బెడ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పీజీ విద్యార్థులు సరిపడా వసతి లేక బయట ఉంటున్నారు. అద్దెలకే ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

**కదలని నిర్మాణాలు**

వైకాపా హయాంలో రూ.395 కోట్లతో టెండర్లు పిలిచారు. పనులు మొదలుపెట్టాక నిధులు ఇవ్వకపోవడంతో ఆగిపోయాయి. తర్వాత



పీజీ సీటు గ్రాంట్ కింద రూ.56.20 కోట్లతో వసతిగృహాల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించారు. పాత గుత్తేదారుకే ఆ బాధ్యత అప్పగించారు. ఆ పనులు కూడా నత్తనడకే. మూడేళ్లుగా నిర్మాణంలో కదలిక లేకున్నా సుమారు రూ.25 కోట్ల మేర బిల్లులు ఖర్చయినట్లు చూపించడం గమనార్హం. రంగరాయ ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్ వద్ద ప్రస్తావించగా వసతి సమస్య కొంతవరకు ఉన్నమాట నిజమేనని.. అదనపు హాస్టల్ భవనాల కోసం సీఎస్సార్ నిధులకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు.

**ఇదీ కళాశాల ముఖచిత్రం**

250.. ఏటా యూజీ సీట్ల భర్తీ

203.. పీజీ సీట్లు

1000 మంది.. నాలుగేళ్ల ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులు

600 మంది..మూడేళ్ల స్పెషాలిటీ వైద్యవిద్య అభ్యసిస్తున్నవారు

# ఆరు నెలల్లో రయ్.. రయ్!

కొయ్యలగూడెం : భారతమాల పరియోజన కార్యక్రమంలో భాగంగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) చేపట్టిన ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి 365 బీజీపై రాకపోకలకు మరో ఆరు నెలలపాటు ఆగాల్సిందే. జిల్లాలోని మన్యం, మెట్ట మండలాల ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ నాలుగు వరుసల రహదారి పనులు వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని యంత్రాంగం భావిస్తోంది. ఏలూరు జిల్లాలో చింతలపూడి మండలం రేచర్ల నుంచి కొయ్యలగూడెం మండలం కన్నాయగూడెం మధ్య దాదాపు 85శాతం పైగా పనులు పూర్తయ్యాయని పూర్వపు అధికారులు తెలిపారు. న్యాయస్థానంలో వ్యాజ్యాల కారణంగా కొయ్యలగూడెం మండలంలో 3 కి.మీల మేర పనులు ఆగిపోయాయి. ఇటీవల ఆ అంశం కొలిక్కిరావడంతో వేగంగా సాగుతున్నాయి.

యర్రంపేట, పొంగుటూరు, కన్నాయగూడెం గ్రామాల మధ్య ఎనిమిది చోట్ల కల్వర్టులు, నాలుగు చోట్ల అండర్ పాస్‌లు నిర్మిస్తున్నారు. పొంగుటూరు ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ దగ్గర తనిఖీ(టోల్) కేంద్రాలు ఏర్పాటు చేశారు. కన్నాయగూడెం సమీపంలో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి వద్ద టోల్ ప్లాజా నిర్మాణం పూర్తి కావచ్చింది. ఇవీ ప్రత్యేకతలు.. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ చేరడానికి సుమారు 56 కిమీలు దూరం తగ్గనుంది. దేవరపల్లి, ఖమ్మం మధ్య 24 కి.మీల దూరం తగ్గనుంది. దీంతో ప్రయాణ సమయమూ తగ్గుతుంది. రహదారిపైకి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లకు ప్రవేశం లేదు. కార్లు గంటకు 100 కి.మీలు, బస్సులు, రవాణా వాహనాలు 80 కి.మీల వేగంతో ప్రయాణించే వెసులుబాటు ఉంది. పశువులు రహదారిపైకి రాకుండా దారి పొడవునా ఇనుప కంచె నిర్మించనున్నారు. రహదారి: ఖమ్మం- దేవరపల్లి (ఎన్‌హెచ్-365బీజీ)

పొడవు: 162.126 కి.మీలు ఏలూరు జిల్లాలో: 56 కి.మీలు గ్రామాలు: 31 (ఉమ్మడి జిల్లా) తగ్గనున్న దూరం: రాజమహేంద్రవరం, హైదరాబాద్ మధ్య 56 కి.మీలు దేవరపల్లి, ఖమ్మం మధ్య: 24కి.మీలు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉమ్మడి జిల్లాలో దేవరపల్లి, పొంగుటూరు, జంగారెడ్డిగూడెం, రేచర్ల

# వ్యర్థానికి అర్థం



నంద్యాల : కూటమి ప్రభుత్వం ఇళ్లలోని వ్యర్థాలతో ఎరువు తయారు చేసి కూరగాయలు, ఆకుకూరలు పండించడం ద్వారా ప్రజల ఆరోగ్యంతోపాటు ఆదాయం సమకూరుతుందని భావించింది. గృహ ఆవరణ లేదా అనుకూలంగా ఉన్న స్థలాల్లో కంపోస్ట్ పిట్లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఖర్చు లేకుండా ఉపాధి హామీ పథకంలో వీటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల ఈ పిట్‌లను ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలో 2026 మార్చి చివరి నాటికి 59,094 కంపోస్ట్ పిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు 3,515 పిట్లను ఏర్పాటు చేశారు. డ్వామా అధికారుల పర్యవేక్షణలో అన్ని గ్రామాల్లో అధికారులు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**ఉపయోగాలు ఇలా..**

నేల దృఢత్వాన్ని, నీటి నిలుపుదల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.

రసాయనిక ఎరువుల, పురుగుమందుల అవసరాన్ని తగ్గిస్తుంది.

పర్యావరణాన్ని కాపాడుతుంది.

మట్టిలోని సారాన్ని, పోషకాల సమృద్ధిని పెంచుతుంది.

భూసారం తగ్గిన ప్రదేశాల్లో పంట దిగుబడిని మెరుగుపర్చడంలో సహాయపడుతుంది.

పంటకు తెగుళ్లను తట్టుకొనే శక్తిని పెంచుతుంది.

**ఇంటి ఆవరణలో..**

ఇంట్లో కూరగాయలు, ఇతర వ్యర్థాలను బయట వేస్తుంటాం. అలా కాకుండా అనువైన ఇంటి ఆవరణలో 3.3 అడుగుల పొడవు, వెడల్పు, 3 అడుగుల లోతు గుంతలు తవ్వి అడుగున రాళ్లు, పెంకులు వేసి.. ఆకులు, వాటిపైన పశువుల పేడ వంటి వ్యర్థాలు వేసి మూసివేయాలి. కొన్ని రోజులకు అవి కుళ్లి వర్మి కంపోస్టు తయారవుతుంది. దీన్ని ఇంటి ఆవరణంలో వేసిన ఆకుకూరలు, కూరగాయలు, పూల మొక్కలతోపాటు పొలాల్లో పంటలకు సైతం వేయవచ్చు.

**సద్వినియోగం చేసుకోవాలి-సూర్యనారాయణ, డ్వామా పీడీ. నంద్యాల.**

కంపోస్ట్ పిట్ ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ఇంటి వద్ద లేదా పొలాల్లో ఉపాధి హామీ పథక కూలీలతో ఉచితంగా ఏర్పాటు చేయిస్తాం. ఆసక్తి ఉన్నవారు రెండు పిట్లను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆర్గానిక్ రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఎరువుల తయారీ గురించి వ్యవసాయ అధికారులు ఉపాధి కూలీలకు శిక్షణ ఇవ్వనున్నారు.

# విధులు మరిచారు.. నిధులు మళ్లించారు



అమలాపురం: స్థానిక సంస్థలను గత ప్రభుత్వ హయాంలో సొంత జాగీరులా పాలకులు మార్చేశారు. ప్రభుత్వ పథకాల పేరుతో వైకాపా పార్టీ ప్రచారానికి సొమ్ములు దారి మళ్లించారు. అమలాపురం పురపాలికలో నాడు సాగించిన అడ్డగోలు వ్యవహారాలు అన్నీ ఇన్నీ కావు. 2023-24లో సుమారు రూ.26 లక్షలను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారు. ఫలితంగా నగర పంచాయతీకి ఎక్కువ, పురపాలక సంఘానికి తక్కువన్నట్లుగా తయారైంది.

**సమస్యలను గాలికొదిలేసి..**

పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మును ప్రజా సమస్యల పరిష్కారానికే వినియోగించాలి. అమలాపురంలో అభివృద్ధి పనుల జోలికి పోలేదు. రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు వెచ్చిస్తే పరిష్కారమయ్యేవి సైతం గాలికి వదిలేశారు. ఇక్కడ పాతకాలం నాటి పైపులను మార్చకపోవడంతో తరచూ లీకవడం, తాగునీరు కలుషితమై రోగాలబారిన పడుతున్నారు. భూపయ్య అగ్రహారంతో పాటు నల్లవంతెన-ఎర్రవంతెన వరకు, విత్తనాల కాలువ గట్టు-అబ్బిరెడ్డి వారి వీధి, వడ్డిగూడెం సూర్యనగర్‌కు వెళ్లే రోడ్ల అభివృద్ధిని విస్మరించారు.

**202324లో పురపాలక సొమ్మును ఇలా వాడేశారు..**

2022 జనవరిలో రూ.250 పింఛను పెంచినపుడు చేపట్టిన కార్యక్రమానికి రూ.70 వేలు ఖర్చుచేశారు. ఈ మొత్తాన్ని 2023 ఏప్రిల్‌లో పురపాలక నిధుల నుంచి మళ్లించేశారు. 2023 జనవరిలో మరో రూ.250 పింఛను పెంచారు. అప్పుడు అల్పాహారాలు, నీటి సీసాలు, ఫ్లెక్సీలు, నీలిరంగు వస్త్రం, టేబుళ్ల కోసం రూ.93 వేలు.. టెంట్‌లు, కూలర్లకు రూ.98 వేలు.. కుర్చీలు, సౌండ్ సిస్టమ్, ఇతరత్రా ఖర్చులకు రూ.81,350 కలిపి మొత్తంగా రూ.2.72 లక్షల పురపాలక నిధులు ఖర్చుచేశారు. అల్లవరం మండలం బోడసకుర్రులో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఫ్లెక్సీలు, టీ, కాఫీలు, స్నాక్స్, నీటి సీసాల కోసం రూ.86,8 00 నిధులు మళ్లించారు.

గతయేడాది జనవరిలో వాలంటీర్లకు వందనం పేరుతో సన్మానాలు చేపట్టారు. వేదిక, కూలర్లు, నీటి సీసాలు, సోఫా, కుర్చీలకు రూ.98,100.. సౌండ్ సిస్టమ్, అలంకరణ, పుష్పగుచ్ఛాలకు రూ.38 వేలు.. ఫ్లెక్సీలతో పాటు ఎరుపు, ఆకుపచ్చని తివాచీలకు రూ.94,300..ఎండుఫలాల బాక్సులు, బిస్కెట్‌లు, కుర్చీలు, ఫ్లెక్సీలకు మరో రూ.97,500 (మొత్తం రూ.3.27 లక్షలు) వాడేశారు.

సత్యనారాయణ గార్డెన్స్‌లో వైఎస్సార్ చేయూత నిర్వహించినందుకు పురపాలక నిధుల నుంచి 2023 మే నెల 22న రూ.6.06 లక్షలు మళ్లించేశారు. బాలయోగి స్టేడియంలో గతేడాది జనవరిలో వైఎస్సార్ ఆసరా కింద సదుపాయాల కోసం రూ.10.33 లక్షలు రెండు విడతలుగా డ్రా చేశారు.

# గుట్టుగా తప్పిద్దాం.. గుటుక్కున మింగేద్దాం



కాకినాడ: గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న అడ్డగోలు భూవ్యవహారాలు అన్నీఇన్నీ కావు. వైకాపా నేతలు ఫ్రీహోల్డ్ భూములను గద్దల్లా తన్నుకుపోవడమే ఇందుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం చేపట్టిన విచారణలో ఈ దందాలన్నీ వెలుగుచూస్తున్నాయి. నిబంధనలు మీరి నాడు ఫ్రీహోల్డ్ చేసిన వేల ఎకరాల అసైన్డ్ భూములను తిరిగి 22(ఎ)లో చేర్చింది. వాటిని రిజిస్ట్రేషన్లు చేయకుండా ఆ కార్యాలయాలకు లేఖలు పంపింది. కాకినాడ జిల్లాలో 3,648 ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల్లో తేడాలున్నట్లు గుర్తించారు. విచారణ చేపట్టి రెండుదశల్లో 1,800 ఎకరాలను తిరిగి నిషేధిత జాబితాలో చేర్చారు. మిగతావాటిపై పరిశీలన జరుగుతోంది.

**మేలు చేస్తున్నామంటూ గొప్పలు చెప్పి..**

ఎన్నికలకు ఏడాదిముందు వైకాపా సర్కారు ఓ జీవో తెచ్చింది. 20 ఏళ్లు పైబడి అసైనీ చేతిలో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తప్పించి విక్రయించుకోవచ్చని, ఇదంతా పేదలకు మేలని పేర్కొంది. ఇదే అదనుగా వైకాపా నేతలు ఇరవయ్యేళ్లు అనుభవం దాటని అసైన్డ్ భూములను, చెరువులు, పంట కాలువల స్థలాలను సైతం అధికారులపై ఒత్తిడి తెచ్చి 22 (ఎ) నుంచి తప్పించేశారు. రైతుల నుంచి కారుచౌకగా కొట్టేశారు. వాటిలో కొన్ని ఇప్పటికే రిజిస్ట్రేషన్లు జరగగా మిగతావాటిని అన్ రిజిస్టర్డ్ ఒప్పందాలు చేసుకున్నారు. తమ ప్రభుత్వం మళ్లీ వస్తే వాటిని చక్కబెట్టేయవచ్చని అనుకున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఈ భూదందాలకు అడ్డుకట్ట పడింది.

**దందాకు సహకరించింది ఎవరు..**

అర్హతలేని భూములను ఫ్రీహోల్డ్ చేయడం వెనుక ఉద్దేశమేంటి? వాటిని ఏ అధికారి నిషేధిత జాబితా నుంచి తప్పించారు..? వారి పేర్లు, హోదాలతో సహా వివరాలివ్వాలని కలెక్టరేట్ నుంచి ఆర్డీవో కార్యాలయాలకు ఆదేశాలొచ్చినట్లు తెలిసింది.

రౌతులపూడి మండలం పైడిపాలలో అడ్డగోలుగా ఫ్రీహోల్డ్ చేశారు. అక్కడి అసైన్డ్ భూముల్లో క్వారీలు, క్రషర్లు నడుస్తున్నాయి. జీవోను అడ్డుపెట్టుకుని పెద్దలే దక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కారు. 20 ఏళ్లు పైబడని అసైన్డ్ భూములను కలెక్టర్ ప్రొసీడింగ్స్ లేకుండానే 22(ఏ) నుంచి తప్పించేశారు. డీఆర్వో వెంకటరావు వద్ద ప్రస్తావించగా నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసినవాటిని తిరిగి నిషేధిత జాబితాలో చేర్చుతున్నామని, ఆ సమాచారం రిజిస్ట్రేషన్లశాఖకు ఇచ్చినట్లు తెలిపారు.

జిల్లాలో ఇలా.. (ఎకరాల్లో)

ఫ్రీహోల్డ్ చేసిన భూములు 8,091

నిబంధనలకు విరుద్ధంగా చేసినవి 3,648

రిజిస్ట్రేషన్ భూముల్లో ఉల్లంఘనలు 34


# మత్స్యకారుల ఆశలకు రెక్కలు

భీమవరం: బియ్యపుతిప్పలో ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని వేలాది మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, లబ్ధి చేకూరుతుంది. దీంతోపాటు ఇతర జిల్లాలకు చెందిన సముద్ర వేట సాగించే మత్స్యకారులకు కూడా ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. దీనిపై దృష్టి సారించాలని ఇటీవల కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం, ఆయన సానుకూలంగా స్పందించడంతో మత్స్యకారుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

**తెదేపా హయాంలోనే**

మత్స్యకారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అప్పటి తెదేపా హయాంలోనే ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటుకు బీజం పడింది. ఆరెకరాల స్థలం సేకరించి తొలి విడత నిధులు మంజూరు చేశారు. టెండర్లు పూర్తిచేసి స్థలాన్ని చదును చేసి మెటీరియల్ తీసుకొచ్చారు. 2018లో ఆ పనులకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టు సాకారం కాలేదు.

**హార్బర్ అని చెప్పి..**హార్బర్ నిర్మించాలని తొలుత భావించారు. కానీ గోదావరి సముద్రంలో కలిసే సంగమ ప్రాంతం కావడంతో పూడిక



ఏర్పడి పెద్ద పెద్ద ఓడలు నిలిపేందుకు కష్టమవుతుందని ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి నిర్ణయించారు. కానీ వైకాపా సర్కారు ప్రజలను పక్కదోవ పట్టించి హార్బర్ నిర్మిస్తామంటూ గొప్పలు చెప్పింది. చినమైనవానిలంక వద్ద సముద్రం ఒడ్డున కార్గో పోర్టు నిర్మిస్తామని చెప్పినా అడుగు ముందుకు పడలేదు. బియ్యపుతిప్పలో ఫిష్ ల్యాండింగ్ కేంద్రం పూర్తయితే దూరాభారం తగ్గడంతోపాటు జెట్టి, చేపల వేలం పాట నిర్వహించేం దుకు విశాలమైన గదులు, చేపలు ఎండబెట్టేందుకు ఫ్లాట్ ఫాంలు, శీతల గోదాములు, ఐస్ తయారీ పరిశ్రమలు అందుబాటులోకి వస్తాయి.

# పోయేది వందల్లో.. నమోదు పదుల్లో!

భీమవరం : కార్యాలయాలు, ఇళ్ల ముందు బండి పెట్టి లోపలకు వెళ్లొచ్చేసరికి అది అక్కడ ఉంటుందని చెప్పలేని పరిస్థితి. ద్విచక్రవాహనం కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా వెంటనే కేసు నమోదు చేయడం లేదు. ఎక్కడైనా దొంగ దొరికితే ఆగమేఘాలపై కేసులు నమోదు చేస్తున్నారు. పలు స్టేషన్ల పరిధిలో గత రెండేళ్లలో వందల సంఖ్యలో అపహరణలైనా నమోదు అంతంత మాత్రమేనని బాధితులు వాపోతున్నారు.

భీమవరానికి చెందిన శేఖర్ అనే ప్రైవేటు ఉద్యోగి బండి అపహరణకు గురై కొన్ని నెలలైనా ఇప్పటికీ ఫిర్యాదు తీసుకోలేదు

నరసాపురంలో పార్కు దగ్గర పెట్టిన బండి ఎత్తుకెళ్లిపోయారని ఫిర్యాదు చేసినా దొరికిన వెంటనే ఫోన్ చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారు. కేసు నమోదులో జాప్యం వహిస్తున్నారని బాధితుడు వాపోయారు

తాడేపల్లిగూడెం మార్కెట్ దగ్గర నిలుపుదల చేసిన రెండు ద్విచక్రవాహనాలు అపహరణకు గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తే కొన్ని రోజుల తర్వాత వివరాలు తీసుకున్నారు.

పెనుమంట్ర మండలం మాముడూరులో రెండు ద్విచక్రవాహనాలు అపహరణకు గురైనా కేసులు నమోదు కాలేదు. పొలమూరులో ఇంటి ముందు పెట్టిన వాహనం పోయినా పట్టించుకోలేదని బాధితులు తెలిపారు. గత రెండేళ్లలో ఇదే మండలంలో దాదాపు 20 ద్విచక్రవాహనాలు ఎత్తుకెళ్లిపోయారంటున్నారు.

**జాప్యం ఎందుకో!**

బండి పోయిందని బాధితులు చెప్పిన వివరాలతో కేసు నమోదు చేయరు. కొన్నిరోజుల పాటు నాన్చిన తర్వాతే ఫిర్యాదును పరిశీలిస్తారు. ఈలోగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా పట్టించుకోరు. ఏదైనా కేసు నమోదైతే వెంటనే పరిష్కరించాలి, ఆ వివరాలను క్రైం సమీక్షలో వెల్లడించాలి. కేసు నమోదే లేకపోతే సమీక్షలో చెప్పాల్సిన పని ఉండదనే ఆలోచనలోనే పోలీసులు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

**అంతంత మాత్రమే**

దొంగ దొరకగానే హడావుడిగా కేసులు నమోదు చేస్తారు. భీమవరం సబ్‌డివిజన్ పరిధిలో ఓ స్టేషన్‌కు చెందిన పోలీసులకు దొంగ దొరకగానే 6 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 15 కేసులు ఒకేసారి



నమోదయ్యాయి. ఇటీవల జిల్లాలో దొంగలు దొరకడంలేదో ఏమో నమోదులు అంతంత మాత్రంగా ఉన్నాయి. కొన్నిస్టేషన్లలో ఒక్కకేసూ లేదంటున్నారంటే అపహరణలే జరగలేదా, జరిగినా నమోదు చేయలేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. గత రెండేళ్లలో జిల్లా వ్యాప్తంగా వందలాది బాధితులు ఉండగా పదుల సంఖ్యలోనే ఫిర్యాదులు నమోదుపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని బాధితులు కోరుతున్నారు.

**చెబితే చర్యలు తీసుకుంటాం**

ఫిర్యాదులను వెంటనే నమోదు చేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. అపహరణకు గురైనవి గుర్తించేందుకు పోలీసులు గాలిస్తారన్నారు. చోరీలపై ఏదైనా పోలీస్‌స్టేషన్ పరిధిలో స్థానిక పోలీసులు పట్టించుకోకపోతే ఉన్నతాధికారులకు చెబితే బాధ్యులపై చర్యలు తీసుకుంటారన్నారు.

# జీతాలు రాక.. జీవనం సాగక!

కళ్యాణదుర్గం : ప్రభుత్వ ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య కార్మికులతోపాటు సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న వారికి ఐదు నెలలుగా జీతాలు అందలేదు. పూట గడవడానికి నానా అగచాట్లు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దసరా పండగకు కూడా చెల్లించలేదని వాపోతున్నారు. ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా వివిధ పారిశుద్ధ్య కార్మికులు 215 మంది ఉండగా, రక్షణ సిబ్బంది 180 ఉన్నారు.

**ఇచ్చేది తక్కువే..**

ఉమ్మడి జిల్లాలోని తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, కదిరి, హిందూపురం ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఒకరు సూపర్‌వైజర్, 10 మంది సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. కళ్యాణదుర్గం, కణేకల్లు, శింగనమల, పామిడి, గుత్తి,



కొనకొండ్ల, ఉరవకొండ, ధర్మవరం, తనకల్లు, గోరంట్ల, నల్లమాడ, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి తదితర చోట్ల కార్మికులు, రక్షణ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వారంతా రెండు వేర్వేరు ఏజెన్సీల కింద పని చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికుడికి నెలకు రూ.16 వేలు ఇవ్వాల్సి ఉన్నా రూ.11,800 ఇస్తున్నట్లు కార్మికులు వాపోతున్నారు. పైగా నెలలుగా బకాయిలు ఉంటున్నాయి. దీంతో జీతాలు రాక.. బయట అప్పులు పుట్టక నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

**త్వరలో సమస్య పరిష్కరిస్తాం**

– డేవిడ్ సెల్వరాజ్, డీసీహెచ్‌ఎస్

సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించి పాత ఏజెన్సీకే టెండర్లు ఖరారయ్యాయి. పారిశుద్ధ్య కార్మికులకు టెండర్ల ప్రక్రియ పూర్తికాలేదు. జీతాల విషయాన్ని ఉన్నతాధికారులు, ఏజెన్సీల దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# నేతల గ'లీజు'

చిత్తూరు : యాదమరి మండలం పరధరామి బీట్ కమ్మపల్లిలోని క్వారీని వైకాపా హయాంలో 'పెద్దాయన' కుమారుడు బలవంతంగా లాక్కున్నారు. తిరిగి రూ.40 కోట్లు వెచ్చించి యజమాని లీజు తెచ్చుకుంటే నాలుగేళ్లలో ఆ నేత రూ.100 కోట్ల విలువైన సంపద కొల్లగొట్టారు. తాజాగా కొందరు కూటమి ప్రజాప్రతినిధులు పోలీసుల ద్వారా తవ్వకాలు జరగకుండా అడ్డుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వంలో వైకాపా కీలక నేత, ఆయన అనుచరుల చేతుల్లోకి దాదాపు 120 క్వారీలు వెళ్లాయి. కింది స్థాయి నాయకులు మరో 50 వరకు లాక్కున్నారు. కూటమి ప్రభుత్వం వాటిపై ఆరా తీయడంతో తమకు న్యాయం జరుగుతుందని యజమానులు భావించారు. ప్రస్తుతం కొందరు కూటమి నేతలు.. వైకాపా నాయకుల మాదిరి క్వారీల్లో యథావిధిగా మైనింగ్ జరగాలంటే కప్పం కట్టాల్సిందేనని, లేదంటే పనులు జరగవని బెదిరిస్తున్నారు. ఇటీవల గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఇలాంటి వ్యవహారమే వెలుగు



చూడటంతో ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెనక్కి తగ్గారు. నగరి నియోజకవర్గంలో జగన్ పాలనలో కక్షపూరితంగా నిలిపిన క్వారీలకు అనుమతులున్నా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆ నాయకులను కాదని ముందుకెళ్తే గనులు, పోలీసులను రంగంలోకి దింపుతారని భయపడుతున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో సత్యవేడు, వరదయ్యపాళెంలోనూ ఇదే విధంగా అడ్డుతగులుతున్నారు. చిత్తూరులోనూ ఇదే పరిస్థితి ఉందని క్వారీల యజమానులు వాపోతున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఉన్న క్వారీలు: 387

మైనింగ్ రంగంపై ఆధారపడిన వారు: 2.20 లక్షల మంది

ఏటా ఆదాయం: రూ.228.2 కోట్లు

అడ్డు తగలకుంటే వచ్చే ఆదాయం: రూ.80 కోట్లు

# తక్కువ ధర.. ఆన్‌లైన్‌లో ఎర

తిరుపతి : రూ.10 వేల విలువైన వస్తువు రూ.5 వేలకే ఇస్తామని ఆన్‌లైన్‌లో ప్రకటన కనిపించిందా..! మంచి బేరం దొరికిందనుకొని సంబరపడి ఆర్డర్ పెట్టారా..! మీ బ్యాంకు ఖాతా లూటీ అయినట్లే! ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేసే సైబర్ నేరగాళ్లు 'తక్కువ ధర' పేరుతో ఎర వేస్తున్నారు. ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు గుప్పిస్తూ దోచేస్తున్నారు. వివిధ వస్తువులను మార్కెట్ ధరతో పోలిస్తే 50 శాతం తక్కువకే ఇస్తామంటూ గాలం వేస్తున్నారు. వాటిని నమ్మి సంప్రదిస్తే మోసపోయినట్టేనని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ బ్రౌజింగ్ చేసే సమయంలో ఇలాంటి ప్రకటనలు వెల్లువెత్తుతున్నాయి. 'లిమిటెడ్ ఆఫర్' పేరుతో ఖరీదైన వస్తువుల్ని రాయితీలతో ఇస్తామని ఫోన్ నంబరు అందుబాటులో ఉంచడం ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. ఇవీ జాగ్రత్తలు..!ఖరీదైన వస్తువుల్ని తక్కువ ధరకే ఇస్తామంటూ ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనల్ని గుడ్డిగా నమ్మకూడదు.

ప్రముఖ ఈ–కామర్స్ వెబ్‌సైట్లలో మాత్రమే కొనుగోలు చేయాలి.

ఆఫర్లు ఉన్నాయంటూ ఈ–కామర్స్ వెబ్‌సైట్ల పేరుతో వచ్చే లింకుల్ని ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు. వస్తువు ఏదైనా సరే ఈ–కామర్స్ వెబ్‌సైట్లలో ఆర్డర్ బుక్ చేసేందుకు కొంత మొత్తం కట్టాలని అడగరు.

ఒకవేళ మోసపోతే..ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ లేదా స్థానిక పోలీసులను ఆశ్రయించాలి.

%www.cybernet.gov.in

%ఫలితంగా పోగొట్టుకున్న డబ్బు వెంటనే రికవరీ చేయడానికి సాధ్యమవుతుంది.

# కొండల్నీ చెరబట్టారు



పెద్దవడుగూరు: అక్రమార్కులు కొండ కనిపిస్తే చాలు ఎర్రమట్టి కోసం తవ్వకాలు జరపడమే పనిగా పెట్టుకున్నారు. కనీసం సంబంధిత అధికారుల అనుమతులు తీసుకోకుండానే ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. పెద్దవడుగూరు మండలంలోని లక్షుంపల్లి సమీపంలో ఉన్న కొండ నుంచి ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా అధికార యంత్రాంగం కళ్లప్పగించి చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. లక్షుంపల్లి గ్రామంలోని బీసీ కాలనీకి సమీపంలోని కొండను తవ్వి మట్టిని తరలిస్తున్నారు. దీని వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి చెందిన వైకాపా సానుభూతిపరుడు ఓ అధికారి అనుమతులు తీసుకున్నానని చెబుతూ జేసీబీ సాయంతో ఏకంగా పది ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని రాత్రి, పగలు యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. ఇక్కడ కొండలు, గుట్టలు రూపుకోల్పోతున్నాయని అవినీతి పరుల ఆగడాలకు అడ్డుఅదుపులేకుండా పోతోందని ప్రజలు వాపోతున్నారు.

**ట్రాక్టర్ మట్టి రూ.1500లకు విక్రయిస్తూ...**

ఒక్కో ట్రాక్టర్‌ను రూ.1200 నుంచి రూ.1500 మధ్య అమ్ముతున్నారు. స్థానికంగా ఇంటి నిర్మాణాలు, వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారు. పది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ.. రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. కనీసం పంచాయతీ కూడా ఎలాంటి రుసుం చెల్లించలేదంటున్నారు. రెవెన్యూ, పోలీసు, గనులశాఖ యంత్రాగం పట్టనట్లు వ్యవహరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దారు ఉషారాణిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా లక్షుంపల్లి గ్రామంలో ఎర్రమట్టిని తవ్వుకోడానికి ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తవ్వకాలు జరుపుతున్నట్లైతే చర్యలు తీసుకుంటామన్నారు.

# జొన్నలు.. రాగులు బొక్కేస్తున్నారు!



అనంతపురం : రాష్ట్ర ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా జొన్నలు, రాగులు పంపిణీ చేస్తోంది. వాటిని లబ్ధిదారుకు పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కొందరు డీలర్లు... వ్యాపారులకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో 1,645 చౌక దుకాణాల పరిధిలో 6,57,828 కార్డులు ఉన్నాయి. కార్డుకు జొన్నలు మూడు కిలోలు, రాగులు కిలోల చొప్పున పంపిణీ చేయాలి. జిల్లాకు సంబంధించి నెలకు జొన్నలు 19,73,484 కిలోలు, రాగులు 6,57,828 కిలోలు కేటాయిస్తున్నారు. బియ్యం బదులు ఉచితంగా జొన్నలు, రాగులు తీసుకోవచ్చని కొందరు డీలర్లు చెప్పడం లేదు. దీనిపై కార్డుదారులకు సైతం అవగాహన లేకపోవడంతో దందా చేస్తున్నారు. జొన్నలు, రాగులు ఇస్తున్నట్లు వేలిముద్రలు తీసుకుని బియ్యం ఇచ్చి పంపుతున్నారు. మిగుల్చుకున్న వాటిని అమ్మేసుకుంటున్నారు.

**70 శాతం మేరకు..**

జొన్నలు, రాగులు అక్రమంగా తరలిస్తున్నా పట్టుకోలేని పరిస్థితి. కారణం రైతులు పండించనవి అని చూపుతుండటం గమనార్హం. ప్రతి నెలా 70 శాతం జొన్నలు, రాగులు వ్యాపారులకు అమ్మేసుకుంటున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో జొన్నలు క్వింటాలు రూ.3,400 నుంచి 3,600 రాగులు రూ.4,500 వరకు 4,700 వరకు ధర పలుకుతున్నాయి.

**చీటీ ఇవ్వకుండా...**

కొత్త రేషన్‌కార్డులు వచ్చిన తర్వాత లబ్ధిదారులు వేలిముద్ర వేయగానే ఈ–పోస్ యంత్రంలో కుటుంబ సభ్యుల వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఏయే సరకులు.. ఎన్నెన్ని కిలోలు అన్నది అందులో నమోదు చేసిన తర్వాత డీలర్లు తూకం వేసి ఇవ్వాలి. అనంతరం ఈ–పోస్ యంత్రంలో సరకుల చీటీ బయటకు వస్తుంది. దుకాణం నంబరు, కార్డుదారుడి పేరు, తీసుకున్న సమయం తదితరల వివరాలన్నీ ఉంటాయి. కాగా కొందరు డీలర్లు చీటీనే ఇవ్వడం లేదు.

**సరకులు ఇవ్వాల్సిందే..– వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి** బియ్యం వద్దంటే ఉచితంగా జొన్నలు, రాగులు పంపిణీ చేయాలి. ప్రతి నెలా విధిగా అందజేయాల్సిందే. ప్రభుత్వం కేటాయించే సరకులు ఇవ్వాల్సిందే. సరకులు పక్కదారి పట్టిస్తున్న తీరుపై ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# చెంతనే ఉద్యోగాలు.. పట్టని నైపుణ్యాలు



వరదయ్యపాలెం : శ్రీ సిటీ ప్రముఖ పారిశ్రామిక, ఆర్థిక కేంద్రం. దేశంలో అతిపెద్ద పారిశ్రామిక నగరాల్లో ఒకటి.

**విభిన్నరంగాల పరిశ్రమలు**

ఈ ప్రాంతం స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్), ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సిటీ. జపాన్, చైనా, కొరియా, అమెరికా, జర్మనీ ఇలా 25కు పైగా దేశాల నుంచి 200లకు పైగా కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఆహార ప్రాసెసింగ్, ఫార్మా వంటి అనేక పరిశ్రమలు ఉన్నాయి.

**ఆర్థికాభివృద్ధి, ఉపాధి**

తిరుపతి జిల్లా, పరిసర ప్రాంతాల్లోని వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పిస్తుంది. రాష్ట్రానికి, జిల్లాకు గణనీయమైన పన్ను ఆదాయం, జీడీపీ వృద్ధిని అందిస్తోంది.

**వ్యూహాత్మక ప్రదేశం**

తమిళనాడు సరిహద్దు దగ్గరగా ఉంది. చెన్నై పోర్టు (55 కి.మీ), తిరుపతి ఎయిర్‌పోర్ట్ (70 కి.మీ), చెన్నై ఎయిర్‌పోర్ట్ (75 కి.మీ) లకు సులభ రవాణా సౌకర్యం. జాతీయ రహదారులు, సమీపంలో పోర్టులతో రవాణాకు అనుకూలం.

**విదేశీ పెట్టుబడులు**

ప్రపంచస్థాయి సదుపాయాలు, సెజ్ సౌకర్యాలతో ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌డీఐ) ను ఎక్కువగా ఆకర్షిస్తోంది. అనేక బహుళజాతి కంపెనీలు ఉత్పత్తి యూనిట్లు, పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను నెలకొల్పుతున్నాయి.

**అభివృద్ధి, వసతులు**

పారిశ్రామిక జోన్‌తో పాటు వసతి సదుపాయాలు ప్రాంతాలు, విద్యా సంస్థలు ఉన్నాయి. ప్రణాళికాయుత పారిశ్రామిక నగరంగా ఎదుగుతోంది.

సెజ్ ప్రాంతం: 7,500ఎకరాలు

20,000: ఏడాదిలో కొత్తగా రానున్న కొలువులు

కారణం: కొత్త పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి.

50 వేల నుంచి 60 వేలు: ప్రస్తుతమున్న ప్రత్యక్ష ఉద్యోగాలు

**పారిశ్రామిక విస్తరణ**

ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెరుగు తున్నాయి. ఇసుజు, పెప్సీకో, కెల్లోగ్గ్ వంటి అంతర్జాతీయ కంపెనీలు ఉత్పత్తి యూనిట్లను విస్తరిస్తున్నాయి.

**స్థానిక ఉపాధి సమస్య**

ఎక్కువ ఉద్యోగాలున్నా.. సాంకేతిక నైపుణ్య సిబ్బంది అవసరం ఉంది. స్థానిక యువతకు ఈ తరహా శిక్షణ కొరవడింది.

**ప్రభుత్వం ఏం చేయాలంటే..**స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల కొరతను తీర్చాలి. పరిశ్రమల భాగస్వామ్యంతో శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలి.

**శిక్షణ అవసరమైన రంగాలు**

ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, లాజిస్టిక్స్ పరిశ్రమల్లో గిడ్డంగులు, పరిశోధన, ఆఫీసులు, రవాణా, రిటైల్, ఆతిథ్యం, గృహాలు, సపోర్ట్ సేవలు.

# ప్రణాళిక దారి తప్పింది

నంద్యాల : ఒక రహదారి నిర్మించాలంటే పక్కా ప్రణాళికలు అవసరం. ఎక్కడ.. ఎంతమేర విస్తరించాలి.. ఎంత నిధులు అవసరం.. సర్వే విధానంపై దృష్టి పెట్టాలి. కానీ ఇవేమీ లేకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు గుడ్డిగా పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లా కేంద్రంలో బొమ్మలసత్రంలో ఇప్పటికే ఆర్వోబీ ఉంది. నూనెపల్లెలో మరో ఆర్వోబీ ఉంది. ప్రస్తుతం ఈ రెండింటి మధ్యన మూలసాగరం వద్ద మరో ఆర్వోబీ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఇదే మార్గంలో నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరవడం గమనార్హం. మూడు ఆర్వోబీలు పోగా ఈ మార్గంలో కేవలం 1.50 కి.మీల పొడవునా మాత్రమే నాలుగు వరుసల రహదారిని నిర్మించాల్సి ఉంది. కానీ రూ.13 కోట్లతో ప్రతిపాదనలు చేయడం గమనార్హం. ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అవసరం లేకున్నా..**

గత వైకాపా ప్రభుత్వంలో నాలుగు వరుసల రహదారిని నిర్మించేందుకు నిధులు మంజూరైనా ఆక్రమణలు తొలగించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఇటీవలే తిరిగి పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే మూలసాగరం ఆర్వోబీ మంజూరైంది. రహదారి, ఆర్వోబీ రెండూ.. బొగ్గులైన్, గాంధీనగర్ ప్రాంతాల్లో 300 మీటర్ల పొడవునా జరగనున్నాయి. వంతెన నిర్మాణ పనులు పైన జరిగే సమయంలో కింద నాలుగు వరుసల రహదారి అవసరం లేదు. కానీ ఈ పనులు పునఃప్రారంభించేలా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రయత్నిస్తుండటం గమనార్హం.

**ఒకే మార్గంలో ఆర్వోబీ, నాలుగు వరుసల బాట**

కర్నూలు–చిత్తూరు 40వ నంబరు ఎన్‌హెచ్ పరిధిలో నంద్యాలలోని బొమ్మలసత్రం–నూనెపల్లె రహదారిని నాలుగు వరుసలుగా మార్చేం



దుకు రూ.13 కోట్లు మంజూరయ్యాయి. ఎండీఆర్ కింద మంజూరైన ఈ పనులను గతంలోనే గుత్తేదారుడు ప్రారంభించి రూ.2.60 కోట్లు ఖర్చు చేశారు. బొగ్గులైన్ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించకపోవడంతో గత ప్రభుత్వ హయాంలోనే పనులు ఆగిపోయాయి.నంద్యాల రైల్వేస్టేషన్ సమీపంలోని మూలసాగరం రైల్వే గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతుండటంతో ఇక్కడ ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఆర్వోబీని 'టీ' ఆకారంలో నిర్మించాలని గతంలోనే ప్రతిపాదనలు రూపొందించారు. దీనికి రూ.40 కోట్లు ఖర్చు చేయనున్నారు. మూలసాగరం, గాంధీనగర్, బొగ్గులైన్ మీదుగా వంతెన నిర్మాణం సాగనుంది.

పై రెండు నిర్మాణాలు జరిగేవి నంద్యాల పట్టణంలోని బొగ్గులైన్ మీదుగానే.. బొమ్మలసత్రం నుంచి నూనెపల్లె వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం జరుగుతుంది. బొగ్గులైన్, గాంధీనగర్ ప్రాంతాల్లో పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాంతాల మీదుగానే ఉపరితల రైల్వే వంతెన ఏర్పాటుచేయనున్నారు. వంతెన నిర్మించనున్న ప్రాంతంలోనే నాలుగు వరుసల మార్గం నిర్మించేలా ప్రయత్నాలు జరుగుతుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా వంతెనను, నాలుగు వరుసల రహదారిని నిర్మించేది ఆర్‌అండ్‌బీ శాఖనే కావడం గమనార్హం.

# విత్తుకోని శనగ

కర్నూలు : అధిక వర్షాలు ఖరీఫ్‌ను ముంచాయి..రబీ సీజన్‌కు అధికారుల నిర్లక్ష్యం 'విత్తు'కోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన ఖరీఫ్ పంటలను దున్నేసి శనగ సాగుకు సిద్ధమవుతున్నారు. కర్నూలు జిల్లా పరిధిలో 70 వేలు, నంద్యాలలో 50 వేల హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం పప్పుశనగ విత్తన కేటాయింపులు చేసింది. కిలో రూ.78 కాగా.. రూ.19.50 రాయితీ పోనూ రైతులకు రూ.58.50కు విక్రయించాలని ఆదేశించింది. ఏపీ సీడ్స్ అధికారులు ఇప్పటివరకు కేవలం 10 శాతం మేర మాత్రమే శనగ విత్తనాల ప్రాసెసింగ్ చేయించారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేయించేందుకు మరో వారం, పది రోజులవుతుంది. శనగ విత్తనాల నాణ్యత అంతంత మాత్రంగానే ఉందని.. స్థానికంగా వ్యాపారుల నుంచి సేకరించారన్న విమర్శలున్నాయి.

**బయట మార్కెట్లోనే తక్కువ**

బహిరంగ మార్కెట్‌లో శనగలు క్వింటా రూ.5 వేల నుంచి రూ.5,500 పలుకుతోంది. ప్రభుత్వం టెండరు ద్వారా క్వింటా రూ.7,800కు కొనుగోలు చేస్తోంది. క్వింటాపై 25 శాతం రాయితీ రూ.1,950 పోనూ.. రైతు క్వింటాకు రూ.5,850ను నాన్ సబ్సిడీ కింద చెల్లించాల్సి ఉంది. ఏపీ సీడ్స్ ద్వారా ఒక రైతుకు ఒక ప్యాకెట్ (20 కిలోలు)



నుంచి గరిష్ఠంగా 5 ప్యాకెట్ల వరకు ఇవ్వనున్నారు. ప్రభుత్వం రాయితీపై ఇచ్చే ధరకు మార్కెట్‌లో శనగ విత్తనాలు అందుబాటులో దొరుకుతాయని అన్నదాతలు పేర్కొంటున్నారు.

**కేటాయింపులో కోత**

గత రబీ సీజన్‌లో కర్నూలుకు 29,967, నంద్యాలకు 18,865 క్వింటాళ్లు కలిపి ఉమ్మడి జిల్లాకు 48,832 క్వింటాళ్ల విత్తనాన్ని రాయితీపై పంపిణీ చేశారు. ఈ సీజన్‌లో కర్నూలుకు 46 వేలు, నంద్యాలకు 25 వేల క్వింటాళ్లు అవసరమని వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఉమ్మడి జిల్లాకు తాజాగా జేజీ–11 రకం శనగలు.. 36,461 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపులు మాత్రమే జరిగాయి.

**అవగాహన కల్పించడంలో విఫలం**

రైతు సేవా కేంద్రాల ద్వారా డి.క్రిషి యాప్‌లో రాయితీ విత్తనాల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి. 3వ తేదీ నుంచి విత్తనాల పంపిణీ ప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ చెబుతున్నా జిల్లాలో ఎక్కడా పంపిణీ ప్రారంభం కాలేదు. రాయితీ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలంటూ అవగాహన కల్పించడం లేదు.

# క్వారీల సీనరేజీ వసూలు ప్రైవేటుకు..!

ఒంగోలు: గ్రానైట్, ఇతర క్వారీల నుంచి సీనరేజీ వసూలు చేసే బాధ్యత ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఓ ప్రైవేటు సంస్థ చేపట్టనుంది. టెండరులో పోటీపడి దక్కించుకున్న ఏఎంఆర్ సంస్థ నెలకు రూ.47 కోట్లు చొప్పున రెండేళ్ల కాలానికిగానూ రూ.1,135 కోట్లు ప్రభుత్వానికి జమ చేయనుంది. దీనికి సంబంధించి గనులశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలో క్వారీలను ఈ నెల 25వ తేదీలోగా భూగర్భ గనులశాఖ అధికారులు అప్పజెప్పనున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో గ్రానైట్ క్వారీలతో పాటు కంకర, గ్రావెల్ చిన్నా చితక క్వారీలు మొత్తం 600 వరకు ఉన్నాయి. వీటిలో 90 శాతం గ్రానైట్ క్వారీలే ఉన్నాయి. భూగర్భ గనులశాఖ అధికారులు గ్రానైట్ క్వారీలో ముడిరాయి క్యూబిక్ మీటరుకు రూ.5 వేలు వరకు వసూలు చేస్తున్నారు. గతేడాది ప్రభుత్వానికి జిల్లా పరిధిలో సీనరేజీ రూపంలో రూ.450 కోట్ల వరకు వచ్చింది. వాస్తవానికి క్వారీ నుంచి రాళ్లు, గ్రావెల్ వంటివి బయటకు తరలించాలంటే నిబంధనల ప్రకారం సీనరేజీ చెల్లించాలి. క్వారీల నాయకుల చేతిలో ఉండడం, పలు ఒత్తిళ్లతో పన్ను వసూళ్లు కొంత వరకు తక్కువగానే ఉంటున్నాయి. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేటు గుత్తేదారు కొంత ప్రకారం ఎంత ముడిసరుకు బయటకు వెళ్లిందో లెక్కించి అందుకనుగుణంగా పన్నుల వసూలు చేపడతారు. గనులశాఖ స్థానంలో ప్రైవేటు సిబ్బంది ఈ బాధ్యతలను చేపడతారు.



ఈ నెల కొంతే పన్నులు వసూలయ్యాయని తప్పించుకోకుండా నెలకు ఠంచనుగా రూ.47 కోట్లు గుత్తేదారు సంస్థ చెల్లించాల్సిందే. సీనరేజీ అంచనా వేసిన మేరకు విభాగాల వారీగా ఆయా ప్రభుత్వ ఖాతాలకు నెల వారీ సొమ్ము జమ చేయాల్సి ఉంటుంది. గ్రానైట్, కంకర తదితరాలే మాదిరే గ్రామాల్లో మట్టి, గ్రావెల్ వంటివి తరలించినా పన్ను రాబట్టేందుకు ప్రయత్నిస్తారు. సొంత పొలాల్లో తవ్వి తరలించినా, ఇంట్లో అవసరాలకు తీసుకెళుతున్నా ముక్కు పిండి మరీ పన్ను వసూలు చేస్తారు.

**నెలవారీ గుత్తేదారు చెల్లింపుల వివరాలు (రూ.కోట్లలో)**

సీనరేజీ రూపేణ: 38.94

జిల్లా ఖనిజనిధి: 6.6

ఖనిజాన్వేషణ నిధి: 0.80

ఇతరేతర ఖర్చులు: 0.92

# పారని పథకం... జారని ఉదకం!

టంగుటూరు: జిల్లాలోని అధిక శాతం పంటలు వర్షాధారం పైనే సాగవుతున్నాయి. ఇక్కడ కరవును పారదోలడంతోపాటు తాగు, సాగునీరందిచాలనే లక్ష్యంతో గత తెదేపా ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపడితే గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పథకాల నిర్వహణపై దృష్టిసారించి వినియోగంలోకి తీసుకురావాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గత తెదేపా ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 160 చిన్న, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలు నిర్మించింది. సుమారు 60 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేవిధంగా దర్శి, కనిగిరి, కొండపి, మార్కాపురం, ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలో ప్రవహించే గుండ్లకమ్మ, ముసి, పాలేరు, ఇనగలేరు, ముట్టేరు నదులు, వాగులపై పథకాలు నిర్మించారు. పథకాలు మరమ్మతులకు గురవ్వడం, ఎగువ నుంచి నీరు రాకపోవడం, మోటార్లు కాలిపోవడం, విద్యుత్తు పరివర్తకాలను దొంగలు ధ్వంసం చేయడం తదితర కారణాలతో వినియోగంలో లేకుండాపోయాయి. వీటికి మరమ్మతులు చేసేందుకు



2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అనంతరం అధకారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం 25 శాతం పనులు జరగని ప్రాజెక్టులను నిలిపివేయాలని జీవో విడుదల చేయడంతో పథకాలు మూలకు చేరాయి. సుమారు 2 లక్షల మంది రైతులకు ఉపయోగపడే పథకాలను వినియోగంలోకి తీసుకురావాలని రైతాంగం కోరుతోంది. ఈ విషయమై జిల్లా నీటిపారుదలశాఖ ఈఈ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మరమ్మతులకు గురైన చిన్న పథకాలను బాగుచేసేందుకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపించామన్నారు. నిధులొచ్చిన వెంటనే పనులు చేపడతామన్నారు.

## విలువల విద్య.. భావితరానికి చేయూత

నెల్లూరు :నెల్లూరులో ఉన్నత స్థితిలో ఉన్న దంపతులకు ఇద్దరు సంతానం. వారిద్దరిని బాగా చదివించారు. కుమార్తె విదేశాల్లో ఉంది. కుమారుడు పక్క రాష్ట్రంలో ఉన్నాడు. ఆస్తి కుమార్తెకు ఎక్కువ ఇచ్చారని కొడుకు, కోడలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రి మృతిచెందినా రాలేదు. గ్రామాల్లో తల్లిదండ్రులకు పింఛన్ నగదు వస్తుండటంతో వారికి అండగా ఉంటున్నారు. దీనికి ముఖ్య కారణం సమాజంలో విలువలు దిగజారడమేనని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలలు 428 వరకు ఉన్నాయి. వీటిలో 6 నుంచి పదో తరగతి వరకు సుమారు 80 వేల మంది విద్యార్థులున్నారు. వారికి విలువల విద్యతో కూడిన పుస్తకాలందిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎన్ని మార్కులొచ్చాయి. ఎంత ర్యాంకు వచ్చిందని మాత్రమే ఎక్కువ మంది తల్లిదండ్రులు చూస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో ఎలాగైనా సంపాదించాలి.. ఏం చేసైనా.. అనే ధోరణులు పెరిగాయి. ఇలాగే ఎదిగితే లాభనష్టాలు తప్ప తల్లిదండ్రులపై ప్రేమ, మమకారాలు మరిచిపోతున్నారు. ఇది గమనించిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు విలువల విద్యనందించాలని ప్రత్యేకంగా పుస్తకాలు రూపొందించి పంపిణీ చేస్తోంది. విలువల విద్య పుస్తకాలను రాష్ట్ర శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్టీ) చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రూపొందించారు.పుస్తకాల్లో ప్రసిద్ధుల గురించి అంశాలు, నైతిక విలువలు, రాజ్యాంగం, లింగ సమానత్వం, బాల్య వివాహం వంటి సామాజిక అంశాలున్నాయి.

# వైద్య సేవలెన్నో.. కేజీహెచ్‌లో!




విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయిని కింగ్‌జార్జ్ ఆసుపత్రిలో (కేజీహెచ్) ఓపీ(అవుట్ పేషెంట్) విభాగం సేవలు అత్యంత కీలకం. అత్యవసర కేసులు మినహాయిస్తే మిగిలిన రోగులంతా ఓపీ విభాగాలకు వచ్చి వైద్యులను సంప్రదించాలి. వారి ఆరోగ్య స్థితిని అంచనా వేసి, అవసరమైతే ఇన్‌పేషెంట్లు(ఐపీ)గా చేర్చుకుని వైద్యం అందిస్తారు. నిత్యం దాదాపు రెండు వేల మంది ఇక్కడికొస్తుంటారు.

**24 గంటలు ఇలా..** అత్యవసర విభాగం(క్యాజువాల్టీ)లో ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్లు, క్లినిక్ లేబొరేటరీ, బ్లడ్ బ్యాంకు, కార్డియాలజీ వార్డు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. మిగిలిన విభాగాలు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తాయి.

ఓపీ ఎక్స్‌రే విభాగం మాత్రం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే సేవలు అందిస్తుంది.

సాధారణ ఓపీలకు ఆదివారం సెలవుగా పరిగణిస్తారు. అయితే ఇన్ పేషెంట్లకు కేస్ షీట్లు 24 గంటలూ జారీ చేస్తారు.

**విభాగాలు.. గదులు**

సోమవారం నుంచి శనివారం వరకు అందుబాటులో ఉండే అన్ని రకాల ఓపీలకు ఇటీవల ప్రత్యేకంగా గదులు కేటాయించారు. ఆ వివరాలు..

విభాగం పేరు(గది నంబరు): ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్(1), క్యాజువాల్టీ(2), ఫార్మసీ(3), క్యాజువాల్టీ ఫార్మసీ(3ఏ), డెంటల్(4), ఫార్మసీ స్టోర్(5), అత్యవసర ఓపీ(6), ఇన్‌జెక్షన్ రూమ్(7), న్యూరో, కార్డియాలజీ, సీటీ సర్జరీ (8), జనరల్ సర్జరీ(9), ఆర్థోపెడిక్స్ (10), ఫిజియోథెరపి (11), ఆయుర్వేదం(11ఏ), యూరాలజీ(12), ఎక్స్‌రే(13), పీడియాట్రిక్ సర్జరీ(14), జనరల్ మెడిసిన్(15), గర్భిణుల ఓపీ(16), గైనకాలజీ(17), కుటుంబ నియంత్రణ(18), పీడియాట్రిక్స్ (19), క్షయ నియంత్రణ(టీబీ)(20), వెల్‌నెస్ సెంటర్(21), ఎస్‌టీడీ(22), టీఆర్ ఐసీయూ(23), గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ(24), డెర్మటాలజీ(25), క్లినికల్ లేబొరేటరీ(26), బ్లడ్ బ్యాంకు(27), కార్డియాలజీ వార్డు(28), రేడియాలజీ (స్కాన్)(29), ఆప్తమాలజీ(30), ఎండోక్రైనాలజీ (31), ఏఆర్‌టీ సెంటర్(32), డీఈఐ సీఓపీ(33), సైకియాట్రిక్ ఓపీ(34), సీటీఎంఆర్ఐ(35), మెడికల్ ఆంకాలజీ(36), రేడియో థెరపి(37), సర్జికల్ ఆంకాలజీ (38), వాస్కులర్ సర్జరీ(39), న్యూక్లియర్ మెడిసిన్(40), ప్లాస్టిక్ సర్జరీ(42), ప్రివెంటివ్ సర్జరీ(222).

# ఉచితానికి తూట్లు!



చిత్తూరు : వైకాపా హయాంలో ఐదేళ్లపాటు ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగింది. స్వర్ణముఖి, అరణియార్, నీవా తదితర నదుల్లో రోడ్లు వేసి మరీ టిప్పర్లలో ప్రకృతి సంపదను తరలించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణదారులకు మేలు చేసేందుకు ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చి వినియోగదారులపై గణనీయంగా భారం తగ్గించింది. అయినప్పటికీ కొందరు అక్రమార్కులు పాత పంథా వీడలేదు. తామే ఇసుకను సరఫరా చేస్తామని చెప్పి ఇతరులను నదీ పరీవాహక ప్రాంతంలోకి రానివ్వకుండా తమ దందా సాగిస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం దృష్టి సారిస్తే దోపిడీకి చరమగీతం పాడవచ్చు.

**గూడలి నుంచి తమిళనాడుకు**

తిరుపతి జిల్లా కోట మండలం గూడలిలోని స్వర్ణముఖి నది ఇసుకను తమిళనాడుకు తరలిస్తున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో చక్రం తిప్పే నాయకుడు ఈ దందా వెనుక ఉన్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల చిత్తూరు మండలం పాలంతోపు వద్ద పైన పొట్టు.. కింద ఇసుకతో వెళుతోన్న లారీ పట్టుబడినా సూత్రధారిపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు జంకారు. లారీ ఇసుకను రూ.1.50 - రూ.2 లక్షలకు విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. రోజూ 15- 20 లారీలు తమిళనాడుకు తరలుతున్నాయి.

**శ్రీకాళహస్తిలో మారని తీరు**

జిల్లాలో ఎక్కడా లేనంతగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. రేణిగుంట, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో స్వర్ణముఖి నదిని గుల్ల చేస్తున్నారు. పలువురు ప్రైవేటు భూముల్లోనూ తవ్వకాలు చేస్తున్నారు. గనులు, రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోవడానికి జంకుతున్నారు. సమీపంలో ఉన్న తిరుపతి నగరంతోపాటు తమిళనాడుకూ తరలిస్తున్నారు. రోజూ వందలాది ట్రిప్పుల ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రిళ్లు కూడా పంపిస్తున్నారు. ప్రజాప్రతినిధులకూ ఇందులో హస్తం ఉండటంతో యంత్రాంగం పట్టనట్టుగా వ్యవహరిస్తోంది.

నాగలాపురం మండలంలో అరణియార్ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. ప్రధానంగా రాత్రిళ్లు వాహనాలు సరిహద్దులు దాటుతున్నాయి. పక్కనే తమిళనాడు రాష్ట్రం ఉండటంతో అక్కడకు ప్రకృతి సంపదను పంపిస్తున్నారు. అడపాదడపా మాత్రమే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# అడగకున్నా.. అక్కరకు వచ్చేలా..!

చిత్తూరు : మీరు ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం కోసం చేసిన దరఖాస్తు అందింది. 25 రోజుల్లో ప్రాసెస్ పూర్తవుతుంది. ఇలా ఏపీ గవర్నమెంట్ పేరుతో సంక్షిప్త సందేశం చరవాణులకు కొన్ని రోజులుగా వస్తోంది. దరఖాస్తు చేయకుండానే ధ్రువీకరణ పత్రం జారీ చేయడం ఏంటనే అనుమానం పలువురిలో కలుగుతోంది.


విద్య, ఉపకార వేతనాలు, ఉద్యోగం, అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధికి ప్రామాణికమైన కుల ధ్రువీకరణ పత్రాన్ని ప్రజల ఇంటికే నేరుగా అందించాలని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే చరవాణులకు సందేశాలు వస్తున్నాయి. ఇప్పటివరకు కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే సచివాలయం, రెవెన్యూ కార్యాలయాలకు పలుమార్లు వెళ్లాల్సి వచ్చేది. ఈ అవసరం లేకుండా అక్టోబరు 2న ఇంటికే ఆ పత్రాన్ని అందించేందుకు రెవెన్యూ శాఖ ఈ కసరత్తు చేస్తోంది.

**ఇలా ఎందుకంటే..**

గతంలో వీఆర్వోలు చేపట్టిన కుటుంబాల సర్వేలోని వివరాల ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలన చేపడుతున్నారు. ఈ సర్వే ఇంకా కొనసాగుతోంది.

**15లోపు పూర్తి చేయాలి..**

ధ్రువపత్రాల జారీలో భాగంగా వీఆర్వో లాగిన్ నుంచి ఆర్ఐకి అక్కడి నుంచి తహసీల్దార్ వద్దకు వెళ్లి వెబ్‌ల్యాండ్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. కొన్ని ఆర్డీవో, జేసీల పరిశీలనకు వెళ్తున్నాయి. అర్హుల జాబితాను రెవెన్యూ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. అవసరమైనప్పుడు సులువుగా పత్రాలు తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.



ఈనెల 15లోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

**చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ధ్రువపత్రాల వివరాలు..**

పరిశీలనలో : 4,49,746

పరిశీలించినవి : 3,32,670

పెండింగ్ : వీఆర్వోల వద్ద 2,90,500

తహసీల్దార్ల వద్ద: 42,752

ఇప్పటివరకు ఆమోదించినవి : 94,136

# ఉపాధికి ఊరట!

ఒంగోలు : ఉపాధి హామీ పథకం కూలీలకు నెలల తరబడి పేరుకుపోయిన వేతన బకాయిలను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. దీంతో జిల్లాలోని సుమారు రూ.1.50 లక్షల మంది కూలీల ఖాతాల్లోకి మరో వారం రోజుల్లోగా నగదు జమ కానుంది. జిల్లాలోని 38 మండలాల పరిధిలో పనికి వచ్చే కూలీలు రూ.6.80 లక్షల మంది వరకు ఉన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌తోపాటు త్వరలోనే రబీ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధిహామీ పథకం కూలీలు వ్యవసాయ పనులపై ఆధారపడుతున్నారు. దీంతో ప్రస్తుతం రోజుకు సరాసరిన 2 వేల మందికి మించి కూలీలు పనులకు రావడం లేదు. మార్గ దర్శకాల మేరకు వారం రోజులకొకసారి కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మే 29వ తేదీ నుంచి కూలీలకు వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. ఉపాధిహామీ పథకం పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని మండలాల వారీగా లక్ష్యాలు పెట్టినా క్షేత్రస్థాయిలో బకాయిలపై డ్వామా సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు.



**మూడు నెలలకుపైగా బకాయిలు**

కూలీల వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. కేంద్రం నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో మూడు నెలలకుపైగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. జిల్లాలో సుమారు 1.50 లక్షల మందికి రూ.119.73 కోట్ల మేర వేతన బకాయిలున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్య పనుల కింద గ్రామాల్లో పంట కుంటలు, పశువుల నీటి తొట్టె నిర్మాణ పనులతోపాటు, చెరువుల అభివృద్ధి, ఫీడర్ ఛానల్, పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. తాజాగా వేతన బకాయిలు విడుదల కావడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఉపాధిహామీ పథకం కింద జారీ చేసిన కార్డులు : 4.42 లక్షలు**

పనికి వస్తున్న కుటుంబాలు: 3.81 లక్షలు

కూలీలు: 6.80 లక్షలు

2025-26 సంవత్సరానికి ఇప్పటివరకు ఖర్చు చేసింది: రూ.252.45 కోట్లు

ఈ ఏడాది మే 29 వరకు విడుదలైన మొత్తం : రూ.132.72 కోట్లు

పెండింగ్‌లో ఉన్న బకాయిలు : రూ.119.73 కోట్లు

# మనకూ కావాలోయ్.. మియావాకీ!

నెల్లూరు: నెల్లూరు నగరంలో గాలి నాణ్యత క్షీణిస్తోంది. పారిశ్రామికీకరణ.. పచ్చదనం తగ్గిపోవడం.. భవన నిర్మాణాలు.. వాహనాల రద్దీతో దుమ్ము, ధూళి కణాలు విపరీతంగా పెరిగాయి. హెల్మెట్, కళ్లజోడు లేకుండా ద్విచక్ర వాహనాలపై బయటకు రావాలంటే భయపడే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో జపాన్ వృక్ష శాస్త్రవేత్త అకీరా మియావాకీ అనుసరించిన అధిక సాంద్రతలో మొక్కలు నాటే విధానాన్ని ఇప్పటికే జిల్లాలో ప్రారంభించగా- మంచి ఫలితాలు ఇస్తుండటంతో తాజాగా అటవీశాఖ, డ్వారా అధికారుల ఆధ్వర్యంలో చిట్టడవుల సృష్టికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

**12 చోట్ల ప్రతిపాదనలు**

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం చుట్టూ గతంలో మూడు ఎకరాల్లో 70వేల మొక్కలు నాటగా.. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. ఏడాది కిందట కోవూరు డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని కొంత స్థలంలో మియావాకీ విధానంలో మొక్కలు నాటారు. ప్రస్తుతం డ్వామా ఆధ్వర్యంలో ఆరు ప్రాంతాల్లో 25 సెంట్ల చొప్పున ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ కలప, ఫలసాయం ఇచ్చే మొక్కలను ఒకే ప్రదేశంలో 2,500 నుంచి మూడు వేల వరకు నాటాలని నిర్ణయించారు. ఒక యూనిట్‌లో నరేగా పద్దులో.. రెండేళ్ల నిర్వహణకు రూ. 9.87 లక్షలు ఖర్చు చేయనున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలోనూ జిల్లాలోని ఆరు నగరవనాల్లో.. ఈ పద్ధతిలో మొక్కల పెంపకానికి సన్నాహాలు చేస్తున్నారు.

కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ప్రకటించిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్' ర్యాంకులు-2025ల్లో నెల్లూరు నగరానికి 18వ స్థానం వచ్చింది. 3 నుంచి 10 లక్షల్లోపు జనాభా విభాగంలో ఈ స్థానం లభించింది.

నగర, పట్టణ ప్రాంతాల్లో లేఅవుట్ నిబంధనల మేరకు, ఇతర ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఎంపిక చేసి మియావాకీ విధానంలో కృత్రిమ అడవుల ఏర్పాటుకు ముందుకు రావాలి. ప్రభుత్వ బాధ్యతతో పాటు పౌర సమాజం చొరవ చూపాలి. స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, విద్యా సంస్థలు దత్తత రూపంలో ఖాళీ స్థలాల్లో ఈ అడవుల సృష్టి బాధ్యత తీసుకోవాలి

# ఏక చెల్లింపుతో టిడ్కో ప్లాట్..

కావలి : టిడ్కో సముదాయాల్లోని మిగులు ప్లాట్లను.. ఏక చెల్లింపు విధానంతో కొత్తవారికి ఇవ్వనున్నారు. 365 చదరపు అడుగుల నిర్మాణాన్ని రూ.3.65 లక్షలు, 430 అడుగులైతే రూ.4.15 లక్షలకు విక్రయించనున్నారు. బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ కమిషనర్లకు దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గత తెదేపా హయాంలో 66 బ్లాకులుగా.. ఇక్కడి టిడ్కో సముదాయాన్ని నిర్మించి.. ఒక్కో బ్లాక్‌లో 32 కుటుంబాలు నివాసం ఉండేలా వెసులుబాటు కల్పించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటి రంగులు మార్చిందే తప్ప.. లబ్ధిదారులకు ఇవ్వలేదు. చాలా మందికి వాటి స్వాధీనంలో సందిగ్ధత నెలకొంది. రుణాలు తీసుకోవడంలోనూ ఇబ్బందులు పడ్డారు. నిర్మించిన ప్లాట్లలో 300 చదరపు అడుగులవి 704, 365 చ.అ 864, 430వి 544 వరకు ఉన్నా.. వాటిలో చేరిన వారి సంఖ్య 800 కుటుంబాల్లోపే. ప్రస్తుతం 300 చదరపు అడుగులవి ఉచితం కావడంతో.. లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. నెల్లూరు నగరంతో పాటు మున్సిపాలిటీల్లో సుమారు 70 శాతం ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఇప్పుడు ఆ రెండు కేటగిరీల్లో ఏక చెల్లింపుతో ఎవరైనా కొత్తగా చేరేందుకు ఉన్నాయి.

## ఎంపీ సోదరుడి భూమి కబ్జాకు యత్నం

పీఎంపాలెం : విశాఖ బీచ్‌రోడ్డు రుషికొండ ప్రాంతాల్లో భూ కబ్జాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే తరహాలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సోదరుడు భరద్వాజ్ భూమిని కొందరు ఆక్రమించేందుకు కుట్ర పన్నారు. చిన రుషికొండ సిల్వర్ ఓక్స్ పాఠశాల ఎదురుగా కృష్ణ కోఆపరేటివ్ లేఅవుట్లో భరద్వాజ్‌కు చెందిన టెక్నో ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 1600 గజాల జిరాయితీ స్థలం ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో దీని ధర రూ.12కోట్లు ఉంటుంది. 2016లో సంస్థ పేరుతో ఆత్మకూరి సత్యనారాయణ, గోపాల కృష్ణమాచార్యుల నుంచి కొనుగోలు చేశారు.



అప్పటి నుంచి ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. మంగళవారం ఉదయం ఆ భూమిలోకి కొందరు ప్రవేశించి సుమారు 500 గజాల స్థలం తమదంటూ రేకుల షెడ్డు, ప్రహరీ నిర్మాణం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న సంస్థ ఉద్యోగులు ఆక్రమణను అడ్డుకున్నారు. ప్రహరీ నిర్మాణ పనుల్లో ఉన్న కూలీలను ప్రశ్నించగా తమకు ఏమీ తెలియదని పాల వరప్రసాద్ అనే వ్యక్తి పంపించినట్లు చెప్పారు. ఎంపీ సోదరుడు భరద్వాజ్ పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వరప్రసాద్‌ను విచారించగా ముద్దాడ పవన్‌కుమార్ తనకు నిర్మాణ ఒప్పందం ఇచ్చినట్లు తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ ఒప్పంద పత్రం సృష్టించి ఈ కబ్జాకు యత్నించానని, దీనికి పూర్తి బాధ్యుడిని తానేనని పవన్‌కుమార్ అంగీకరించాడు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.

## కొండలో దాగిన.. రూ.100 కోట్ల భూదందా

కర్నూలు: ప్రభుత్వ భూమి కొండ ప్రాంతం.. ఏళ్లుగా పేదలు సాగు చేసుకొంటున్నారు.. దానిపై పెద్దల కన్నుపడింది.. కష్టజీవులను తరిమేశారు.. కొండను తవ్వేశారు.. భూదందాకు తెరలేపారు. కల్లూరు మండలం దూపాడులో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. భూ కుంభకోణంలో ఓ కానిస్టేబుల్ పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు, స్థానిక నేతలు, రెవెన్యూ అధికారులను అనుకూలంగా మార్చుకొని దందా కొనసాగించారు. భూ ఆక్రమణ నిజమేనని తేలినా అధికారులు చర్యలకు వెనకడుగు వేస్తున్నారు.

**మన్నూ తిన్నారు**

దూపాడు గ్రామంలో 44వ జాతీయ రహదారికి సమీపంలో సర్వే నంబరు-139లో 84.02 ఎకరాలు భూమి ఉంది. దీనికి ఆనుకొని ఉన్న కొండను 50 అడుగుల ఎత్తు వరకు తవ్వేశారు. వచ్చిన మట్టిని యథేచ్ఛగా విక్రయించి సొమ్ము చేసుకొన్నారు. కొండ చదును చేసి కొంత భాగంలో తోటలు వేశారు. మరికొంత భాగంలో లేఅవుట్ వేసి వంద మందికి విక్రయించారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేలా లే అవుట్ కొంత భాగం పట్టా భూమిలో వేశారు. ప్రభుత్వ భూమిని అందులో కలిపేశారు. ఆ లేఅవుట్ దగ్గరకు వెళ్లడానికి



రహదారులు, విద్యుత్తు లైన్లు, ప్రహరీలు నిర్మించుకున్నారు. ఆయా భూముల్లోని కొంత భాగానికి ఆన్‌లైన్లో కొందరి పేర్లు కనిపిస్తున్నాయి.

**నిషేధిత భూముల జాబితాలో ఉన్నా**

సర్వే నంబరు- 139ను నిషేధిత భూముల జాబితాలో ఉంచారు. రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం లేదు. దీంతో అక్రమార్కులు తెలివిగా ఆ భూమిని 139-1బి, 139-1సిలుగా విభజించి ఏడుగురికి కేటాయించారు. ఈ ప్రక్రియా నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. కొందరికి అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదించి భూకేటాయింపులు చేసినట్లుగా దస్త్రాలు సృష్టించారు. ఇందుకు రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు సహకరించారు.

**బోర్డు పెట్టి**

అధికారులు విచారణ చేసి ఆక్రమణలు జరిగినట్లు గుర్తించారు.. అవి ప్రభుత్వ భూములని బోర్డు పెట్టారు. కబ్జాలు జరిగిన తీరు, సూత్రధారులు ఎవరన్న అంశాలతో సమగ్ర నివేదిక ఇచ్చినా.. ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దూపాడుకు చెందిన పలువురు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని ఆశ్రయించి గోడు వెళ్లబోసుకున్నారు. ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న భూములను ఆక్రమించేసుకున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీ కూడా విచారణ చేయాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**ఆక్రమణలు వాస్తవమే- ఆంజనేయులు, తహసీల్దార్, కల్లూరు**

దూపాడులో సర్వే నంబరు-139లోని భూములు కబ్జా అయిన విషయం వాస్తవమే. ఆయా భూముల్లో బోర్డులు ఏర్పాటుచేశాం. విక్రయాలు జరపకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు సమాచారం ఇచ్చాం. ఆయా భూములను నిషేధిత భూముల జాబితాలో ఉంచాం.

## ఇక స్మార్ట్ ఈ-పోస్!

మార్టేరు : లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతున్న తరుణంలోనే రేషన్ డీలర్లకు అధునాతన ఈ- పోస్ యంత్రాల (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బియ్యంతో పాటు నిత్యావసర సరకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టాలనే సంకల్పంతో కొత్త యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా స్మార్ట్ రేషన్ కార్డుల స్వైపింగ్‌తో పాటు వేలిముద్రల నమోదు ప్రక్రియ సులభతరం కానుంది. దీంతో కార్డుదారులు దుకాణాల వద్ద పడిగాపులు పడే పరిస్థితి దూరం కానుంది. వేలిముద్రల సమస్యకు సైతం పరిష్కారం చూపేలా ఐరిస్ ద్వారా కూడా సరకులు ఇచ్చేలా కొత్త యంత్రాల్లో ఏర్పాట్లు చేశారు. కార్డులో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలతో పాటు ఇవ్వాల్సిన సరకుల సమాచారం కనిపిస్తుంది. తీసుకునే సరకుల వివరాలతో రసీదు సైతం జారీ కానుంది. దీంతో సాంకేతిక సమస్యలతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. జిల్లాలో 1,052 దుకాణాలకు ఈ యంత్రాలు వచ్చాయని ఏఎస్‌వో రవిశంకర్ తెలిపారు. త్వరలో వారికి అందజేసి వినియోగంపై తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

## క్షణక్షణం.. బిక్కుబిక్కు!!



విశాఖపట్నం : స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపేందుకు వెళ్లిన విశాఖ వాసులు నేపాల్‌లో చిక్కుకున్నారు. ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న రాధాకృష్ణమూర్తి, జి.సూర్యప్రభ, కేవీఎస్ శ్రీదేవి, కె.సత్యనారాయణ, జీవీవీ పద్మావతి కుటుంబాలు ఈనెల 5న బయలుదేరి నేపాల్ వెళ్లాయి. వారంతా ఒక హోటల్‌లో దిగిన తర్వాత 6న బయలుదేరి ముక్తినాథ్, తదితర ఆలయాలను సందర్శించారు. తిరిగి వచ్చేసరికి వారు బస చేసిన హోటల్‌కు ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. వారి దుస్తులు, కొంత డబ్బు, బంగారం కాలిపోయాయి. ప్రస్తుతం మరో హోటల్‌లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. నేపాల్‌లో భారత రాయబార కార్యాలయం అధికారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. విశాఖ కలెక్టరేట్ అధికారులు బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

**మరో హోటల్‌లో తలదాచుకున్నాం:** 'మేం తొలుత బస చేసిన హోటలు ఓ రాజకీయ నాయకుడిదని తెలిసింది. హోటల్‌కు నిప్పు పెట్టడంతో మా సామగ్రి కాలిపోయింది. ప్రస్తుతం కాఠ్‌మాండూలోనే మరో హోటల్‌లో తలదాచుకున్నాం. అక్కడి వారే భోజనాలు పెడుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వస్తోంది. వాస్తవానికి 14న బయలదేరి విశాఖకు రావాల్సి ఉంది. అంతకు ముందే ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి తరలిస్తారని చెబుతున్నారు' అని ఎల్ఐసీ ఉద్యోగి ఎ.రాధాకృష్ణమూర్తి ఫోన్‌లో తెలిపారు.

**దక్షిణాసియా దేశాల సదస్సుకు హాజరై**

మహిళలు, యువత నాయకత్వం, నిర్ణయాత్మక స్థానాల్లో భాగస్వామ్యం, ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు కాఠ్‌మాండూలో బుధ, గురువారాల్లో దక్షిణాసియా దేశాల సెమినార్ ఏర్పాటుచేశారు. ఆరు దేశాల నుంచి 35 మహిళలను ఎంపిక చేయగా.. భారత్ నుంచి ఇద్దరున్నారు. వారిలో విశాఖకు చెందిన వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి గణపతి ఒకరు సోమవారం నేపాల్ వెళ్లిన ఆమె కాఠ్‌మాండూలోని ఓ హోటల్‌లో చిక్కుకున్నారు. ఈ విషయం తెలిసి ఆమెను సంప్రదించగా.. అక్కడి పరిస్థితిని వివరించారు. 'గురువారం ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ అమలులో ఉంటుందని, శుక్రవారం ఉదయానికి విమానాశ్రయాలు తెరుస్తారని చెబుతున్నారు. మంటలు ఇంకా అదుపులోకి రాలేదు. మా హోటల్ గది నుంచి చూస్తుంటే మంటల్లో కాలిపోతున్న ప్రధాని నివాసం కనిపిస్తోంది. హోటల్ నుంచి బయటకు అడుగు పెట్టడానికి అవకాశం లేదు. ఒక పూట భోజనానికి ఒక్కరికి రూ.3 వేలకు పైగా ఖర్చవుతోంది. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పీఏ ద్వారా వివరాలు తెలుసుకుంటున్నారు. ఇందుకు వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ కీర్తి బొల్లినేని, విశాఖకు చెందిన తెదేపా నాయకుడు చలపతిరావు సహకారం అందించారు' అని పేర్కొన్నారు.

## గత వైభవం.. మళ్లీ తెరిస్తే ఉపయోగం



చిలమత్తూరు : చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు బెంగళూరుకు 90 కిలోమీటర్లు, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన మన రాష్ట్రంలో ప్రారంభమయ్యే మొదటి ప్రధానమైన గ్రామం. రాష్ట్రంలో పలు ప్రాంతాలకు వెళ్లడానికి జంక్షన్ పాయింటు ఇదే. దీని మీదుగా రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో వ్యాపార కేంద్రంగా మారింది.

**20 ఏళ్ల క్రితమే రిసార్ట్ ..**

సమీప ప్రాంతాల్లో సరైన విడిది కేంద్రాలు లేకపోవడంతో పర్యాటకులు, ప్రయాణికుల కోసం 20 ఏళ్ల క్రితమే పర్యాటక శాఖ ఇక్కడ హరితా రిసార్ట్ పేరుతో 5 ఎకరాల స్థలంలో విడిది కేంద్రాన్ని నిర్మించింది. ఉండటానికి గదులు, మంచి ఆహారం, వాహనాలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలం, చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఉద్యానవనం, రెస్టారూంలు ఇలా అనేక సదుపాయాలు కల్పించారు. పర్యాటకులు, ప్రయాణికులు తమ అవసరాల రీత్యా ఇక్కడ ఆగేవారు. బెంగళూరు-హైదరాబాద్ మధ్య నడిచే ప్రయివేటు, ఆర్టీసీ బస్సులు ఇక్కడ భోజనం చేయడానికి ఆపేవారు. ఇలా రోజు వందలాది వాహనాలు ఇక్కడ నిలిచేవి. లేపాక్షికి వెళ్లే యాత్రికులు ఇక్కడే బస చేసి, ఇక్కడ నుంచి సిద్ధమై వెళ్లేవారు. వీటి కారణంగా హరితా రిసార్ట్‌కు పెద్ద ఎత్తున వ్యాపారం సాగేది. హోటల్ నడపడానికి, ఇతర పనుల నిమిత్తం పర్యాటక శాఖ 30 మంది సిబ్బందిని పొరుగు సేవల విధానంలో తీసుకొని నియమించింది. కొన్నేళ్ల పాటు వైభవంగా నడిచింది.

**శిథిలావస్థకు చేరి..**

ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మూతపడింది. గత వైకాపా ప్రభుత్వంలో పర్యాటక శాఖను పూర్తిగా పక్కన పెట్టడంతో ఈ రిసార్ట్ శిథిలావస్థకు చేరింది. కోట్ల రూపాయలు విలువ చేసే స్థలంలో ఉన్న పాత రిసార్ట్‌ను నూతనంగా పునరుదర్ధరించే పనులతో పాటు నిర్వహణను పీపీపీ విధానంలోనైనా ప్రభుత్వం అప్పగిస్తే అటు పర్యాటకులకు, ఇటు ప్రయాణికులకు సదుపాయాలతోపాటు ఉపాధి దొరుకుతుందని స్థానికులు కోరుతున్నారు.

## ఊరించి.. ఉసూరుమనిపించి!



కళ్యాణదుర్గం : ఖరీఫ్‌లో టమాటా సాగు చేసిన రైతుల దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఆనందం వ్యక్తం చేశారు. తొలుత టమాట ధరలు ఎక్కువగా ఉన్నా.. క్రమంగా తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 38 వేల ఎకరాల్లో టమాటా సాగవగా.. కళ్యాణదుర్గం డివిజన్‌లో 9,500 ఎకరాలు, రాయదుర్గం డివిజన్ పరిధిలో సూక్ష్మనీటి సేద్యం ద్వారా 4,200 ఎకరాల్లో పంట వేశారు.

**వర్షాలు తెచ్చిన తంటా..**జులైలో టమాటా ధర 30 కిలోల బాక్సు రూ.950 నుంచి రూ.1000 వరకు ఉండగా.. ఆగస్టులో రూ.500 నుంచి రూ.700లకు, ఈనెల మొదటి వారంలో రూ.200కు పతనమైంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎగుమతులు నిలిచిపోవడంతో ధరలు పడిపోయినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో జిల్లా నుంచి తెలంగాణలోని మెదక్, ఖమ్మం, కరీంనగర్.. కర్ణాటకలోని కోలార్, చింతామణి, తమిళనాడులోని హొసూరు, చెన్నైతోపాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని రైతులు పేర్కొంటున్నారు. .రాయదుర్గం మండలం కదరంపల్లికి చెందిన సోమశేఖర్ 8 ఎకరాలు, బొమ్మక్కపల్లికి చెందిన అశోక్ నాలుగు ఎకరాలు, గ్రామదట్లకు చెందిన రఘు 2 ఎకరాలు, మల్లాపురానికి చెందిన తిప్పేస్వామి రెండెకరాల్లో టమాటా సాగు చేశారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని వారు వాపోయారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం-కృష్ణతేజ, ఉద్యాన శాఖ అధికారి**

పంట దిగుబడి బాగానే ఉన్నా.. కొన్ని రోజులుగా ధరలు తగ్గుతుండటంతో రైతులకు నష్టాలు వస్తున్నాయి. వర్షాల కారణంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. ఉన్నతాధికారులతో మాట్లాడి ఎగుమతులు జరిగేలా ఏర్పాట్లు చేస్తాం.

## చెరువులను చెరబట్టారు!

శెట్టూరు: అక్రమార్కులు చెరువులను చెరబట్టారు. అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. శెట్టూరు మండలంలో యాటకల్లు, శెట్టూరు, కనుకూరు, ములకలేడు, తిప్పనపల్లి గ్రామాల్లో పలు చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయి. చిన్న చెరువులు, కుంటలు కనుమరుగవగా పెద్ద చెరువుల్లో యాభై నుంచి 100 ఎకరాల భూమి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లింది. ములకలేడు చెరువు శిఖంలో ఏకంగా బోర్లు వేసుకుని సాగు చేస్తుండటం గమనార్హం. కొందరు మట్టి తవ్వకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.ములకలేడు చెరువును ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించి సేద్యం చేస్తున్నాడని శెట్టూరు తహసీల్దారుకు ఇటీవల లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందింది.తిప్పనపల్లి చెరువు హద్దులు చెరిపేసిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడు.

**సర్వే చేసి.. తగిన చర్యలు తీసుకుంటాం- ఈశ్వరమ్మ, తహసీల్దారు**

చెరువులు, కుంటల ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు అందజేస్తాం. వారు ఎంతటివారైనా ఖాళీ చేయాల్సిందే. ఇటీవల ములకలేడు చెరువులో ఆక్రమణలపై ఫిర్యాదులు అందాయి. విచారించి తగిన చర్యలు తీసుకుంటాం.

## అలగనూరుకు అడుగులు

నంద్యాల : గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుంగిన అలగనూరు జలాశయం మరమ్మతులకు అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని మట్టి పరీక్షలు చేయిస్తోంది. నిపుణుల కమిటీ సూచనలు మేరకు పలు ప్రాంతాల్లో పరీక్షలు చేసి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. కట్ట కుంగడానికి నేల స్వభావం కారణమా ? పనుల్లో నాణ్యత లేకపోవడమా ? సరైన ప్రదేశంలోనే జలాశయం నిర్మించారా ? తదితర అంశాలను పరిశీలించారు.. జలాశయం కింది భాగంలో 5 మీటర్ల లోతులోనే రాయి ఉన్నట్లు గుర్తించారు. జలాశయం భద్రతకు ఇబ్బందేమి లేదని నివేదిక ఇచ్చారు.

**2018లో కుంగిన కట్ట**

కర్నూలు- కడప (కేసీ) కాల్వ ఆధునికీకరణలో భాగంగా అలగనూరు వద్ద జలాశయాన్ని 2004లో నిర్మించారు. అప్పట్లో రూ.70 కోట్లు వెచ్చించారు. తలముడిపి చెరువును అనుసంధానం చేస్తూ 3,636 ఎకరాల్లో దీని నిర్మాణం చేపట్టారు. ఇందులో 2.95 టీఎంసీల నీరు నిల్వ చేసి అవసరాన్ని బట్టి కేసీ కాల్వకు విడుదల చేస్తూ వచ్చారు. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో కలిపి దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. ఏటా రెండుసార్లు వరి సాగు చేస్తుంటారు. 2018లో కట్ట కుంగడంతో నీటిని నిల్వ చేయడం ఆపేశారు. అప్పటి నుంచి ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి.

**బిల్లులు ఇవ్వని వైకాపా**

మరమ్మతులకు 2021లో రూ.3.57 కోట్లతో టెండర్లు పిలిచింది. సదరు గుత్తేదారు సంస్థ 18.64 శాతం పనులు పూర్తి చేసింది. నిధులు



విడుదల చేయకపోవడంతో పనులు ఆపేశారు. ఒప్పందం కూడా 2023 డిసెంబరుతో ముగిసింది. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు.. కట్ట మరింత కుంగుతూ వచ్చింది.

అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం జలాశయంపై దృష్టి సారించింది. గతేడాది నిపుణుల బృందం జలాశయాన్ని పరిశీలించింది. చేపట్టాల్సిన పనులపై నివేదిక ఇచ్చారు. 2.5 కి.మీ. నుంచి 2.800 కి.మీ. వరకు బండ్‌ను తిరిగి నిర్మించాలని.. 2.825 కి.మీ. నుంచి 2.925 కి.మీ. వరకు మరమ్మతులు చేపట్టాలని.. 3.025 కి.మీ. నుంచి 3.125 కి.మీ. వరకు మరికొన్ని పనులు చేపట్టాలని సూచనలు నివేదికలో రూపొందించారు.


**రూ.36.26 కోట్లతో ప్రతిపాదనలు**

నిపుణుల బృందం పరిశీలన అనంతరం జలవనరుల శాఖ రూ.36.26 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. దెబ్బతిన్న కట్ట పునర్ నిర్మాణంతోపాటు బండ్ పొడవునా వివిధ చోట్ల చేయాల్సిన మరమ్మతులు, భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన పనులపై సమగ్ర నివేదికను రూపొందించింది. దాన్ని పరిశీలించిన ప్రభుత్వం కట్ట మరమ్మతులకు ఆమోద ముద్ర వేసింది. మట్టి పరీక్షలు పూర్తి కావొచ్చాయి.. జనవరిలోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

అలగనూరులో నీటిని నింపితే తలముడిపి చెరువు పరిధిలో ఉన్న 2,200 ఎకరాలు, 20 కి.మీ. మేర బోరుబావుల కింద మరో ఐదువేల ఎకరాలు పచ్చని పంటలతో కళకళలాడుతుంటుంది. అలగనూరు, రోళ్లపాడు, తలముడిపి, కొర్రపోలూరు తదితర గ్రామాలకు చెందిన సుమారు 600 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. ఏటా రూ.5 కోట్ల మేర చేపల వ్యాపారం జరుగుతుండేది.

## రూ.కోట్లు మింగిన చెరువులు

వడ్డిగూడెం :ఈ చిత్రంలో కనిపిస్తున్నది వడ్డిగూడెం గ్రామంలోని తాగునీటి చెరువు. 2022లో ఈ చెరువును ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 1,200 పని దినాలతో రూ.2,40,896 వేతనం చెల్లించి అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ ఫలసాయాన్నిచ్చే కొబ్బరి మొక్కలు వేశారు. ప్రస్తుతం చెరువు వినియోగంలో లేదు. గట్లపై పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో లక్ష్యం నీరుగారిపోయింది.తాగునీటి చెరువులను సంరక్షించి గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ పథకాన్ని 2022లో తీసుకువచ్చింది. ఈ పథకంలో భాగంగా అధ్వానంగా ఉన్న చెరువుల్లో పూడిక తీత పనులు చేసి గట్లను పటిష్ఠం చేయడంతోపాటు ఫలసాయాన్నిచ్చే మొక్కలు పెంచాలని ఆలోచన చేసింది. చెరువు



గట్లను వాకింగ్ ట్రాక్‌లుగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంలో ఆరోగ్యం అందించాలని నిర్ణయించింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఉపాధి హామీ పథకంలో అమృత్ సరోవర్ పథకం పేరుతో జిల్లా వ్యాప్తంగా మండలానికి 2 చొప్పున మొత్తం 80 తాగునీటి చెరువులను సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారు. పనులు పూర్తి చేసిన తరువాత స్థానిక పంచాయతీలు వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో చెరువులు అధ్వానంగా మారాయి. చెరువుల చుట్టూ వేసిన మొక్కలు చాలా చోట్ల కానరావడం లేదు. పలు గ్రామాల్లో చెరువుల అభివృద్ధి పనులు అసంపూర్తిగా వదిలివేశారు. అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేసిన చెరువుల పర్యవేక్షణ స్థానిక పంచాయతీలదేనని డ్వామా పీడీ కేసీహెచ్. అప్పారావు అన్నారు. అధ్వానంగా ఉన్న చెరువులను భవిష్యత్తులో ఉపాధి నిధులతో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు.

అభివృద్ధి చేసిన చెరువులు: 80

వెచ్చించిన నిధులు రూ. 3 కోట్లు

## చీరకట్టుతో చెమటలు పట్టిస్తున్న బేబమ్మ..

కన్నడ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న కృతి శెట్టి తొలిసారి.. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సన దర్శకుడిగా మారి తొలి ప్రయత్నంలో చేసిన 'ఉప్పెన' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమాలో బేబమ్మ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది కృతి శెట్టి. మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా, కృతి శెట్టి హీరోయిన్గా వచ్చిన ఈ సినిమా అతి తక్కువ సమయంలోనే 100కోట్ల క్లబ్లో చేరి సంచలనం సృష్టించింది. ఇద్దరికీ ఇది తొలి చిత్రమైనా.. తమ నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్నారు. ఈ సినిమా తర్వాత నానితో శ్యామ్ సింగరాయ్, నాగచైతన్యతో బంగార్రాజు వంటి చిత్రాలు చేసి హ్యాట్రిక్ సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన మొదట్లోనే హ్యాట్రిక్ అందుకున్న హీరోయిన్గా కూడా రికార్డు సృష్టించింది కృతి శెట్టి. ఆ తర్వాత పలు సినిమాలలో అవకాశాలు లభించాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయింది. అందులో భాగంగానే వరుస పరాజయాలు తలుపు తట్టడంతో కొంతకాలం ఇండస్ట్రీకి కూడా దూరమైంది ఇప్పుడిప్పుడే మళ్లీ తనను తాను కం బ్యాక్ చేసుకోవాలని చూస్తున్న కృతి శెట్టి.. ఇటు సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను అలరిస్తోంది. మొదట్లో పద్ధతిగా కనిపించి, ఆ తర్వాత గ్లామర్ డోస్ పెంచిన ఈమె తన అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు



ఫోజులిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి ఏకంగా చీరకట్టుతోనే చూసే ఆడియన్స్ కు చెమటలు పట్టించేసింది కృతి శెట్టి. తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఇన్ని రోజులు ఇంత అందాన్ని ఎలా మిస్ అయ్యాం అంటూ కామెంట్లు చేస్తున్నారు. శారీ విషయానికి వస్తే.. ఎంబ్రాయిడరీ నెట్టెడ్ లైట్ ఆరెంజ్ కలర్ తో డిజైన్ చేసిన చీరను కట్టుకొని , అందుకు కాంబినేషన్లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన బ్లౌజ్ లో తన ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా జుట్టును వదులుగా వదిలేసి సింపుల్ జువెలరీ తో తన మేకోవర్ ను ఫినిష్ చేసింది. ఇందులో నడుము, ఎద అందాలను హైలెట్ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు, అటు ఫేస్ ఎక్స్ప్రెషన్స్ కి కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. పైగా ఈ ఫోటోలకు దేశి గర్ల్ వైబ్స్ అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ముఖ్యంగా ఈమె అందాలను చూసి ఏఐ జనరేటర్ లాగా ఉంది అని కామెంట్లు చేస్తుంటే.. మరికొంతమంది లవ్, ఫైర్, స్మైల్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఇంకొంతమంది నువ్వే నా జాన్ అని కామెంట్లు పెడుతున్నారు. ఇలా ఎవరికి వారు తమ ప్రేమను ఒలకబోస్తూ కృతి శెట్టి ఫోటోలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కృతి శెట్టి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ ముద్దుగుమ్మ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తమిళంలో ఒక సినిమాలో నటిస్తోంది.

## ఖుషికి 100% ఫ్రీ... బోనీకపూర్ ఫుల్ హ్యాపీ

ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కూతురు, హీరోయిన్ జాన్వీ కపూర్ సోదరి అయిన ఖుషి కపూర్ ఇప్పటికే నటిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన విషయం తెల్సిందే. కెరీర్ ఆరంభంలో నటిగా కాకుండా డైరెక్షన్ వైపు ఆసక్తి చూపించిన ఖుషి కపూర్ ఇప్పుడు పూర్తి స్థాయి నటిగా మారి హీరోయిన్గా సినిమాలు చేసింది, ముందు ముందు ఈమె నుంచి మరిన్ని సినిమాలు వస్తాయని అంతా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో ఖుషి కపూర్ కి న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ వారు 100% స్కాలర్షిప్ ఇచ్చేందుకు సిద్ధం కావడం జరిగిందట. ఈ విషయాన్ని చాలా గర్వంగా ఖుషి కపూర్ తండ్రి బోనీ కపూర్ ప్రకటించారు. తన కూతురు ప్రతిభ పట్ల తనకు చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నాడు. ఖుషి కపూర్ న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో నటనలో మరింతగా శిక్షణ తీసుకునేందుకు అతి త్వరలోనే వెళ్లే అవకాశాలు ఉన్నాయని బాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

**ఖుషి కపూర్కి 100% స్కాలర్షిప్...** బోనీ కపూర్ తల్చుకుంటూ ఎంత ఫీజ్ అయినా కూతురు ఖుషి కపూర్కి చెల్లించి న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో జాయిన్ చేయగలరు. కానీ ఆమె నూరు శాతం స్కాలర్ షిప్ను దక్కించుకోవ




డంతో ఆమె ప్రతిభ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆమెకు నటనపై ఉన్న ఆసక్తి దీంతో బయట పడిందని కొందరు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి సోషల్ మీడియాలో ప్రస్తుతం ఖుషి కపూర్ నూరు శాతం స్కాలర్షిప్ గురించి గొప్పగా మాట్లాడుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఖుషి కపూర్ నటిగా ముందు ముందు మరిన్ని మంచి సినిమాలు చేస్తుందనే విశ్వాసం మాకు ఉంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తే, మరికొందరు అక్క గ్లామర్తో గుర్తింపు దక్కించుకుంటే ఖుషి ఖచ్చితంగా తన నటన ప్రతిభతో గుర్తింపు దక్కించుకుంటుంది అనే విశ్వాసంను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నారు.

**బోనీ కపూర్ హ్యాపీ..** ఇటీవల బోనీ కపూర్ ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఖుషి కపూర్ గురించి మాట్లాడుతూ.. తన యొక్క బెస్ట్ ఆడిషన్స్ వీడియోను న్యూయార్స్ ఫిల్మ్ అకాడమీకి ఖుషి పంపించడం వల్లే వంద శాతం స్కాలర్షిప్కు ఎంపిక అయిందని బోనీ కపూర్ అన్నాడు.

మీరు కూడా ఇలా చేయవచ్చు అంటూ ఆ కార్యక్రమానికి హాజరు అయిన వారికి బోనీ కపూర్ సూచించాడు. ఖుషి కపూర్ సాధించిన ఈ స్కాలర్షిప్ తండ్రిగా గర్వించేలా చేసిందని అన్నాడు. ఆమె రాబోయే రోజుల్లో బెస్ట్ నటిగా మరిన్ని గుర్తింపు, గౌరవాలు దక్కించుకోవాలని ఆశ పడుతున్నట్లుగా బోనీ కపూర్ చెప్పుకొచ్చాడు. ఖుషి కపూర్ ప్రతిభ విషయంలో బోనీ కపూర్ మాట్లాడుతున్న సమయంలో తండ్రిగా ఆయన చాలా సంతృప్తితో ఉన్నట్లుగా అర్థం అవుతుంది. ఖుషి కపూర్ బాలీవుడ్తో పాటు సౌత్లోనూ నటిస్తుందేమో చూడాలి.




## కోలీవుడ్ నటుడి ఆశలన్నీ దానిపైనే!



తమిళ నటుడే అయినా పలు డబ్బింగ్ సినిమాలతో టాలీవుడ్ లోనూ మంచి ఇమేజ్ తెచ్చుకున్నారు శివ కార్తికేయన్.

రీసెంట్ గా మదరాసి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన శివ కార్తికేయన్ ప్రస్తుతం పరాశక్తి అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆకాశమే నీ హద్దురా లాంటి సూపర్ హిట్ మూవీకి దర్శకత్వం వహించిన సుధా కొంగర ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

**పొంగల్ కానుకగా జనవరి 14న పరాశక్తి...** టాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ భామ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలో జయం రవి, అథర్వ, రానా దగ్గుబాటి కీలక పాత్రల్లో నటిస్తుండగా, డాన్ పిక్చర్స్ బ్యానర్ లో ఆకాష్ భాస్కరన్ పరాశక్తిని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. పరాశక్తి సినిమాను పొంగల్ కానుకగా జనవరి 14న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే.

**ఆఖరి దశ షూటింగ్ లో..** రిలీజ్ డేట్ టార్గెట్ ను అందుకోవాలని మేకర్స్ ఈ సినిమా షూటింగ్ ను వేగంగా పూర్తి చేస్తున్నారు. అందులో భాగంగానే ఈ సినిమా షూటింగ్ ఆల్మోస్ట్ పూర్తి కావొచ్చిందని, పరాశక్తి షూటింగ్ ఆఖరి దశలో ఉందని సమాచారం. వీలైనంత త్వరగా షూటింగ్ ను పూర్తి చేసి త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని ప్రారంభించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

**గట్టి పోటీనే..** ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. అమరన్ సినిమాతో భారీ బ్లాక్ బస్టర్ అందుకున్న శివ కార్తికేయన్ కు మదరాసి సినిమా కూడా అదే రేంజ్ సక్సెస్ ఇస్తుందనుకుంటే ఆ సినిమా రిజల్ట్ అతన్ని నిరాశ పరిచింది. దీంతో పరాశక్తితో మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కాలని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు శివ కార్తికేయన్. అయితే ఈసారి సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద భారీ పోటీనే ఉంది. తెలుగులో మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, అనగనగా ఒక రాజు తో పాటూ తమిళం నుంచి విజయ్ జననాయగన్ కూడా పోటీలో ఉన్నాయి. మరి ఈ పోటీలో పరాశక్తి ఏ మేరకు నిలబడుతుందో చూడాలి.

## అఖండ 2 : థియేట్రికల్ ట్రైలర్ పై బిగ్ అప్డేట్!



బాలకృష్ణ.. 65 ఏళ్ల వయసులో కూడా వరుస యాక్షన్ చిత్రాలలో నటిస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. ముఖ్యంగా షూటింగ్ సమయంలో ఈయన పెర్ఫార్మన్స్ లైవ్ లో చూసిన పలువురు సెలబ్రిటీలు కూడా కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు లేకపోలేదు. అలా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ కూడా.. ఏకంగా 15 డిగ్రీల రక్తం గడ్డకట్టే చలిలో బాలయ్య చేసిన పర్ఫామెన్స్ కి తాను ఒక్కసారిగా దండం పెట్టేసానని ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పి అందరిని ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం బాలయ్య అఖండ 2: తాండవం అంటూ ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే.

బోయపాటి శ్రీను దర్శకత్వంలో.. బాలయ్య హీరోగా వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ 'అఖండ' సీక్వెల్ గా రాబోతున్న చిత్రం 'అఖండ 2 తాండవం'. ఈ సినిమా పై అభిమానులలో మాత్రమే కాదు సినీ లవర్స్ లో కూడా అంచనాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఇందులో బాలయ్య మాస్4 పెర్ఫార్మన్స్ చూడడానికి ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన ఒక క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది. విషయంలోకి వెళ్తే ప్రస్తుతం చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా పూర్తి చేసే పనిలో పడ్డారు. అయితే ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ ని కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రాండ్ విజువల్స్ తో సాలిడ్ బిజిఎంతో ఈ ట్రైలర్ ను రిలీజ్ చేయడానికి మేకర్స్ పక్కా ప్లాన్స్ చేస్తున్నారట.

అంతేకాదు ఈ ట్రైలర్లో అఘోరా టచ్ తో పాటు ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఆకట్టుకునేలా.. ఈ ఒక్క ట్రైలర్ తో సినిమాపై అంచనాలు పెంచేలా.. అద్భుతంగా ట్రైలర్ ను డిజైన్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అభిమానులు, సినీ లవర్స్ ఈ ట్రైలర్ కోసం ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు దసరా సందర్భంగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది చిత్ర బృందం. డిసెంబర్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్ ట్రెండ్ సృష్టించగా.. అటు పోస్టర్స్ కూడా అంచనాలను పెంచేశాయి. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ తో పాటు సంయుక్త మేనన్ కూడా హీరోయిన్గా నటిస్తున్నారు. అఖండ 2 తాండవం సినిమా విషయానికి వస్తే.. ఎస్. తమన్ స్వరాలు అందిస్తున్నారు. ముఖ్యంగా మాస్, సెంటిమెంట్, యాక్షన్ అన్నీ కలిపిన సీక్వెల్.. పూర్తిగా మాస్ ఎంటర్టైన్మెంట్ అని అభిమానులు అంచనాలు వేస్తున్నారు. అటు బాలయ్య మాస్ పర్ఫామెన్స్ .. ఇటు బోయపాటి శ్రీను డైరెక్షన్.. తమన్ మ్యూజిక్ అన్నీ కలిపి సినిమాను ఈ ఏడాది తెలుగు సినిమా ప్రేక్షకుల కోసం మాస్ ఫెస్టివల్ గా మారుస్తాయని చెప్పడంలో సందేహం లేదు. ఏది ఏమైనా ట్రైలర్ రిలీజ్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. మరి ఈ ట్రైలర్ రిలీజ్ తర్వాత సినిమాపై ఇంకా క్రేజ్ పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

## బాలీవుడ్ పై రాశీ ఖన్నా సంచలన కామెంట్స్

టాలీవుడ్ లో సినిమాలు చేసే హీరోయిన్లకు గౌరవం ఎక్కువగా ఉంటుందని హీరోయిన్ రాశీ ఖన్నా రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. టాలీవుడ్ ఇండస్ట్రీలో నటీనటుల మధ్య చాలా మంచి ఫ్రెండ్షిప్, బెస్ట్ అట్మాస్ఫియర్ ఉంటుందని, మరీ ముఖ్యంగా ఇక్కడ హీరోయిన్లకు చాలా రెస్పెక్ట్ ఇస్తారని, టాలీవుడ్ లో వర్క్ చేస్తుంటే ఎప్పుడూ ఒక ఫ్యామిలీలో ఉన్నట్టే అనిపిస్తుందని రాశీ ఖన్నా చెప్పారు.

**తెలుగు ఆడియన్స్ ఎక్కువ అభిమానం చూపిస్తారు...** టాలీవుడ్ లో వర్కింగ్ అవర్స్ చాలా క్రమబద్ధంగా ఉంటాయని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే కాల్షీట్స్ ఉంటాయని, బాలీవుడ్, తమిళ ఇండస్ట్రీలో ఒక్కో కాల్షీట్ 12 గంటలు ఉంటుందని, అందుకే ఎక్కువగా అలసిపోతామని, పైగా తెలుగు ఆడియన్స్ తనపై ఎక్కువ అభిమానం చూపిస్తూ ఉంటారని, తాను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా తెలుగు ఫ్యాన్స్ ఆదరిస్తారని ఆమె పేర్కొన్నారు.



**సౌత్ ఇండస్ట్రీని చూసి నేర్చుకోవాలి...** సౌత్ లో దొరికినట్టు నార్త్ లో రెస్పెక్ట్ దొరకదని, బాలీవుడ్ లోని నటీనటులు ఆడంబరంగా ప్రవర్తిస్తారని, సౌత్ ఇండస్ట్రీని చూసి నార్త్ లోని కొంతమంది నేర్చుకోవాలని రాశీ చెప్పడంతో ఆ కామెంట్స్ సోషల్ మీడియాలో చర్చకు దారి తీశాయి. నార్త్ లో ఎక్కువ సినీ అవకాశాలు రాకపోవడంతో ఇలా ఇష్టమొచ్చినట్టు కామెంట్స్ చేయడం సరికాదని రాశీని కొందరు తప్పుబడుతున్నారు. కానీ మరికొందరు మాత్రం తన అభిప్రాయం తాను చెప్పింది ఇందులో తప్పేముందని రాశీని వెనుకేసుకొస్తున్నారు. అయితే రాశీ మాత్రం తన అనుభవాన్ని మాత్రమే చెప్పానని చెప్తున్నారు. చాలా రోజుల తర్వాత రాశీ ఖన్నా తెలుగులో సిద్ధూ జొన్నలగడ్డ తో కలిసి తెలుసు కదా అనే సినిమా చేయగా, ఆ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుసు కదా ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్న రాశీ ఓ ఇంటర్వ్యూలో ఈ కామెంట్స్ చేశారు. ఈ సినిమా హిట్టైతే టాలీవుడ్ నుంచి మరిన్ని అవకాశాలొస్తాయని రాశీ తెలుసు కదాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

## అందుకే డెలివరీ తర్వాత బరువు తగ్గా..

బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది అలియా భట్. తన అద్భుతమైన నటనతో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె కెరియర్ పీక్స్ లో ఉండగానే ప్రముఖ హీరో రణబీర్ కపూర్ తో ఏడడుగులు వేసింది. అదే ఏడాది పండంటి అమ్మాయికి కూడా జన్మనిచ్చింది. కూతురుకి రాహా అని నామకరణం చేసింది ఈ జంట. ఇకపోతే రాహా జన్మించిన తర్వాత తమ జీవితంలోనే కాదు లైఫ్ స్టైల్ లో కూడా చాలా మార్పులు వచ్చాయి అని.. అలవాటు లేని పనులు కూడా చేయాల్సి వస్తోంది అంటూ సరదాగా చెప్పుకొచ్చింది ఆలియా భట్. అంతేకాదు తాను డెలివరీ తర్వాత వేగంగా బరువు తగ్గడానికి గల కారణాన్ని కూడా ఆమె బయటపెట్టింది. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రముఖ బాలీవుడ్ నటీమణులు కాజోల్, ట్వింకిల్ కన్నా అమెజాన్ ప్రైమ్ వీడియోలో "టూ మచ్" అనే ఒక టాక్ షో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ సహనటుడు వరుణ్ ధావన్ తో కలిసి ఆలియా భట్ ముఖ్య అతిథిగా హాజరయ్యింది. ఈ టాక్ షోలో తన నిద్రతీరు గురించి కూడా ఆమె మాట్లాడుతూ.. "నేను ఎప్పుడూ కూడా త్వరగా పడుకొని త్వరగా లేచే వ్యక్తిని. కానీ రాహా పుట్టిన తర్వాత నా నిద్ర టైమింగ్లో చాలా మార్పులు వచ్చాయి. నేను మేల్కొనకూడదు అనుకున్నాను. సాధారణంగా నేను తొమ్మిదిన్నర గంటలకే నిద్రపోతాను. అయితే ఇప్పుడు నిద్రపోయిన



గంటలను లెక్కిస్తున్నాను. కానీ ఇదంతా నా కూతురు కోసమే అని తెలిసి మరింత సంతోషంగా ఉంది"అంటూ చెప్పుకొచ్చింది. అలాగే రాహాకు జన్మనిచ్చిన తర్వాత నేను వేగంగా బరువు తగ్గిపోయాను.దీంతో చాలామంది నాపై విమర్శలు గుప్పించారు.. అసలు నిజం ఏమిటంటే.. రాహాకు జన్మనిచ్చిన తర్వాత నేను వేగంగా బరువు తగ్గాను. తల్లిపాలు ఇవ్వడం వల్ల చాలా క్యాలరీలు ఖర్చు అవుతాయి. ముఖ్యంగా నేను ఎంత తిన్నా సరే సహజంగానే బరువు తగ్గాను. అయితే నా ఫోటో బయటకు వచ్చినప్పుడు నేను అసహజ పద్ధతులలో బరువు తగ్గాను అంటూ నాపై చాలామంది ట్రోల్స్ చేశారు.. ఎందుకు అంత త్వరగా బరువు తగ్గాల్సి వచ్చింది అంటూ కూడా కామెంట్లు చేశారు. అయితే మేము ఆ ట్రోల్స్ ని పెద్దగా పట్టించుకోలేదు. సాధారణంగా చాలామందిలో ఇలాంటి మార్పులు జరుగుతూనే ఉంటాయి. కానీ నేను సహజ పద్ధతిలోనే బరువు తగ్గాను"అంటూ అలియా భట్ చెప్పుకొచ్చింది. ఇకపోతే ఆలియా భట్ లో వచ్చిన ఈ మార్పులను అటు కాజోల్ ఇటు ట్వింకిల్ కన్నా ప్రోత్సహించారు. ప్రస్తుతం మహిళలు తమ శరీరాలను ఏ పరిమాణంలోనైనా సరే ఆలింగనం చేసుకోవాలని.. అదే దిశగా తమను తాము ప్రోత్సహించుకోవాలని తెలిపారు. అటు ప్రజలు కూడా నువ్వు అలా చేయి.. నువ్వు ఏ పరిమాణంలో ఉండాలనుకుంటున్నావో అలాగే ఉండు.. అని నాతో కూడా చెప్పారు. ప్రస్తుత కాలంలో బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తల్లిలో వచ్చే మార్పులను నిజంగా ఎవరూ పట్టించుకోరు. అది రిఫ్రెషింగ్ గా ఉంది అంటూ కూడా ఆలియా తెలిపింది. మొత్తానికైతే బరువు తగ్గడంపై వచ్చిన ట్రోల్స్ కి గట్టి కౌంటర్ ఇచ్చింది ఆలియా.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536